

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 128 పేజీలు: 16 వెల: 6.50




ఉమన్స్ ర్యాపిడ్ చెస్ టోర్నీ ఛాంపియన్‌గా **వైశాలి**

రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు -'ఆట'లో

## రేపు తిరుపతిలో ఎన్‌డియే సభ

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజా దర్బార్

హాజరుకానున్న సిఎం చంద్రబాబు, జనసేనాని పవన్, బిజెపి చీఫ్ మాధవ్ 3లో

## గోల్డెన్ అవర్‌లో గోల్డెన్ సర్వీస్

108 రూపురేఖలు మార్చేసిన కూటమి ప్రభుత్వం 3లో

## పశ్చిమ గోదావరి జిల్లాలో నేడు సిఎం పర్యటన

సిద్ధాంతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ 2లో



మాస్కోలో ఆదివారం గిరెడ్మెట్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేష్

## నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం

గిరెడ్మెట్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ

ఎపికి సాంకేతిక భాగస్వామ్యం అవసరం

మాస్కో అణుశక్తి మ్యూజియం సందర్శన

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాస్కోలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారతదేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు గిరెడ్మెట్ వంటి సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యం భవిష్యత్తులో విలువైన అవకాశాలను తెరుస్తుంది. విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్‌హబ్‌ను ఏర్పాటుచేసే అవకాశాలను పరిశీలించండి. భారతదేశంలో విస్తరిస్తున్న ఇవి, పవన విద్యుత్ మార్కెట్లకు సరఫరా చేయడానికి, గిరెడ్‌మెట్ ప్రాసెసింగ్ టెక్నాలజీని ఉపయోగించి, నెల్లూరులో ఫుల్ సైకిల్ >>2

# నిధుల కొరత లేదు

## నిర్ణీత కాలంలో ప్రాజెక్టులు పూర్తి

సాస్కీ, పూర్వోదయ ద్వారా అభివృద్ధి పనులు

15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా కార్యాచరణ

పోలవరం, అమరావతి పూర్తయితే సంపద సృష్టి

జులై 1 నుంచి విబి జి రామ్ జి అమలు

మీడియాతో ఇష్టాగోష్టిలో సిఎం చంద్రబాబు



**డబుల్ ఇంజిన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**

కూటమి నేతలతో సిఎం 2లో

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా మైక్రో, మాక్రో స్థాయిలో ప్రణాళికలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా పూర్తి స్థాయి ఉత్పాదకతను చేరుకోవాలని ఆర్థికశాఖకు సూచించామన్నారు. 15శాతం మేర వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్రస్థాయి వరకూ ఈ ప్రణాళికల్ని సమర్థంగా అమలే చేయాలనే నిర్ణయంతో ఉన్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మీడియాతో చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రాష్ట్రంలో నీరు, విద్యుత్ లాంటి వనరుల్ని వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేరకు అందిస్తున్నామనిఅన్నారు. రాష్ట్రంలో ఉత్పాదకత పెంపుదిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఉన్నా విద్యుత్ చార్జీలు పెంచలేదని అన్నారు. గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ప్రజలపై ఎలాంటి భారం లేకుండా ఆదాయార్జన శాఖల రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి అయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని సిఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రాధన్యతా ప్రాజెక్టులకు ఎలాంటి నిధుల కొరతా లేదని కేంద్ర సహకారంతో వాటిని పూర్తి చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

పూర్వోదయ సాస్కి లాంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం కావాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సంక్షేమ క్యాలెండర్‌కు అనుగుణంగానే పథకాలను అమలు చేస్తామని సిఎం చంద్రబాబు వివరించారు. ఎపి పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. పేదలకు అన్నంపెట్టే అన్న క్యాంటీన్లను గత పాలకులు నిర్దయంగా మూసివేశారని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా అన్నార్తుల కడుపు నింపే రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో భోజనం పెడుతున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్థ్యంతో పాటు సులభతరమైన విధానాల ద్వారా పెట్టుబడులు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడాంకానీ ఇప్పుడు గేర్‌మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడుతున్నామన్నారు. నాడు ఒక్క ఐటీనే యువత తల రాత మార్చిందని గుర్తు చేశారు. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు >>2





## గ్రీన్ కార్డ్ ఆశావహులకు శుభవార్త

ట్రంప్ ఆదేశాలు చట్టవిరుద్ధం

యుఎస్‌సిఐఎస్ విధానాలు సరికాదు

ఫెడరల్ కోర్టు కొట్టివేత... కీలక తీర్పు

దరఖాస్తుదారులకు ఊరట

**వాషింగ్టన్, జూన్ 7:** అమెరికా గ్రీన్ కార్డు కోసం కలలు కంటున్న ఆశావహులకు శుభవార్త. దాదాపు 39 దేశాలకు చెందిన వలసదారుల గ్రీన్ కార్డ్‌లు, వర్క్ పర్మిట్‌లు, ఆశ్రయం, పౌరసత్వ దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేస్తూ ట్రంప్ ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన కఠినమైన విధానాలను ఫెడరల్ కోర్టు కొట్టివేసింది. పూర్తి లేదా పాక్షి క ప్రయాణ నిషేధాల కింద >>2

## యోగాభ్యాసంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు

విజయవాడలో పోలీసుల ఆధ్వర్యంలో యోగాసనాలు

హోంమంత్రి అనిత, సిపి రాజశేఖర్ బాబు హాజరు

లేపాక్షిలో యోగా శిక్షణా తరగతులు ప్రారంభం

మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత హాజరు



ఆదివారం విజయవాడలో యోగాసనాలు చేస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి మంచిదని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. యోగా మనిషి ఆలోచన విధానంలో ప్రయోజనకర మార్పులు తీసుకుని వస్తుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల ఆదివారం నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎన్‌టిఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బిఆర్‌టిఎస్ రోడ్డు వద్ద పోలీసు శాఖలో మానసిక, శారీరక ఆరోగ్యం పెంచడానికి నగర పోలీస్ కమిషనర్ వి.రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోంమంత్రి అనిత హాజరయ్యారు. పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు సుమారు 5000 మంది పాల్గొని యోగాసనాలు చేసారు.. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని తామే కాపాడుకోవాలనే సకల్పంతో యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతిలో వేల యేళ్ల చరిత్ర కలిగిన యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 150కు పైగా దేశాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. యోగాకు ప్రత్యేక ఖర్చులు అవసరం లేదని, పేదవాడు నుంచి ధనికుడి వరకు ప్రతి ఒక్కరూ కేవలం ఒక మ్యాట్‌తో యోగాను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు >>2



## వంటింట్లో గ్యాస్ మంట!

సిలిండర్ ధర పెంపు


రూ. 29 పెంచిన ఒఎంసిలు 5లో

పెంపుపై ఖర్గే మండిపాటు

సమర్థించుకున్న కేంద్రం

# ఎల్ నినో మొదలైంది!

● పసిఫిక్‌లో పరిమితి దాటిన ఉష్ణోగ్రతలు ● గాడ్జిల్లా ఎల్ నినో రికార్డులను బద్దలు కొట్టొచ్చు ● ప్రమాదంలో పడ్డ నైరుతి రుతుపవనాలు ● ఇప్పటికే రుతుపవనాలు రాక ఆలస్యం ● అత్యంత బలమైన ఎల్ నినోగా మారొచ్చు ● యూరోపియన్ వాతావరణ నిపుణుల అంచనా





**న్యూఢిల్లీ, జూన్ 7:** ప్రతి జూన్‌లో, భారతదేశం అదే శబ్దం కోసం ఎదురుచూస్తుంది. రేకుల పైకప్పుపై పడే మొదటి భారీ చినుకుల శబ్దం. వేల సంవత్సరాలుగా వస్తున్న విధంగానే రుతుపవనాల రాక. ఒక కొత్త అంచనా ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం పసిఫిక్ మహా సముద్రంలో వస్తున్న ఒక పెద్ద మార్పు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్(ఇసిఎండబ్ల్యూఎఫ్) తాజా నివేదిక ప్రకారం ఉష్ణ మండల పసిఫిక్ మహా సముద్రం అధికారికంగా ఎల్ నినో ప్రారంభాన్ని సూచించే కీలకమైన ఉష్ణోగ్రత పరిమితిని దాటింది. పసిఫిక్ మహాసముద్రంలో ఇప్పుడు రూపుదిద్దుకుంటున్న ఎల్ నినో, ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైనదిగా మారవచ్చు. సినిమాల నుండి తీసుకున్న 'గాడ్జిల్లా ఎల్ నినో' అనే మారుపేరు దీనికి ఇప్పటికే వచ్చింది. నైరుతి రుతుపవనాలు, కనీసం, వచ్చేశాయి. అవి మూడు రోజులు ఆలస్యంగా, జూన్ 4న కేరళ తీరాన్ని చేరుకుని, ఇప్పుడు ఉత్తరం వైపు నెమ్మదిగా కదులుతున్నాయి. ఎల్ నినోను కచ్చితంగా అంచనా వేయడం కష్టం. శాస్త్రవేత్తలు అత్యంత నిశితంగా గమనించే జలభాగం, ఎల్ నినో పరిస్థితులను నిర్వచించే గీతను దాటి ఇప్పటికే వేడెక్కింది. యూరోపియన్ వాతావరణ నిపుణులు ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థలు ఇప్పుడు అధికారికంగా ఎల్ నినో ఆరంభాన్ని ప్రకటించాయి, సెప్టెంబర్ నాటికి పరిస్థితులు గణనీయంగా బలపడతాయని భావిస్తున్నారు. భారత వాతావరణ శాఖ ఈ సంవత్సరం సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని ఇప్పటికే అంచనా వేసింది. ఆశించిన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90 శాతంగా ఉంటుందని తెలిపింది.

**ఎల్ నినో అంటే ఏమిటి?:**

ఎల్ నినో అనేది ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ (ఇఎన్‌ఎస్‌ఒ) అని పిలువబడే ఒక భారీ వాతావరణ డోలనంలో ఒక భాగం. ఉష్ణమండల పసిఫిక్‌ను ఒక ఊయలలా ఊహించుకోండి. ఒక వైపు వెచ్చని దశ, ఎల్ నినో. మరో వైపు చల్లని దశ, లా నినా. సాధారణంగా, వాణిజ్య పవనాలు అని పిలువబడే స్థిరమైన గాలులు వెచ్చని ఉపరితల నీటిని పసిఫిక్ మీదుగా ఆసియా వైపు నెడతాయి. ఎల్ నినో సమయంలో, ఆ గాలులు బలహీనపడతాయి. వెచ్చని నీరు తిరిగి తూర్పు వైపుకు జారుతుంది. సముద్రం తన వేడిని నిల్వ చేసుకునే ప్రదేశాన్ని మార్చుకుంటుంది. శాస్త్రవేత్తలు దీనిని మధ్య పసిఫిక్‌లోని నినో 3.4 ప్రాంతం అని పిలువబడే ఒక ప్రదేశంలో పర్యవేక్షిస్తారు. అక్కడ వారపు ఉష్ణోగ్రతలు ఇప్పటికే సాధారణం కంటే సుమారు 0.9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా పెరిగాయి, ఇది ఎల్ నినోను సూచించే 0.5డిగ్రీల >>2

## అటు ఎండలు ఇటు వానలు

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఒక పక్క ఎండలు,మరొక పక్క ఉరుములు మెరుపులతో కూడిన వాతావరణం కొనసాగుతుంది.ఆదివారం ప్రకాశం జిల్లా కారేడులో 43.5 డిగ్రీలు, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 43.4, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం,కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 43.2, పల్నాడుజిల్లా పిడుగురాళ్లలో 43.1, కోనసీమ జిల్లా రామచంద్రాపురం, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 42.7, తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణగూడెం, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, గుంటూరు జిల్లా పాంద్రపాడు, నెల్లూరు జిల్లా గూడూరులో 42.6, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 42.5 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. .ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముఖ్యంగా వృద్దులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కర్ణాటక పరిసర ప్రాంతాల నుండి కోస్తాంధ్ర తీరప్రాంతం వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో సోమ, మంగళవారాల్లో అల్లూరి, పోలవరం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో >>2

8-06pg2exHMNWJQE.qxd:8-06pg2exHMNWJQE.qxd 1/1/02 6:45 AM Page 1



# ఆశావహులకు శుభవార్త

>> ఉన్న 39 దేశాల జాతీయుల ఆశ్రయం, పని అనుమతి, గ్రీన్ కార్డ్, పౌరసత్వ దరఖాస్తులను నిలిపివేసిన లేదా ఆలస్యం చేసిన నాలుగు యుఎస్‌సిఐఎస్ విధానాలను కొట్టివేశారు. ఆ ఏజెన్సీకి చట్టబద్ధమైన అధికారంలేదని, వలస, పరిపాలనా చట్టాలను ఉల్లంఘించిందని, వలస వ్యతిరేక భావాలను కప్పిపుచ్చే 'సాకు'గా జాతీయ భద్రతా ఆందోళనలపై ఆధారపడిందని రోడ్ ఐలాండ్‌లోని ఫెడరల్ కోర్టు చీఫ్ జడ్జి జాన్ మెక్‌కానెల్ కీలక తీర్పునిచ్చారు. ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చిన ఈ నిబంధనల వల్ల ఎంతో మంది వలస దారుల జీవితాలు చట్టపరమైన సందిగ్ధతలో పడిపోయాయని న్యాయ మూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు. యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) తన పరిధినిదాటి, చట్ట విరుద్ధంగా దరఖాస్తులను నిలిపివేసిందని కోర్టు పేర్కొంది. దరఖాస్తుదారులు అందరూ అమెరికా కాంగ్రెస్ రూపొందించిన చట్టా లను, నిబంధనలను సరిగ్గా పాటించినప్పటికీ కేవలం వారుపుట్టినదేశాల ఆధారంగా వారి ప్రక్రియను నిలిపివేయడం ఏమాత్రం సమర్థ నీయం కాదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ కోర్టు తీర్పుతో గత కొంతకాలంగా నిలిచిపోయిన గ్రీన్ కార్డ్, వర్క్ పర్మిట్ దరఖాస్తుల పునఃపరిశీలన ప్రక్రియ మళ్లీ ప్రారంభం కానుంది. ముఖ్యంగా ఆయా దేశాల నుండి వచ్చి చట్టబద్ధమైన నివాసం కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది విదేశీయులకు, వారిపై ఆధారపడిన కుటుంబాలకు ఈ నిర్ణయం ఎనలేని ఊరటనిచ్చింది. ఫెడరల్ కోర్టు తీర్పు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారికంగా ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. డిహెచ్ఎస్ జనరల్ కౌన్సెల్ జేమ్స్ పెర్సివాల్ బహిరంగ వ్యాఖ్యలలో ఈ తీర్పును విమర్శించారు, అయితే పరిపాలనకు ఫస్ట్ సర్క్యూట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. ట్రంప్ హయాంలోని ఇలాంటి వలస చర్యలను ఈ సర్క్యూట్ గతంలో కూడా విమర్శించిందని వలసదారుల హక్కుల కార్యకర్తలు పేర్కొన్నారు.

## పుట్టపర్తిలో వెనిజులా అధ్యక్షురాలు
### విద్యా సంస్థలను సందర్శించిన డెల్సీ రోడ్రిగెస్

**పుట్టపర్తి టౌన్, జూన్ 7, ప్రభాతవార్త:** పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా నిలకొల్పిన విద్యాసంస్థలను వెనిజులా బొలివేరియన్ రిపబ్లిక్ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సి రోడ్రిగెస్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు సత్య సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లెర్నింగ్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్శనలో శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ ఆమెను వెంట తీసుకువెళ్లారు. అనంతరం ఉపకులపతి ప్రొఫెసర్ బి. రాఘవేంద్ర ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీకాంత్ ఖన్నా మరియు ఇతర సీనియర్ అధికారులు ఆమెకు సంస్థ అభివృద్ధి, విద్యా విధానం మరియు పరిశోధనా కార్యక్రమాలపై సమగ్ర వివరణ అందించారు. సత్యసాయి విద్యాసంస్థలు అనుసరిస్తున్న విలువల ఆధారిత సమగ్ర విద్యా విధానం, పరిశోధనల్లో సాధించిన పురోగతి, విద్యా నాణ్యత మరియు సమాజంపై చూపుతున్న ప్రభావంపై ప్రతినిధుల బృందాలకి క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా డెల్సీ రోడ్రిగెస్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థను సందర్శించే అవకాశం కలిగినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా స్థాపించిన విలువల ఆధారిత విద్యాతత్వాన్ని ఆమె ప్రశంసించారు. ప్రపంచ విద్యా వ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో మానవత విలువలతో కూడిన విద్య ఎంతో వసరమని ఆమె అభిప్రాయపడ్డారు. వ్యక్తిత్వ వికాసం మరియు విద్యా ప్రావీణ్యాన్ని సమన్వయం చేయడంలో శ్రీ సత్య సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లెర్నింగ్ సాధించిన విజయాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. విద్య, సేవ మరియు మానవ శ్రేష్ఠతను కలిపిన ఈ మోడల్ సమాజంపై చూపుతున్న సానుకూల ప్రభావాన్ని ఆమె గుర్తించారు. ఈ సందర్శన పరస్పర ఆలోచనల మార్పిడికి, విద్యా సహకార అవకాశాలకు దోహదపడిందని అధికారులు పేర్కొన్నారు.

## లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన కర్ణాటక న్యాయమూర్తులు

**లేపాక్షి, జూన్ 7 ప్రభాతవార్త:** లేపాక్షి మండల కేంద్రంలోని చారిత్రాత్మక నేపథ్యం కలిగిన శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం కర్ణాటక న్యాయమూర్తులు సందర్శించారు. కర్ణాటక రాష్ట్ర పరిపాలనా ట్రిబ్యునల్ (బెంగళూరు) అఫీషియేటింగ్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ ప్రభాకర్ శాస్త్రి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మంజునాథ్ విడివిడిగా ఆలయానికి విచ్చేసారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసకుమార్ వారికి ప్రత్యేక అర్చనలుచేసి ఆశీర్వచనాలు అందించారు. దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎం.హెచ్. నరసింహ మూర్తి స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో వారిని ఘనంగా సత్కరించారు.

**అన్నప్రసాద వితరణపై ప్రశంసలు :**
న్యాయమూర్తులు ఇరువురు వీరభద్ర అన్నప్రసాదం సేవా ట్రస్ట్‌ను సందర్శించారు. అక్కడ భక్తులకు జరుగుతున్న అన్నదాన వినియోగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రస్టు సభ్యులు నిరంతరాయంగా అందిస్తున్న సేవలను, నాణ్యమైన అన్నప్రసాదం వితరణను ఈ సందర్భంగా వారు ఎంతగానో కొనియాడారు.

## జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా కమిటీల రద్దు
### - పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ నాయకత్వంలో క్రమశిక్షణ లోపించడం, పార్టీ విధి విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ మద్దతుదారులు, జనసైనికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై పార్టీని బలోపేతం చేశామని, అయితే కొందరు నాయకుల ప్రవర్తన ఆ లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు.నడవదని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ వివరించారు.

కొద్ది రోజుల క్రితం ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో నాయకుల మధ్య విభేదాలు, సమన్వయ లోపం, క్రమశిక్షణరాహిత్యం కారణంగా పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో పార్టీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉమ్మడి నెల్లూరు జిల్లా, నగర, మండల, గ్రామస్థాయి కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే జిల్లా సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న వారితో పాటు కమిటీల్లోని ఇతర సభ్యులను కూడా తమ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.క్రమశిక్షణ లేని చోట పార్టీ వ్యవస్థ సక్రమంగా కొత్త కమిటీ నియామకం జరిగే వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను జనసేన కేంద్ర కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు.

# నిధుల కొరత లేదు

>> వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయని పేర్కొన్నారు. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, ఎంఒయులన్నీ పూర్తయితే ఇది సాధ్యమేనని చంద్రబాబు అన్నారు. ఏ ఆలోచన చేసినా, ఏ సంస్కరణ చేసినా యువత కోసమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. సాధారణ రైతు బిడ్డ నుంచి ప్రతిఒక్కరికి ఐటీ రంగంలో అవకాశాలు వచ్చాయన్నారు. ఐటి రంగంలో మన బిడ్డలు సాధించిన విజయాలు చూస్తే ఆనందంగా ఉందన్న చంద్రబాబు, నాటి విజన్ 2020, నేటి స్వర్ణాంధ్ర 2047 యువత కోసమేనన్నారు. యువగళంలో ఇచ్చిన హామీల కంటే అధికంగా అమలు చేస్తామని వివరించారు. ఉపాధి హామీ పథకంలో కేంద్రం పలు మార్పులను చేస్తూ తీసుకొచ్చిన విబి జి రామ్ జి పథకాన్ని ఎపిలో ఈ యేడాది జులై ఒకటో తేదీ నుండి అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు.

**సంవత్సరానికి అదనంగా రూ.7,675 ఆదాయం:**
విబి జి రామ్ జి అమల్లోకి రావడం వల్ల ప్రస్తుతం ఉన్న ఉపాధి హామీ కార్యక్రమం నిలిచిపోతుంది. ఈ నూతన కార్యక్రమంలో 100 రోజుల ఉపాధి 125 రోజులకు పెరుగుతుంది. దాంతో గ్రామీణ కుటుంబాలకు అదనంగా మరో 25 రోజుల పని చేకూరినట్లవుతుంది. ఎపిలో సగటు కూలీ రూ.307గా గణిస్తే ప్రతి ఏడాదికి రూ.7,675 వరకు ఆదాయంగా వృద్ధి నమోదవుతుందని ప్రభుత్వం లెక్కించింది. నూతన చట్టం ప్రకారం పరిశీలిస్తే ఉపాధి మొత్తాల చెల్లింపు ప్రక్రియను కేవలం వారం రోజుల్లోనే పూర్తి చేయాలి. ఒకవేళ 15 రోజులకు మించి చెల్లింపు ఆలస్యమైతే ఆ మొత్తంపై 0.5శాతం వడ్డీని సైతం కలిపి చెల్లించాల్సి ఉంటుంది.

విబి జిరామ్ జి పథకం కింద రూ.10 వేల కోట్లు ఎపికి కేటాయించారు. కొత్త పథకంలో కేంద్రం, రాష్ట్రం 60:40 నిష్పత్తిలో ఖర్చులను భరించాలి. వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు ఈ పథకంలో ఉపాధికి సెలవు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకునే అధికారాన్ని అన్ని జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

# సంపూర్ణ ఆరోగ్యం



ఆదివారం లేపాక్షి వీరభద్రాలయం ప్రాంగణంలో యోగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు సత్యకుమార్, సవిత

>> సాగుతోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

**లేపాక్షిలో ఘనంగా ప్రారంభమైన యోగా శిక్షణా తరగతులు**
ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన లేపాక్షి వీరభద్రాలయం ప్రాంగణంలో ఆదివారం యోగా శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ శిక్షణా తరగతుల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత, జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డ్వామా పిడి నరసయ్య, నియోజకవర్గ ప్రత్యేక అధికారి చక్రపాణి, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్యలతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. యోగా మాస్టర్ శ్రీనివాసరెడ్డి యోగా శిక్షణను ప్రారంభించారు. దాదాపు గంటకు పైగా సాగిన యోగా కార్యక్రమంలో అధికారులు, జవహర్ నవోదయ విద్యార్థులు యోగాభ్యాసం చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ జిల్లాస్థాయి యోగా శిక్షణా కార్యక్రమాన్ని లేపాక్షి వీరభద్రాలయం ప్రాంగణంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం ఆనందదాయకమన్నారు. యోగాను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలన్నారు. యోగాతో శరీర రుగ్మతలను దూరం చేయవచ్చన్నారు. ఆనందమయ జీవితానికి యోగ ఎంతో ఉపయోగకారిగా ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపుమేరకు జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ప్రతి వ్యక్తి రోజు ఉదయం అరగంట యోగా చేస్తే మానసిక, శారీరక ప్రశాంతత చేకూరుతుందన్నారు. విద్యార్థులు యోగాభ్యాసాన్ని మరువరాదన్నారు. యోగాతో ఏకాగ్రత సాధ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ యోగా రోజు అభ్యసించడం వల్ల నిత్య యవ్వనంగా ఉండవచ్చన్నారు. యోగా వల్ల విద్యార్థులకు ఏకాగ్రత కుదురుతుందన్నారు.

ప్రతిరోజు యోగా చేయడం వల్లనే ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ యోగ భారతదేశ వారసత్వ సంపద అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ కృషితో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. 177 దేశాలకు యోగాను పరిచయం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోడీకి దక్కిందన్నారు. యోగ సాధన వల్ల బిపి, డయాబెటిస్ వంటి రోగాలు దరిచేరవన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. వాటి వల్ల విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకుంటారని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రులు యోగాలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని మంత్రులు పిలుపునిచ్చారు.

# ఎల్‌నినో మొదలైంది!

>> స్థాయిని దాటింది.

**ఎల్ నినో ఎంత బలపడుతుంది?:**
ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ అయిన ప్రపంచ వాతావరణ సంస్థ, ఎల్ నినో ఆరంభాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఈ వేడెక్కడం దాని గమనాన్ని కొనసాగిస్తున్నందున, 2026 మిగిలిన కాలమంతా ఈ సంఘటన బలపడేందుకు 80 నుండి 90 శాతం సంభావ్యత ఉందని ఆ సంస్థ ఇప్పుడు అంచనా వేస్తోంది. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ అంచనా ప్రకారం, నినో 3.4 ప్రాంతం డిసెంబర్ నాటికి సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతకు చేరుకుంటుంది, కొన్ని అంచనాలు 4 డిగ్రీల సెల్సియస్‌ను కూడా తాకుతున్నాయి. అది 1997-1998, 2015-2016 సంవత్సరాల ఉమ్మడి రికార్డులను అధిగమిస్తుంది. గత ఎల్ నినో కారణంగా 2024 సంవత్సరం, ఇప్పటివరకు నమోదైన అత్యంత వేడి సంవత్సరంగా నిలిచింది.

**భారత వ్యవసాయ రంగంపై పెనుప్రభావం**
భారతదేశానికి, ఎల్ నినో సాధారణంగా ఒకే విషయాన్ని సూచిస్తుంది. బలహీనమైన రుతుపవనాలు. దానికి కారణం సముద్రంపై ఉన్న గాలిలో ఉంది. పసిఫిక్ మహాసముద్రం వేడెక్కినప్పుడు, ఈ ప్రాంతానికి నీరందించే పైకి లేచే గాలి, భారీ వర్షాల పట్టీ భారతదేశానికి దూరంగా తూర్పు వైపుకు కదులుతుంది. రుతుపవన గాలులు వాటి వేగాన్ని కొంత కోల్పోతాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని అంచనా వేసింది. 1971 నుండి 2020 మధ్య 50 సంవత్సరాల వర్షపాత డేటా ఆధారంగా తీసుకున్న దీర్ఘకాలిక సగటు (లాంగ్ పీరియడ్ యావరేజ్)లో ఇది సుమారు 90 శాతంగా ఉంటుంది. వర్షపాతం లోటుగా ఉండే సీజన్‌కు 60 శాతం అవకాశం ఉందని అది పేర్కొంది.

కొన్నిసార్లు బలహీనపడుతున్న రుతుపవనాలను కాపాడగల ఒక ప్రత్యేక సముద్ర నమూనా అయిన ఇండియన్ ఓషన్ డైపోల్, ఈ సంవత్సరం తటస్థంగా ఉంటుందని అంచనా. రుతుపవనాలు కేవలం వాతావరణం మాత్రమే కాదు. భారతదేశ వార్షిక వర్షపాతంలో సుమారు 70 శాతాన్ని ఇది అందిస్తుంది. దేశంలోని సగానికి పైగా వ్యవసాయ భూములకు నీటిపారుదల సౌకర్యం లేదు. 2015 నుండి 2016 వరకు వచ్చిన చివరి పెద్ద ఎల్ నినో సమయంలో, భారతదేశం తన సగటు వర్షపాతంలో కేవలం 86శాతాన్ని మాత్రమే పొంది కరువులోకి జారిపోయింది. దాదాపు 60 శాతం మంది రైతులు తమ వేసవి పంటల కోసం ఈ వర్షాలపై ఆధారపడి ఉన్నందున, బలహీనమైన రుతుపవనాల ప్రభావం మొదట నేలలో, ఆ తర్వాత వెంటనే ఆహార ధరలలో కనిపిస్తుంది. ఒక పూట భోజనం ధరను ఇప్పటికీ వర్షాలే నిర్ణయించే దేశానికి, బలహీనమైన రుతుపవనాల ప్రభావం కేవలం చార్టులోని ఒక సంఖ్య మాత్రమే కాదు. అది ఒక మంచి సంవత్సరానికి, ఒక కష్టమైన సంవత్సరానికి మధ్య ఉన్న తేడా.

# అటు ఎండలు ఇటు వానలు

>> కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ..తేలికపాటి వర్షాలు.. కురిసే అవకాశం ఉందని తెలిపారుఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ, వాటికి వీలైనంత దూరంగా ఉండాలన్నారు.

## వారం - వర్జ్యం

08-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
అష్టమి రా.3.22, శతభిష ఉ.9.07
వర్జ్యం : మ.3.38-సా.5.16
దు.మ.12.02-మ.1.24,
(2) మ.3.09-సా.4.01
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** స్థిరాస్తి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఉద్యోగులకు బదిలీలు అవుతాయి.

**వృషభం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడుతాయి. వాహన సౌఖ్యం.

**మిథునం:** వివాదాలకు దూరంగా ఉండండి. అనుకున్న అవకాశాలు శ్రమించడం వలన కలిసి వస్తాయి.

**కర్కాటకం:** అందరిలోనూ ప్రత్యేకాకర్షణగా నిలుస్తారు. నూతన కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు.

**సింహం:** సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రలు చేస్తారు.

**కన్య :** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వైద్య పారిశ్రామిక రంగాల వారికి అనుకూలమైన కాలం.

**తుల :** దూరప్రాంతాల నుండి అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. క్రీడారంగం యందు ఆసక్తి కలిగి వుంటారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. సంఘంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. అపురూపమైన వస్తువులు సేకరిస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఈ రోజు ఉల్లాసముగా గడుపుతారు.ప్రయాణాలు.

**మకరం:** సంఘంలో మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. శుభకార్యాలు నిర్వహిస్తారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** సంతాన విద్యా విషయంలో పట్ల శ్రద్ధ కనబరుస్తారు. మీ సహాయ సహకారాలు అందిస్తారు.

**మీనం:** సమస్యలు కొంతవరకు తీరి ఊరట చెందుతారు. దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. బంధువుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మాస్కోలో ఆదివారం అణుశక్తి మ్యూజియం వద్ద గిరెడ్మెట్ ప్రతినిధులతో మంత్రి లోకేష్

# మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం

>> రేర్‌ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ కోసం నియోడైమియం మాగ్నెట్ (ఎన్‌డిఎఫ్‌ఇబి) ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి భాగస్వామ్యం వహించండి. భారతీయ టెక్ కారిడార్‌లో సిద్ధంగా ఉన్న ప్లగ్ అండ్‌ప్లే ప్రయోగశాలల మద్దతుతో మెటలర్జీ అల్ట్రాప్యూర్ సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ సహా స్థాపనకు చొరవ చూపండి. పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుండి వ్యూహాత్మక అరుదైన లోహాలను వెలికితీయడానికి, యాజమాన్య వెలికితీత సాంకేతికతలను అమలు చేయడంలో భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

ఇక 1931లో స్థాపించబడిన గిరెడ్మెట్ సంస్థ మాస్కో కేంద్రంగా పనిచేస్తూ శాస్త్ర, సాంకేతిక వ్యవస్థలో కీలక పరిశోధన డిజైన్ సంస్థగా కొనసాగుతోంది. రేర్ ఎర్త్ మూలకాలు, కీలక లోహాలు, సెమీకండక్టర్ పదార్థాలు, అధిక శుద్ధి రసాయనాల రంగాల్లో ఈ సంస్థకు ప్రత్యేక నైపుణ్యం ఉంది. గిరెడ్మెట్ సంస్థ జాతీయ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేసే కేంద్రంగా పనిచేయడంతో పాటు అంతర్జాతీయ సహకారాల ద్వారా కూడా తన ప్రభావాన్ని విస్తరించుకుంటోంది. మాస్కోలోని ప్రత్యేక ప్రయోగశాలలు, పైలట్ స్థాయి పరీక్షా సౌకర్యాలు, డిజైన్ కేంద్రాలు విస్తృత పారిశ్రామిక నెట్‌వర్క్‌తో అనుసంధానమై పనిచేయడం వల్ల ఈ సంస్థ పరిశోధనతో పాటు పారిశ్రామిక అమలు సామర్థ్యం కలిగిఉంది. ముఖ్యంగా కీలక ఖనిజాలు, బ్యాటరీ రీసైక్లింగ్, రేర్ ఎర్త్ ప్రాసెసింగ్, అధునాతన పదార్థాల అభివృద్ధి వంటి రంగాల్లో భారతదేశంతో భాగస్వామ్య అవకాశాలు పెరుగుతున్నాయి.

**మాస్కో అణుశక్తి మ్యూజియం సందర్శన:**
అణుశక్తిని సద్వినియోగం చేస్తే వైజ్ఞానికంగా దేశాలను అభివృద్ధి చేస్తోందని ఎపి విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రష్యాలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియం (మాస్కో)ను మంత్రి లోకేష్ సందర్శించారు. ఈ మ్యూజియం 25వేల చదరపుమీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఉంటుంది. సోవియట్ అణు ప్రాజెక్ట్ ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు విస్తరించిన ప్రదర్శనలు మ్యూజియంలో ప్రత్యేకం. మ్యూజియంలో ఇంటరాక్టివ్ ప్రదర్శనలు, శాస్త్ర ప్రయోగశాలలు, గైడెడ్ టూర్లు ఉండటం వల్ల ఇది ప్రజలకు విజ్ఞానపరమైన అనుభవాన్ని అందిస్తోంది. 2023 నవంబర్‌లో ప్రారంభమైన ఈ మ్యూజియం ఇప్పటికే విశేష ప్రజాదరణ పొందింది. విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా నిలుస్తోన్న ఈ మ్యూజియంను 80 దేశాలకు పైగా చెందిన 35 లక్షల మందికిపైగా సందర్శించినట్టు నిర్వాహకులు లోకేష్‌కు వివరించారు. ఒకేసారి 2,100 మంది వరకు సందర్శకులను ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. మాస్కో ప్రభుత్వం, స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ మ్యూజియం అణుశక్తి చరిత్రను మాత్రమే కాకుండా, శాంతిపూర్వక అణు వినియోగ విజయాలను కూడా సమగ్రంగా పరిచయం చేస్తోంది.

# డబుల్ ఇంజిన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- కూటమి పక్షాల నేతలతో సిఎం చంద్రబాబు
- రేపటి తిరుపతి సభకు భారీ జనసమీకరణ
- పల్లా, నిమ్మల, నాదెండ్ల, మాధవ్ హాజరు

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని కూటమి పార్టీల నేతలు, శ్రేణులకు టిడిపి జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇందుకు కోసం రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బహిరంగ సభలు విజయవంతం చేయాలన్నారు. ప్రత్యర్థి పక్షం విమర్శలను గట్టిగా తిప్పికొట్టాలన్నారు. ఆదివారం రాజధాని అమరావతిలో కూటమి పక్షాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 9వ తేదీన తిరుపతి వేదికగా జరగనున్న భారీ బహిరంగ సభ గురించి వారితో చర్చించారు. ఈ సభకు ఆయా పార్టీల కార్యకర్తలందరిని ఆహ్వానించాలని కోరారు. అలాగే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి సోదాహరణగా వివరించాలని వారికి సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మూడు ప్రాంతాలలో నిర్వహించే సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి నుంచి పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, బిజెపి నుంచి పివిఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. జూన్ 4వ తేదీన ఉండవల్లిలోని సిఎం చంద్రబాబు నివాసంలో కూటమిలోని పార్టీల అగ్రనేతలు సమావేశమై ఎపిలో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనతోపాటు కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పాటై 12 ఏళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చర్చించి నిర్ణయం తీసుకున్నారు. అలాగే కూటమి ప్రభుత్వంపై వైసిపి నేతల విమర్శల జోరుకు అడ్డుకట్ట వేయాలని భావించారు. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో జూన్ 9న తిరుపతిలో, 12న రాజధాని అమరావతిలో, జూన్ 15న విశాఖపట్నం వేదికగా ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దాంతో ఈ సభలను విజయవంతం చేయాలని ఈ జూమ్ మీటింగ్‌లో ఆయా పార్టీల అగ్రనేతలను సిఎం చంద్రబాబు ఆదేశించారు.

# పశ్చిమ గోదావరి జిల్లాలో నేడు సిఎం పర్యటన


### సిద్ధాంతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ
### రైతులతో సమావేశం కానున్న చంద్రబాబు

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల్లోని తప్పులను సరిదిద్దుతూ ప్రజా ప్రభుత్వం రైతులకు కొత్త పుస్తకాలను అందిస్తోంది. రైతుల సమక్షంలోనే రీ సర్వే చేసి వారి ఆమోదంతో పాస్ పుస్తకాలను ఇస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ నెలా 'మీ భూమి.. మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా నేరుగా ఆయనే రైతులతో సమావేశమై వారి సమక్షంలోనే అధికారులతో భూమి వివరాలను చదివించి పుస్తకాలను అందజేస్తున్నారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం సిద్ధాంతంలో 'మీ భూమి... మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ అనంతరం వారితో ప్రత్యేకంగా భేటీ అవుతారు.

**ఆరు నెలల్లో 26.46 లక్షల పాస్ పుస్తకాలు అందజేత**
జనవరి నుంచి ప్రభుత్వం రీ సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తోంది. ఇప్పటి వరకు 6,688 గ్రామాల్లో రీసర్వే నిర్వహించింది. అందులో 6,459 గ్రామాలకు చెందిన 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందించింది. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం విధించారు. ఈ గ్రామాలకు సంబంధించి మొత్తం 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తొలిసారి బ్లాక్‌చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను ఎపి ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రతీ భూ యూనిట్‌కు శాశ్వత బ్లాక్‌చైన్ ఐడి ఇస్తోంది. దీని వల్ల ఒకసారి నమోదైన సమాచారాన్ని ఎవరూ మార్చడానికి అవకాశం ఉండదు. భూముల సర్వే ప్రారంభం నుంచి తుది రికార్డు వరకు ప్రతి దశలో ఈకేవైసీ తప్పని సరి చేసింది. తొలుత రైతుకు డ్రాఫ్ట్ పుస్తకాన్ని అందించి... రైతు తన వివరాలను పరిశీలించుకుని ఈకేవైసీ ద్వారా ధృవీకరించిన తర్వాతే తుది పాస్ పుస్తకం ముద్రణకు వెళ్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**
ముఖ్యమంత్రి చంద్రబాబు పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఉదయం 10.25 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 11 గంటలకు పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చేరుకుంటారు. 11.15 గంటలకు మీ భూమి - మీ హక్కు ప్రజా వేదిక సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రైతులతో సమావేశమవుతారు. 3.15 గంటలకు టిడిపి శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలను ముగించుకుని సాయంత్రం 5.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# గోల్డెన్ అవర్‌లో గోల్డెన్ సర్వీస్




## 108 రూపు రేఖలు మార్చేసిన కూటమి ప్రభుత్వం

### ఒక్క యేడాదిలోనే 7.78 లక్షల అత్యవసర కేసులకు సత్వర స్పందన

### భవ్య హెల్త్ కేర్ ఆధ్వర్యంలో మరో మైలురాయి



**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నట్టే 108అంబులెన్స్ సర్వీసులూ లక్షలాదిమందికి ప్రాణదాతగా నిలుస్తూ సమర్థతను చాటుకుంటున్నాయి. ప్రతినిమిషం ప్రాణ రక్షణే లక్ష్యంగా అత్యవసర సేవలు అందిస్తున్నాయి. భవ్యహెల్త్ కేర్ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లకు టెక్నాలజీజోడించి బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రులకు చేర్చాయి. 2025 జూన్ నుంచి 2026మేవరకు ఏడాది కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం7,78,799అత్యవసర కేసులకు స్పందించి వేలాది కుటుంబాల్లో ఆశాజ్యోతిని వెలిగించాయి.

**ప్రాణాపాయ స్థితిలో దేవుడిలా...**

ఈ ఏడాది కాలంలో 1,13,764 మంది రోడ్డు ప్రమాద బాధితులకు 108 సిబ్బంది గోల్డెన్ అవర్‌లో అత్యవసర వైద్య సహాయం అందించారు. అలాగే 1,05,786 మంది గర్భిణీలను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించి తల్లిశిశు ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. 97,118 శ్వాసకోశ సమస్యల కేసుల్లో తక్షణ వైద్య సహాయం అందించి ప్రాణాలను కాపాడారు. అదేవిధంగా 49,342 వాహనేతర గాయాల కేసులు, 45,951 గుండెజబ్బుల కేసులు, 40,553 స్పృహ తప్పిన కేసులు, 34,532 కడుపునొప్పి కేసులు, 32,858 విషప్రయోగ కేసులు, 29,485 ఫిట్స్ కేసులు, 27,455 తీవ్ర జ్వరం కేసులు, 20,278 పక్షవాతం కేసులు, 15,441 దాడుల కేసులు, 14,088 జంతువుల కాటు కేసులు, 14,007 నవజాత శిశువుల అత్యవసర కేసులతో పాటు మరో 1,38,141 ఇతర అత్యవసర కేసుల్లోనూ 108 సిబ్బంది అంకితభావంతో సేవలందించి తమ చిత్తశుద్ధిని చాటుకున్నాయి. ఈ మొత్తం సేవల్లో 2,53,022 కేసులు ఒక ఆసుపత్రి నుండి మరొక ఆసుపత్రికి తరలించిన అంతర్గత బదిలీలు (ఐఎఫ్‌టి) కాగా, 5,25,777 కేసులు నేరుగా ప్రమాద స్థలాలు మరియు అత్యవసర ప్రాంతాల నుండి ఆసుపత్రులకు తరలించిన నాన్-ఐఎఫ్‌టి కేసులుగా నమోదయ్యాయి.

**ఎమర్జెన్సీ కేసుల్లో ప్రాణాధారం**

ప్రాణాపాయ పరిస్థితుల్లో ప్రతి నిమిషం కీలకంగా మారే గుండెజబ్బుల అత్యవసర కేసుల్లో 108 అంబులెన్స్ 108 సిబ్బంది దేవుడిలా మారి, సకాలంలో సర్వీస్ అందిస్తూ ఎందరికో పునర్జన్మను ప్రసాదిస్తున్నారు. ఏడాదిలో 45,951 గుండెజబ్బుల కేసులకు స్పందించి సకాలంలో వైద్య సహాయం అందించారు. దీంతో పాటు ఛాతినొప్పి, శ్వాసకోశ ఇబ్బందులు వంటి అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది వేగంగా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రులకు తరలించారు. అత్యాధునిక వైద్య పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది మరియు సమర్థవంతమైన అంబులెన్స్ నిర్వహణతో వేలాది ప్రాణాలను కాపాడడంలో 108 సేవలు కీలక పాత్ర పోషించాయి. ఆపద సమయంలో రోగికి వైద్య సహాయం అందే వరకు సిబ్బంది అందించే సేవలు ప్రాణరక్షణలో కీలకంగా మారుతున్నాయి. వారి సమయస్ఫూర్తి, నైపుణ్యం, సేవాభావం వల్ల వేలాది మంది ప్రాణాలు నిలబడుతున్నాయి.

**ఎమర్జెన్సీ రోగుల పాలిట సంజీవని:** ఈ సందర్భంగా భవ్య హెల్త్ కేర్ మీడియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో అత్యవసర వైద్య సహాయం అందించడమే మా ప్రధాన లక్ష్యం. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఆధునిక సాంకేతికత, నిరంతర నిఘా వ్యవస్థలు మరియు నైపుణ్యం కలిగిన సిబ్బందితో 108 సేవలను మరింత బలోపేతం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో కూడా మరింత సమర్థవంతమైన సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు.

**108 సేవలపై సర్వత్రా హర్షం..**

ప్రమాదాలు, గుండెపోటు, ప్రసవాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సమయానికి చేరుకుని వైద్య సహాయం అందించడం ద్వారా 108 సేవలు ప్రజారోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయి. అత్యవసర సమయాల్లో వేగంగా స్పందిస్తూ ప్రాణాలను కాపాడుతున్న 108 అంబులెన్స్ సేవలపై బాధితులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు 24 గంటలూ అందుబాటులో ఉండే 108 సేవలు అనేక కుటుంబాలకు ఆపద్బాంధవంగా నిలుస్తున్నాయని ప్రజలు అభినందిస్తున్నారు. అత్యవసర సమయంలో ఒక్క ఫోన్ కాల్‌తో స్పందించి బాధితులను సురక్షితంగా ఆసుపత్రులకు తరలిస్తున్న సిబ్బంది సేవాభావాన్ని కొనియాడుతున్నారు.

# రాజధాని పరిపాలన విధానంలో కీలక మార్పులు

## మూడు నాలుగు గ్రామాలకు ఒక గ్రిడ్, జోన్

## ప్రత్యేక కలెక్టర్ల నియామకం



**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని పరిపాలనలో మార్పులు చేశారు. పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం అధికారులను, సిఆర్డీఏలో ల్యాండ్ పూలింగు యూనిట్లను విభజిస్తూ సిసిఎల్ఏకు, గ్రామవార్డు సచివాలయ విభాగాలకు ఈ మేరకు ప్రభుత్వం నుండి అనుమతి ఇచ్చింది. అమరావతి రాజధాని ప్రాంతం మొత్తాన్ని తొమ్మిది జోన్లుగా మార్చారు. కొత్త కమిషనర్ విజయరామరాజు వచ్చిన తరువాత రాజధాని ప్రాంతాన్ని గ్రిడ్లుగా మార్చి తొమ్మిది జోన్లు ఏర్పాటు చేశారు. దీనిలో ప్రస్తుత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్న కొండమరాజుపాలెం రెవెన్యూను సెంట్రల్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈస్ట్‌జోన్ పరిధిలోకి కృష్ణాయపాలెం, పెనుమాక, ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి ఐనవోలు, నార్త్‌ఈస్ట్ జోన్లోకి లింగాయపాలెం, ఉండవల్లి, వెంకటపాలెం, నార్త్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, మందడం రెండు యూనిట్లు తీసుకొచ్చారు. నార్త్ వెస్ట్ జోన్ పరిధిలో అబ్బురాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, సౌత్ ఈస్ట్‌జోన్‌లోకి నవులూరు 1,2 యూనిట్లు, సౌత్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి కురగల్లు రెండు యూనిట్లు, నిడమర్రు రెండు యూనిట్లు కలిపారు. వెస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు రెండు యూనిట్లు, అనంతవరం గ్రామాలను తీసుకొచ్చారు. అలాగే రెండోదశలో ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందిని నియమించారు. ఒక్కో యూనిట్‌కు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఓ, లైసెన్స్డ్ సర్వేయర్, విలేజ్ సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డిజిటల్ అసిస్టెంట్ను నియమించారు. భూమి విస్తీర్ణం ఆధారంగా కొన్ని గ్రామాల్లో అదనపు సర్వేయర్లను నియమించారు. ఇవి కాకుండా రాజధాని నగరంలో ల్యాండ్స్ విభాగానికి ప్రత్యేక యూనిట్ను ఏర్పాటు చేశారు. దీనిలోనూ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తోపాటు పదిమందిని నియమించారు. అలాగే ఎపిసిఆర్డిఏ క్యాపిటల్ రీజియన్ కోసం ప్రత్యేక ల్యాండ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఎల్పిఎస్ కోఆర్డినేషన్, గుంటూరుకలెక్టరేట్‌లో ప్రత్యేక అడ్మిన్ కార్యాలయం, నెగోషియబుల్ సెటిల్మెంట్ పాలసీ, ఆర్1 పరిధిలో వ్యవహారాలకోసం వేర్వేరు యూనిట్లును నియమించారు. వీటన్నిటితో పాటు ఇద్దరు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారులతో మరొక విభాగాన్ని నియమించారు. ఇప్పటి వరకూ గ్రామాల్లో కాంపిటెంట్ అథారిటీలే అన్ని వ్యవహారాలు చూసేవారు. ఇకనుండి జోనల్ స్థాయిలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఆయా జోన్ల పరిధిలోకి వచ్చే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సి ఉంటుంది. భూయజమానులు నేరుగా సిఆర్డిఏ కార్యాలయానికి వెళ్లకుండా ఆయా జోన్ల పరిధిలోని సమస్యలు పరిష్కరించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# విమానయాన పాలసీకి ఆమోదం

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ విమానయాన పాలసీ 2026-31కి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిద్వారా రూ. 9676 కోట్ల పెట్టుబడులు సాధించడం లక్ష్యంగా పేర్కొంది. ఇటీవల మంత్రిమండలి సమావేశంలో పాలసీ విధానాలను ఖరారు చేశారు. దాన్ని ఆమోదిస్తూ పెట్టుబడులు, మౌలికవసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏకీకృత ఎయి ర్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెరుగైన ఎయిర్ కనెక్టి విటీ ఎయిర్ కార్గో లాజిస్టిక్స్ సౌకర్యాలు ఏవి యేషన్ స్కిల్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏరోస్పేస్ మా న్యుఫ్యాక్చరింగ్ మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్‌హాల్ సౌకర్యాలు కల్పించడం ద్వారా ఏపీని ఏవియేషన్‌హబ్‌గా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో ఏ ప్రాంతం నుంచి అయినా సుమారు 150 కి.మీలో విమానాశ్రయ సదుపాయం అందించడమే పాలసీ లక్ష్యమని పేర్కొంది,

# పెరుగుతున్న భక్తులు, భర్తీకాని ఉద్యోగాలు

## టిటిడి మినీ సచివాలయంలో ఉద్యోగుల అంతర్మథనం

**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** 3,500 కోట్ల పైగానే వార్షిక ఆదాయం, ఏడుకొండలస్వామి దర్శనానికి రోజురోజుకూ రెట్టింపవుతున్న భక్తులకు తోడు ఉద్యోగాల భర్తీమాత్రం చేయడంలేదు. ఉన్న ఉద్యోగులపైనే అదనపు భారం పడుతోందని ఆవేదన వెలిబుస్తున్నారు. రాష్ట్ర సచివాలయం తరువాత మినీసచివాలయంగా టిటిడి పాలన సాగుతోంది. ఇక్కడ కొన్ని దశాబ్దాల క్రిందట వరకు ఉన్న ఉద్యోగులు ఏడాదికేడాది పదవీవిరమణతో ఖాళీ అవుతున్నా తిరిగి ఆ పోస్టులు భర్తీచేయడంలేదు. దీంతో ఆయా శాఖల్లో ఉద్యోగులు మరీ ఒత్తిడితో విధులు నిర్వహించాల్సివస్తోందనేది పలువురు ఉద్యోగుల ఆవేదన . ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం పరిపాలనలో కీలకమైన మినీసచివాలయం పరిపాలన భవనం ఉంది. కొన్ని దశాబ్దాల క్రిందట 18వేలమంది వరకు ఉన్న శాశ్వత ఉద్యోగులు ఏడాదికేడాది పదవీవిరమణ చేస్తున్న ఉద్యోగుల సంఖ్య పెరిగిపోతుండటంతో తిరిగి ఆ పోస్టులు భర్తీ చేయడంలేదనేది ఉద్యోగుల వాదన. దశాబ్ధకాలంక్రిందట 13వేలమంది ఉన్న శాశ్వత ఉద్యోగులు క్రమేణా పదవీవిరమణ చేయడం, పలు కారణాలతో విధుల్లో ప్రాణాలు కోల్పోవడం వంటి సందర్భాలతో ప్రస్తుతం 6,500మంది వరకు శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వీరిలో క్రిందిస్థాయిలో ఆఫీస్ సబార్డినేట్స్(అటెండర్లు) స్థాయి నుండి జూనియర్ అసిస్టెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, షరాఫ్‌లు, జమేదార్లు, ఎఇఒలు, సూపరింటెండెంట్‌లు, డిప్యూటీ ఇఒల హోదా వరకు అధికారులు ఉన్నారు. వీరంతా తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు తిరుపతి స్థానిక ఆలయాల్లోనూ, టిటిడి పరిపాలన భవనంలో, దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి కల్యాణమండపాలు,, ఆలయాలు,టిటిడి సమాచార కేంద్రాలు ఇలా అనేక చోట్ల ఉద్యోగులు సేవలందిస్తున్నారు. కీలకంగా తిరుమలలో వసతికల్పన విభాగం, శ్రీవారి ఆలయం, దర్శనాలు, పరకామణి, అన్నప్రసాదం, దాతల విభాగం, విద్య,వైద్యం విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాల్లో డిప్యూటీ ఇఒ హోదా అధికారులు, సూపరింటెండెంట్‌లు,మేనేజర్ పోస్టులు ఖాళీ అయితే (పదవీవిరమణ చేస్తే)తిరిగి భర్తీకావడం లేదు. దీనివల్ల ఉన్న ఉద్యోగులపైనే అదనపు భారం పడుతుందనే వాదనలు ఇప్పటికే టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఉద్యోగ సంఘాల నేతలు పలు దఫాలుగా విన్నవించారు. శాశ్వత ఉద్యోగుల పోస్టులను భర్తీచేయాలని కోరారు. ఐఎఎస్ ,ఐఆర్ఎస్, ఐపిఎస్ హోదాతో ఇతర ప్రభుత్వ శాఖల నుండి డిప్యూటేషన్‌పై ఇఒ, అదనపు ఇఒ,జెఇఒ,సివిఎస్ఒ అధికారులు టిటిడికి వస్తున్నారు. వీరంతా రెండేళ్ళు,మూడేళ్ళు మాత్రమే బాధ్యతాయుతమైన సేవలందించి తిరిగి వారి శాఖలకు వెళ్ళిపోతుంటారు. ఇక్కడ టిటిడి నోటిఫికేషన్ ద్వారా ఎన్నికైన ఉద్యోగులు మాత్రమే భక్తులకు ఇతోధిక సేవలందించడం జరుగుతుంది. రోజుకు లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. వీరికి అవసరమైన అన్ని రకాల సేవలందించడానికి శాశ్వత ఉద్యోగులతోబాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమతమ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. పదుల సంఖ్యలో పదవీవిరమణ చేస్తున్న ఉద్యోగుల స్థానంలో తిరిగి కనీసం ఆఫీస్ సబార్డినేట్స్ నియామకాలు కూడా జరగడంలేదు. టిటిడిలో ఉద్యోగమంటే పూర్వజన్మసుకృతం,పుణ్యప్రదంగా ఎవరైనా భావిస్తారు. అలాంటిచోట్ల ఉద్యోగం చేయాలని ప్రతి హిందువుకు ఆసక్తిఉంటుంది.

**ఉన్నవారిపైనే అదనపు భారం:** టిటిడిలో ప్రస్తుతం ఉన్న సుమారు 6,500మంది పైచిలుకు ఉద్యోగులు ఆయా విభాగాల్లో విధుల నిర్వహణ అదనపు భారంగా చెబుతున్నారు. ఖాళీపోస్టులు భర్తీకాకపోతుండటంతో ఉన్నవారిపైనే ఈ భారం పడుతోందనే వాదన వినిపిస్తున్నారు. గతంలో కారుణ్యనియామకాలు చేపట్టి తక్కువ సంఖ్యలోనే శాశ్వత ఉద్యోగాలు భర్తీచేసిన టిటిడి పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఈ నేపథ్యంలో గత రెండు దశాబ్దాల కాలంలో టిటిడిలో ఉద్యోగాల భర్తీ మాత్రం జరగలేదు. 2014, 2019లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, వైసిపి,తిరిగి 2024లో కొనసాగుతున్న టిడిపి కూటమి ప్రభుత్వాలు ఉద్యోగుల భర్తీ పై స్పష్టమైన ప్రకటన లేదు. పైగా గతంలో టిటిడిపాలకమండలి టిటిడిలో ఉద్యోగాలు స్థానికులకే 75శాతం ఇస్తామని, వారితోనే భర్తీచేస్తామని వెల్లడించిన సందర్భం ఉంది. అయినా మినీసచివాలయం లాంటి పరిపాలన చేస్తున్న టిటిడిమాత్రం శాశ్వత ఉద్యోగాలు భర్తీచే యడంపై దృష్టిపెట్టలేదు. ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగ సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

## సత్యనారాయణ గారూ..

## సిద్ధాంతంలో కలుద్దాం!

### ఆచంట నియోజకవర్గానికి చెందిన ఓ వృద్ధుని కోరిక మేరకు స్పందించి సిఎం చంద్రబాబు ట్వీట్

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తనను కలవాలన్న ఓ వృద్ధుని కోరికకు స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువులంక గ్రామానికి చెందిన సానబోయిన సత్యనారాయణకు చంద్రబాబు అంటే ఎంతో అభిమానం. ఒక్కసారైనా చంద్రబాబును కలవాలని అనుకున్నారు. నేడు (సోమవారం) సిద్ధాంతంలో జరిగే 'మీ భూమి... మీ హక్కు' కార్యక్రమానికి వస్తున్న సిఎం చంద్రబాబు సభకు వెళ్లేందుకు సత్యనారాయణ సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఓ యువకుడు వీడియో తీసి సోషల్ మీడియోలో పోస్ట్ చేశాడు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి సత్యనారాయణ గారూ...రేపు కలుద్దాం అంటూ ట్వీట్ చేశారు.

# రేపు తిరుపతిలో ఎన్‌డియే సభ

### కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజాదర్బార్

### సిఎం చంద్రబాబు. జనసేనాని పవన్, బిజెపి చీఫ్ మాధవ్ హాజరు



**తిరుపతి,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ళపాలనపూర్తిచేసుకోవడంతో అమలుచేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు చేకూర్చిన లబ్ధి తదితర విషయాలు వెల్లడించడానికి 9వతేదీ రేపు తిరుపతిలో భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సమావేశానికి సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు భారీగా హాజరుకానున్నారు. తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారిపై దామినేడు సమీపంలోని ఖాళీస్థలంలో మంగళవారం ఉదయం ఈ సభజరగనుంది. ఈ స్థలాన్ని ఆదివారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ గోవిందరావు, అదనపు ఎస్పీలు రవి మనోహరచారి, శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని తదితరులు కలిసి పరిశీలించారు. రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లా పర్యటన సందర్భంగా దామినేడు వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభా ప్రాంగణంతో పాటు పార్కింగ్ ప్రాంతాలు, వాహనాల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, వేదిక నిర్మాణ పనులు, ప్రజల రాకపోకల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను అధికారులు గమనించారు. సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే పార్కింగ్ ప్రాంతాల్లో తగిన మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎండ తీవ్రత దృష్ట్యా సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత స్థాయిలో త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలని, అవసరమైన చోట్ల మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అలాగే సభా ప్రాంగణం, వేచి ఉండే ప్రాంతాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కూలర్లు, షామియానాలు మరియు ఇతర శీతలీకరణ సదుపాయాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం

# వారాంతంలో కొండ కిటకిట

### వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల,జూన్ 7 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులు ముగింపునకు వస్తుండటంతో వారాంతం కావడంతో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్ష మంది భక్తులు రావడంతో కొండ కిటకిటలాడుతోంది. వేసవిసెలవులు, ఆపై వారాంతం శని, ఆదివారాలు కలసి రావడంతో ఆదివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఏనిమిదిగంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవిసెలవులు, ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ,మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 41వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. దర్శనం చేసుకోలేని భక్తులు అఖిలాండం వద్ద కొబ్బరి కాయలు కొట్టి వెనుదిరుగుతున్నారు.

# టిటిడి ట్రస్ట్‌లకు రూ.20 లక్షలు విరాళం



**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. ఆదివారం ఉదయం విశాఖపట్నంకు చెందిన ఎంకే బిల్డర్స్ ఎండీ రామకృష్ణ టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 10 లక్షలు, వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10 లక్షలు విరాళంగా అందించారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,టిటిడి బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు.

# ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.11.11లక్షలు విరాళం



**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నిరుపేదలకు ప్రాణరక్షక వైద్యసేవలు అందిస్తున్న వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన నిర్మాణ సంస్థ సముద్ర గ్రూప్ డైరెక్టర్ నవీన్ కుమార్ 11,11,111 లక్షలు విరాళంగా అందించారు. టిటిడి అదనపు అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి ఆదివారం సాయంత్రం డిడిని అందజేశారు.

# తిరుమల రెండోఘాట్‌లో ఎలుగుబంటి

### భయంతో పరుగులు తీసిన భక్తులు

**తిరుమల,జూన్ 7 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో శనివారం రాత్రి ఓ ఎలుగుబంటి అటవీప్రాంతంనుండి రోడ్డుపైకి రావడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. రాత్రివేళ అడవి వదలి జనసంచారంలోకి రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. అలిపిరి తనిఖీ కేంద్రం దాటుకున్న తరువాత సిద్ధివినాయకస్వామి ఆలయం వద్ద ఎలుగుబంటి సంచరించింది. తినుబండారాల కోసం అక్కడ ఉంచి చెత్తకుండీని దొర్లించి చిందరవందర చేసింది. రాత్రివేళ తిరుమలకు వచ్చే భక్తులు ఎలుగుబంటిని చూసి ఒక్కసారిగా భయంతో వణికిపోయారు.

సమాచారం అందుకున్న టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది శబ్దాలతో ఎలుగుబంటిని అడవిలోకి తరిమేశారు. వేసవిలో అడవులు వదలి చిరుతలు, జింకలు, ఎలుగుబంట్లు,ఏనుగులు దారితప్పి జనావాసంలోకి రావడం పరిపాటిగా మారింది.

# గృహ వినియోగ ఎల్పిజి ధరను తగ్గించండి

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** గృహ వినియోగ ఎల్పిజి గ్యాస్ సిలిండర్ ధరను రూ.29లు పెంచడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఖండించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేసారు. పెంచిన సిలెండర్ దర తగ్గించాలన్నారు. మోడీ ప్రభుత్వం పదేపదే జనంపై భారాలు మోపటం దుర్మార్గం అన్నారు. వంట గ్యాస్ పై గత మూడు నెలల్లో రూ.89లు పెంచారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు, వాణిజ గ్యాస్ సిలిండర్ ధర రెండుసార్లు, గృహ వినియోగ ఎల్పిజి ధర రెండుసార్లు పెంచిన ఘనత మోడీ సర్కార్ దే. ఫలితంగా రవాణా, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యుల జీవనం అస్తవ్యస్తమవుతుందన్నారు. పెంచిన గ్యాస్ ధరల పెరుగుదలపై సీఎం చంద్రబాబు నోరు విప్పాలి అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి, ధరల తగ్గింపునకు చంద్రబాబు చొరవ చూపాలన్నారు.




# గాడితప్పిన కూటమి పాలన

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** రెండేళ్ల కూటమి పాలన గాడి తప్పిందని, ప్రజలకు చేసిందేమీ లేకపోగా జాతీయ సంపద లూటీ జరుగుతోందని, మతోన్మాదం పెచ్చరిల్లిపోతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై యువత తీవ్ర ఆగ్రహంతో గర్జిస్తోందనీ తెలిపారు. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావుతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి రెండో విడత పాలన రెండేళ్లు పూర్తయిందని, కేంద్రంలో బిజెపి పాలన 12 సంవత్సరాలు పూర్తయిందని పేర్కొన్నారు. దీనిపై ప్రజల్లోకి వెళ్లాలని ప్రకటించారని, ఏమి సాధించారని ప్రజల వద్దకు వెళతారో సమాధానం చెప్పాలని అన్నారు. స్వర్ణాంధ్ర చేస్తామని పైకి చెబుతున్నా ఆచరణలో విషాద ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న మంత్రుల నిర్వాకంతో గత ఆరేళ్లలో 70 సార్లు పరీక్ష పేపర్లు లీకయ్యాయని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతాపార్టీ పిలుపుతో యువత రోడ్లపైకి వచ్చారని అన్నారు. రాజీనామా చేయకపోతే బిజెపి ప్రభుత్వ పతనానికి అదే నాంది అవుతుందని హెచ్చరించారు. కోనసీమ గ్యాస్‌ను రిలయన్స్ పైపులైన్ల ద్వారా దోచుకుపోతోందని, వామపక్ష పార్టీలు పర్యటన చేశామని అక్కడ దోపిడీ కళ్లకు కట్టినట్లు కనిపించిందని పేర్కొన్నారు. ఇటీవల గ్యాస్ ధరను మరో రూ.29 పెంచారని పేర్కొన్నారు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా ఈనెల తొమ్మిదోతేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయని అన్నారు.

# 9 నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీలు

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖలో జూన్ 9 నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీలు జరుగుతాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు,విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు విశాఖ పట్నం వేదికగా ఏ.పి.యల్ మ్యాచ్ జరుగుతాయన్నారు. కడపలోని జూన్ 17 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు మంగళగిరిలో ఫైనల్ మ్యాచ్ జరు గుతుందని చెప్పారు. ఈ మ్యాచ్‌లు తిలకించేందుకు పాఠశాల, కళాశాల విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

వార్త

నిలబడి గడగడా మాట్లాడేందుకే కాదు,
కూర్చొని వినేందుకూ ధైర్యం కావాలి.

న- క్వింటన్

# 'హిట్' సరిపోతుందా?


పొద్దుట లేస్తే ఏ ఇల్లాలూ వంటింట్లో బొద్దింకను సందర్శించకుండా బయటకు వస్తున్నారంటే నమ్మలేం. తాజాగా కాక్రోచ్ జనతాపార్టీ 'జెన్‌జీ' ఉద్యమాన్ని నడిపిస్తుండడంతో ఇండియాలోగానీ, వేరే ఏ ఇతర దేశంలో కానీ 'బొద్దింక' లేని చర్చోపచర్చలు సాగే పరిస్థితి లేదు. 'కాక్రోచ్' పేరెత్తకుండా నడిచే పరిస్థితి లేదు. ఇతర దేశాల్లో 'జెన్‌జీ' ఉద్యమం తారాస్థాయికి వెళ్లి ప్రభుత్వాలను మార్చేసిన యువతలోని అసమ్మతితో భారతదేశంలో 'కాక్రోచ్' ఉద్యమంగా వెల్లువెత్తుతున్న ఉద్యమం ఉనికిని కాదనే పరిస్థితి లేదు. ఈ భూమ్మీద బొద్దింకలెన్ని ఉన్నాయంటే అసంఖ్యాకమనే చెప్పాలి. అలాగే 'కాక్రోచ్' పేరు ఎలా పుట్టినా, ఎవరు నామకరణం చేసినా, ఎవరు ఉద్యమించాలని సంకల్పించినా ఆ ఉద్యమంలో పాల్గొనే ఉద్యమకారుల సంఖ్య కూడా అసంఖ్యాకమే. ఇప్పుడు 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరిట సోషల్ మీడియాలో విశేష ఆదరణ పొందిన శనివారం పెద్దఎత్తున న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌లో పోలీసుల అనుమతితో బహిరంగ ప్రదర్శనకు కూడా అనుమతి పొందగలిగారంటే దానికి కారణం అనూహ్య జనాదరణ పొందబట్టేనని అర్థమవుతోంది. సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే అనే వ్యక్తి అమెరికాలో ఉద్యోగి. భారత దేశంలో ఏవైనా తామరతంపరగా వెలుస్తుంటే వాటిని అక్కడికక్కడే అశేషంగా పుట్టుకొచ్చే పుట్టగొడుగుల్ని గుర్తుకు తెచ్చుకోవడం పరిపాటి. ఏమైతేనేం అమాయక నిరుద్యోగుల్లో కాస్త చైతన్యం పెల్లు బికింది. నిజానికి దేశ నిరుద్యోగుల్లో ఉపాధి ఉద్యోగాల్లేక, అధికారం ఎవరి చేతుల్లో ఉన్నా తమ బతుకులిం తేననే నిరాశానిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వారే ఇప్పుడు ఈ దేశ సుభిక్షానికే తామున్నట్లు ఎలుగెత్తుతూ ఈ 'కాక్రోచ్' ఉద్యమానికి మద్దతుగా కదలివస్తున్నారు. న్యూఢిల్లీ వీధుల్లో యువత దాదాపు కదం తొక్కినట్లే ఉన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. యువత ఆకాంక్షలను ప్రతిఘటించడం మంచిది కాదనే ధోరణిలో ప్రభుత్వం కూడా ఎక్కడా యువతను నిరోధించే ప్రయత్నం చేయలేదు సరికదా సెంట్రల్ ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో 2వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాము శాంతియుతంగానే జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమం చేపడతామని నిర్వాహకులు ప్రకటించినప్పటికీ ఉద్యమాలు తప్పుదారి పట్టి వ్యతిరేకుల చేతిలో ఆటబొమ్మలుగా మిగలకూడదనేభావనతో, ఎలాంటి అవాంఛనీయ ధోరణులు ప్రబల కుండా నిఘా మాటున ఉద్యమ పర్యవసానాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. యువతరం గళమెత్తితే ప్రభు త్వాలు కూకటివేళ్లతో కదలిపోతాయి. నవతరం మార్పు దిశగా పయనిస్తుంది. ఎంతో సున్నితమైన అంశం ఇప్పు డు తెరపైకి వచ్చింది. యువతలో గూడుకట్టుకున్న నిరాశ ఒక్కసారిగా పెల్లుబికే సమయం ఆసన్నమైంది. ఆగ్రహావేశాలు నివురుగప్పిన నిప్పులైతే ఇక చేసేదేముంది. అలాంటి పరిస్థితి తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. 'కాక్రోచ్' ఏ పాటిదైనా సైబర్ ప్రపంచపు ఛాయల్లోనే పుట్టిందని చెప్పకతప్పదు. కేంద్ర ప్రభుత్వ పాలనలో ఎన్ని వర్గాలు ఏయే సందర్భాల్లో నిరసన గళమెత్తినా, ఈసారి నిరుద్యోగులు ఏకమైతే దేశమేగతి మారుతుందో అంచనా వేసుకుంటూముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలో ఒకపక్క అవినీతి, లంచగొండి తనం పెరిగిపోయాయి. ఏ రంగానికీ మినహాయింపు లేదు. ఏలిన వారికి తమ ముందున్న అష్టదరిద్రాలను కడుపులో పెట్టుకుని కాపాడుకోవడం తప్పలేదు. దేశరాజధాని నగరంలోనూ మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు. వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శతాధిక బిలియన్ల నిరుద్యోగుల తిరుగుబాటు ఈ దేశానికి మంచిది కాదు. వారిలోని అసంతృప్తిని, తిరుగుబాటును నిరోధించడం కన్నా వారికి ఉపాధి, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై దృష్టిసారించడం కేంద్రానికి శిరోధార్యం కావాలి. ఈ మధ్య వెలువడిన 'నీట్' పరీక్షల్లో ప్రశ్నాపత్రాల వెల్లడి వంటి అన్ని అంశాలపై ప్రశ్నించబోయిన సిజెపి తెగువను అభినందించాల్సిందే. గతంలో నేపాల్, బంగ్లాదేశ్‌లలో 'జెన్‌జి' ఉద్యమాలు సఫలీకృతమయ్యాయి. కాగా ఈ ఉద్యమ పర్యవసానంగా ఏర్పడిన ప్రభుత్వాలు వాటిని నడిపే ప్రభుత్వాల నిర్వాకాలు చర్చించదగినవే. వెల్లువెత్తిన ఉద్యమాల నేపథ్యంలో 'పాలనలో మార్పు' ఒక్కటే పరిష్కారంచూపదు. పాలించే తీరులోని మార్పుతోనే సత్ఫలితాలు సాధించగలుగుతాయి. ఇటీవల విద్యార్థుల అభిశంసనకు గురైన 'నీట్' విద్యావ్యవస్థను ప్రక్షాళన కోరుతూ ఆన్‌లైన్‌లో సిజెపి పెట్టిన వినతిపత్రంలో 8 లక్షలకుపైగా డిజిటల్ సంతకాలు వచ్చి చేరాయి. 'జెన్-జడ్' తరం పరిధిని దాటిపోయిన ఈ ఉద్యమానికి ప్రసిద్ధ సామాజిక కార్యకర్త సోనమ్‌వాంగ్ చుక్ వంటి వారి మద్దతు లభిస్తోంది. మరెందరు క్యూలో ఉన్నారో ఉంటారో. దేశంలో విద్యా వ్యవస్థకు పట్టిన దుర్దశను ఎత్తి ప్రశ్నించడానికేనా అన్నట్లు తాజా 'కాక్రోచ్' ఉద్యమ స్వరూపం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుత డిమాండ్ 'నీట్‌పరీక్షా నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమండ్‌తో 'జెన్ జీ'ల తొలిఅడుగు పడినప్పటికీ మలి అడుగు, మరో ఉధృతరూపానికి అవకాశమివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన బాధ్యత కేంద్రం తీసుకోవాలి. అత్యున్నత విద్యా ప్రవేశాల పరీక్షల పేపర్ లీక్, డేటా లీక్‌తో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థ సమూల ప్రక్షాళన కోరుకోవడం సబబే! ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాల్సిందే.

రెండు వర్గాల మధ్య పోరాటం జయాపజయాలకు దారి తీస్తుంది. ఒకే వర్గం మధ్య పోరాటం ఆ వర్గ నాశనానికి దారితీస్తుంది.



బిఆర్ అంబేద్కర్

వివేకవంతులతో గడిపిన సమయం మెరుగైనదైనట్లే, మంచి పుస్తకాలతో గడిపిన వయసు మెరుగైనదవుతుంది.



జాకబ్ బ్రొనోవిస్కీ

# పిడుగు పడితే మరణ ఘంటికలే!

**అమెరికా, జపాన్, యూరప్ దేశాలు సాంకేతికత సహాయంతో పిడు గులవల్ల జరిగేనష్టాన్ని గణనీయంగా తగ్గించాయి. యూరప్‌లో శాస్త్రవేత్తలు ఆకాశంలోకి శక్తివంతమైన లేజర్ కిరణాలను పంపి పిడుగులను జనాభా లేని ప్రాంతాల వైపుమళ్లించే పద్ధతులను పరీక్షిస్తున్నారు. జపాన్‌లో ప్రత్యేక డ్రోన్లద్వారా ఇటువంటి మేఘాల్లోని విద్యుత్ శక్తిని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. మన దేశంలో కూడా రాకెట్ కేంద్రాలు, అణువిద్యుత్ కేంద్రాలు, ప్రధాన నగరాల్లో ఈపద్ధతులను ప్రయోగాత్మకంగా ప్రారంభించవచ్చు. అలాగే పల్లెల్లోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద స్మార్ట్ సైరన్లు ఏర్పాటు చేసి హెచ్చరిక వ్యవస్థను బలపరచాలి. సాంకేతికత ఎంత ఉన్నాప్రజల్లో అవగాహనలేకపోతే ప్రాణనష్టం తగ్గదు.**

డి. చంద్రభాను

ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కురిసిన అకాల వర్షాలు ఊహించని రీతిలో పిడుగుల బీభత్సాన్ని సృష్టి స్తున్నాయి. పొలాల్లో కష్టపడుతూ, చెట్ల కింద తలదాచు కున్న రైతులు, కూలీలు పిడుగుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు వందలాది మూగజీవాలు, పాడి పశువులు కూడా అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. విజయనగరం జిల్లాలో చెట్టు కింద నిలబడిన మహిళా కూలీలు, తెలంగాణలో పొలాలకు వెళ్లిన గొర్రెల కాపరులు, కాడెద్దులు ఇలా పిడుగుపాటుకు బలవుతున్న ఘటనలు ప్రకృతి తీవ్రతను కళ్లకు కట్టినట్టు చూపిస్తున్నాయి. ఒకప్పుడు కేవలం వర్షాకాలంలో మాత్రమే వినిపించే ఉరుములు, ఇప్పుడు నడివేసవిలోనే పల్లెలపై మృత్యు గంటల్లా మోగు తున్నాయి. నేడు ఆకాశం నల్లబడితేనే ప్రజలు ఉలిక్కిపడు తున్నారు. ఈ పరిస్థితిని కేవలం ప్రకృతి సహజ ప్రక్రియగా భావించి పక్కన పెట్టలేం. ఈ ప్రకృతి హెచ్చరికల వెనుక మానవ తప్పిదాల పాత్ర ఎంత ఉందన్న ప్రశ్నను కూడా సమాజం ఎదుర్కోవాల్సిన సమయం వచ్చింది. పిడుగులు ఏర్పడటానికి ప్రధాన కారణం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు చెరువులు, నదులు, నేలలోని తేమ వేడెక్కి నీటి ఆవిరిగా మారుతుంది. ఈవేడి గాలి వేగంగా పైకి ఎగసి, ఎత్తులో ఉన్న చల్లనిగాలిని తాకినప్పుడు భారీ క్యూమిలోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. ఈ మేఘాల లోపల నీటి బిందువులు, మంచు కణాలు బలమైన గాలుల ప్రభావంతో ఒకదానికొకటి ఢీకొంటుంటాయి. దాంతో విద్యుత్ శక్తి ఏర్పడుతుంది. అది ఒక దశలో ఒక్కసారిగా మేఘాల నుంచి భూమివైపు విడుదలవుతుంది. అదే పిడుగుపాటు. వాతావరణంలో వేడి ఎంత ఎక్కువగా ఉంటే ఈ ప్రక్రియ అంత తీవ్రంగా జరిగే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితి ఎంత ఆందోళనకరంగా మారిందో ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ మే 2026లో విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలోప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన మొత్తం మరణాల్లో 35.7 శాతం మరణాలు పిడుగుల వల్లే నమోదయ్యాయి. 2024లో దేశ వ్యాప్తంగా పిడుగుపాటు కారణంగా 2,825 మంది మరణించారు. ఇది అంతకు ముందటి ఏడాదితో పోలిస్తే 10.4 శాతం ఎక్కువ. మధ్యప్రదేశ్ (577), బీహార్ (360), ఉత్తర ప్రదేశ్ (275), ఒడిశా (249), ఛత్తీస్‌గఢ్ (241) రాష్ట్రాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం సగటున 86నుంచి 95 మంది, తెలంగాణలో కూడా దాదాపు అదే స్థాయిలో ప్రజలు పిడుగుల బారిన పడుతున్నారు. భూతాపం కారణంగా ప్రతి ఒక డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు పిడుగుల తీవ్రత 8 నుంచి 10 శాతం వరకు పెరుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ మరణాల్లో 90 శాతం కంటే ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల వారే కావడం మరింత ఆందోళన కలిగించే విషయం. పిడుగులు పెరగడానికి కేవలం ప్రకృతినే



నిందించలేం. దీని వెనుక మనుషుల పాత్ర కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అడవులను విచ్చలవిడిగా నరికివేయడం, పట్టణాలు విస్తరించడం వల్ల పచ్చదనం తగ్గి భూమి నేరుగా సూర్యరశ్మిని గ్రహించి మరింత వేడెక్కుతోంది. దాంతో పిడుగులకు కారణమయ్యే మేఘాలు చాలా వేగంగా తయారవుతున్నాయి. ఇదే కాకుండా వాహనాలు, పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్య వాయువులు, పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల గాలిలో సూక్ష్మ ధూళికణాలు పెరుగుతున్నాయి. ఇవి మేఘాల్లో చేరినప్పుడు మంచు కణాల మధ్య ఘర్షణ మరింత పెరుగుతుంది. అంటే మనమే సృష్టిస్తున్న కాలుష్యం మేఘాలను ప్రమాదకర విద్యుత్ కేంద్రాలుగా మార్చేస్తోంది. పర్యావరణాన్ని పాడు చేస్తూ తీసుకునే ప్రతి తప్పు నిర్ణయం ఇప్పుడు పిడుగు రూపంలో మనముందుకు వస్తోంది. పిడుగుల నుంచి ప్రజలను, ముఖ్యంగా రైతులను కాపాడేందుకు మన దేశం ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత, కృత్రిమ మేధస్సును సమర్థంగా ఉపయోగిస్తోంది. కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన 'దామిని' మొబైల్ యాప్ ఫోన్ జీపీఎస్ ఆధారంగా పనిచేస్తుంది. మనం ఉన్న ప్రాంతానికి 20 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో వచ్చే 40 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉందేమో ముందుగానే హెచ్చరిస్తుంది. అంతేకాకుండా పుణేలోని వాతావరణ పరిశోధన సంస్థ దేశవ్యాప్తంగా వందలాది మెరుపు గుర్తింపు పరికరాలను ఏర్పాటు చేసింది. ఇన్‌శాట్3డి, ఇన్‌శాట్ 3 డిఆర్ ఉపగ్రహాలు, విశాఖపట్నం, హైదరాబాద్‌లోని డాప్లర్ రాడార్లు మేఘాల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి. ఐటీ సంస్థలు కూడా పిడుగులను ముందే అంచనా వేసే కొత్త సాఫ్ట్‌వేర్‌లను తయారు చేస్తున్నాయి. అమెరికా, జపాన్, యూరప్ దేశాలు సాంకేతికత సహాయంతో పిడుగులవల్ల జరిగేనష్టాన్ని గణనీయంగా తగ్గించాయి. యూరప్‌లో శాస్త్రవేత్తలు ఆకాశంలోకి శక్తివంతమైన లేజర్ కిరణాలను పంపి పిడుగులను జనాభా లేని ప్రాంతాల వైపుమళ్లించే పద్ధతులను పరీక్షిస్తున్నారు. జపాన్‌లో ప్రత్యేక డ్రోన్లద్వారా ఇటువంటి మేఘాల్లోని విద్యుత్ శక్తిని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. మన దేశంలో కూడా రాకెట్ కేంద్రాలు, అణు విద్యుత్ కేంద్రాలు, ప్రధాన నగరాల్లో ఈపద్ధతులను ప్రయోగాత్మకంగా ప్రారంభించవచ్చు. అలాగే పల్లెల్లోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద స్మార్ట్ సైరన్లు ఏర్పాటు చేసి హెచ్చరిక వ్యవస్థను బలపరచాలి. సాంకేతికత ఎంత ఉన్నాప్రజల్లో అవగాహనలేకపోతే ప్రాణనష్టం తగ్గదు. పిడుగులు ఎక్కువగా ఎత్తైన వస్తువులపైనే పడతాయి. కాబట్టి ఉరుములు వచ్చినప్పుడు చెట్లకింద నిలబడటం చాలాప్రమాదకరం. బయట బహిరంగ ప్రదేశంలో ఉన్నప్పుడు పిడుగు పడే పరిస్థితిఉంటే నేలపై పూర్తిగా పడుకోకుండా, మోకాళ్లపై వంగి తలను కిందికి పెట్టుకుని కూర్చోవాలి. అలాగే ఉరుములు వచ్చినప్పుడు మొబైల్ ఫోన్లు ఉపయోగించడం, టీవీలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర నిలబడటం చేయకూడదు. ఇనుప వస్తువులు, పంపుల దగ్గర కూడా ఉండకూడదు. పిడుగుపాటు అనేది కేవలం ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నందుకు ప్రకృతి మనకు ఇస్తున్న గట్టి హెచ్చరిక కూడా. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలపరచడం, గ్రామాల్లో ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించడం ఎంత అవసరమో భూతాపాన్ని, వాయు కాలుష్యాన్ని తగ్గించడం కూడా అంతే అవసరం. మానవ ప్రాణాల రక్షణేలక్ష్యంగా పర్యావరణ పరిరక్షణను ఒక సామాజిక ఉద్యమంగా మార్చినప్పుడే ఆకాశం నుంచి వచ్చే ఈ ప్రమాదం నుంచి మన సమాజాన్ని కాపాడుకోగలం.

# ఉపాధ్యాయుల్లో 'టెట్' గందరగోళం

నల్ల రవి కుమార్

భారతదేశ పాఠశాల విద్యా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాల పెంపుదల కోసం ఉద్దేశించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రస్తుతం దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులలో తీవ్ర ఆందోళనకు, చర్చకు దారితీసింది. ఇటీవల గౌరవ సుప్రీంకోర్టు 'సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా టెట్ పాస్‌కావాల్సిందే' అని స్పష్టంచేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది. విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ2009)లోని సెక్షన్ 23(1) ప్రకారం పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకు కనీస అర్హతలు ఉండాలని నిర్దేశించారు. దీనిని అనుసరించి జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ఆగస్టు23, 2010న ఉపాధ్యాయ నియామకాలకు 'టెట్'ను తప్పనిసరి చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, చట్టం అమలులోకి రాకముందు, అనగా 2011 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయుల పరిస్థితి ఏమిటనే దానిపై సుదీర్ఘ న్యాయపోరాటం నడిచింది. వివిధ ఉపాధ్యాయ సంఘాలు దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని, కాబట్టి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులైనా సరే టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని స్పష్టం చేసింది. కానీ, ఆచరణలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి ఇబ్బందులను, విధానపరమైన లోపాలను పరిశీలిస్తే ఈ నిర్ణయంలోను, టెట్ నిర్వహణ తీరులోను అనేక అసంబద్ధతలు స్పష్టమవుతాయి. చట్టాలు సాధారణంగా భవిష్యత్తు నియామకాలకు వర్తిస్తాయి తప్ప వెనుకటి తేదీల నుండి అమలు కావు. ఎప్పుడో పదిహేను నుండి ఇరవై ఐదు ఏళ్ల క్రితం నాటి నిబంధనల ప్రకారం ఎంపికై, ప్రస్తుతం 55 ఏళ్ల వయసులో పదవీ విరమణకు దగ్గరగా ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను ఇప్పుడు 'టెట్' రాయమనడం, అది కూడా చట్టం రాకముందు చేరినవారికి వర్తింపజేయాలనుకోవడం ఎంతవరకు న్యాయమనే ప్రశ్న ఉదయిస్తుంది. దశాబ్దాల బోధనా అనుభవం ఉన్న ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని కేవలం ఒక అర్హత పరీక్షతో కొలవాలనుకోవడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేఅవుతుంది. ఉపాధ్యాయులు తమ దైనందిన బోధనకు సంబంధం లేని సబ్జెక్టులను కూడా టెట్లో భాగంగా రాయాల్సి రావడం మరో విడ్డూరం. ఇది బోధనా ప్రమాణాల మెరుగుదలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో అర్థం కాని పరిస్థితి. మరో ప్రధాన అసంబద్ధత టెట్ మార్కులకు ఉపాధ్యాయ నియామక పరీక్ష (టిఆర్‌టి/డిఎస్‌సి)లో 20వెయిటేజీ ఇవ్వడం. ఉన్నత విద్యా రంగంలో లెక్చరర్ అర్హత కోసం నిర్వహించే నెట్, ఎపి సెట్ వంటి పరీక్షల మార్కులను కేవలం అర్హతగానే పరిగణిస్తారు తప్ప, నియామకాల్లో వాటికి ఎలాంటి వెయిటేజీ ఇవ్వరు. కానీ పాఠశాల విద్యలో మాత్రం టెట్ స్కోరును వెయిటేజీతో ముడిపెట్టడం వల్ల, నిరుద్యోగ అభ్యర్థులు తమ స్కోరును పెంచుకోవడం కోసం ప్రతి ఆరు నెలలకోసారి పరీక్షలు రాస్తూ తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక అర్హత పరీక్షను కేవలం స్క్రీనింగ్ టెస్టాగా ఉంచకుండా, ర్యాంకింగ్ నిర్ణయించే సాధనంగా మార్చడం విద్యా విధానంలోని లోపమే. అలాగే, సాధారణంగా ఏ పరీక్షలోనైనా ఉత్తీర్ణత మార్కు35లేదా40గా ఉంటుంది. పోటీ పరీక్షలలో సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు, వేర్వేరు కట్‌ఆఫ్ మార్కులుండటం సహజం. కానీ కేవలం ఒక అర్హతపరీక్షకు సామాజిక వర్గాల వారీగా 40,50,60 మార్కులను క్వాలిఫైయింగ్ మార్కులుగా నిర్దేశించడం విచిత్రమైన పరిణామం. అర్హతఅనేది అభ్యర్థి కనీస నైపుణ్యాన్ని సూచిస్తుంది, అందులో ఇలాంటి వ్యత్యాసాలు హేతుబద్ధంగా లేవనే వాదన బలంగా వినిపిస్తోంది. అసలు ఎన్‌సిటిఇ ఏర్పడిన తర్వాతే దేశంలో ఉపాధ్యాయ శిక్షణ ప్రమాణాలు పడిపోయాయనే విమర్శలున్నాయి. నేడు ఉపాధ్యాయ విద్యను బోధించ దానికి సరైన అర్హతలు, నైపుణ్యాలున్న అధ్యాపకులే ఆయా ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో లేరు. పునాది స్థాయిలోనే శిక్షణ సరిగాలేనప్పుడు, కేవలం 'టెట్'అనే ఒక పరీక్షనునిర్వహించడం ద్వారా విద్యా ప్రమాణాలను సాధిస్తామనుకోవడం పూర్తి అసంబద్ధత. వ్యవస్థలోని అసలు లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇప్పుడు'టెట్' అనే అస్త్రాన్ని ఉపాధ్యాయులపై రుద్దడం ఎంతవరకు సమంజసం? ప్రస్తుత గందరగోళాన్ని తొలగించి, ఉపాధ్యాయులలో నెలకొన్న ఆందోళన పోగొట్టడానికి తక్షణమే పరిష్కారమార్గాలను అన్వేషించాల్సి ఉంది. కేంద్రప్రభుత్వం పార్లమెంటులో చట్ట సవరణ చేసి, 2011కంటే ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులందరికీ ఈ పరీక్ష నుండి శాశ్వత మినహాయింపు ఇవ్వాలి.

# మాననీయ నదులలో మన యమున



డా పి. జగన్నాథరావు

పుణ్యపరంపరలు కల ఏ నదిని చూసినంత మాత్రానే కోటి జన్మలలో చేసిన పాపాలు శమిస్తాయో అటువంటి నదీమతల్లి యమునానది. **'నమామి సుకృతశ్రేణీం యమునా తరంగిణీమ్ యద్వీక్షణం కోటి జన్మకృత దుష్కర్మశిక్షణమ్?'** బృహస్పతి పుష్కరునిలో కలిసి కర్కాటకంలో ప్రవేశించినది మొదలు 12 రోజులు యమునా నదిలోస్నానం చేసినంత మాత్రము చేతనేఏడుతరాల పాపాలు నశించిపోతాయి. భూమి మీద ఎన్ని తీర్థాలైతే ఉన్నాయో అవన్నీ కూడా యమునా నదీని ఆశ్రయించి ఉంటాయి. బ్రహ్మ, విష్ణువు, శివుడు, ఇంద్రుడు, ఋషులు పితృదేవతలు అందరూ యమునా నదియందే నివసిస్తారు. ఈ కాలమునందు చేసిన స్నానము దానము పితృకార్యా లు అన్నీ గంగానదీ దగ్గర చేసిన ఫలిస్తాయి. కోటిరెట్లు ఫలిస్తాయి. ఋగ్వేదంలో గంగానదితో పాటు యమునా నది గురించి కూడా ప్రస్తావన ఉంది. హిమాలయ పర్వ తాల్లో కాళింది పర్వతాల్లో యమునా నది జన్మస్థలం, నదీ రూపం దాల్చిన సూర్యుడి కుమార్తె కాబట్టి సూర్యతనయ అనే పేరు యమునకుఉంది. కృష్ణుడికి బాల్యమంతా ఈ నది పరివాహక ప్రాంతంలోని సాగింది. భరతుడు, అంబరీషుడు, సంతనుడు మొదలైన చక్రవర్తులు ఈ నది ఒడ్డున ఎన్నో పుణ్యకార్యాలు నిర్వహించారు. భారతీయ సాహిత్యంలో మొట్టమొదట మనకు నదుల ప్రస్తావన వేదాల్లో కనిపిస్తుంది. ఇప్పటివరకుమనకు లభించిన రచనల్లో వేదాలు చాలా పురాతనమైనవి. వాటిలో ఋగ్వేదం మొదటిది. ప్రపంచంలోనే మొదటి సాహిత్య గ్రంథంగా ఋగ్వేదాన్ని భావిస్తారు. ఇది ప్రకృతి వర్ణనలకు రత్నాకరం, ఋగ్వేదంలో నదులకు జన్మస్థానాలైన పర్వతాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చినట్లుగా కనిపించదు, కానీ ఆ పర్వతాల్లో పుట్టిన నదులకు చాలాప్రాముఖ్యతను ఇచ్చి వాటిని దేవతలుగా ఆరాధించి, స్తుతించటం కనిపిస్తుంది. సూర్య, చంద్ర, అగ్ని, మరుత్తు, రాత్రి, పగలు భూమి, ఆకాశం వంటి ప్రకృతి దేవతలతో పాటుగా, నదులను కూడా ఆరాధించి స్తుతించారు. తైత్తిరీయ ఉపనిషత్తు, బ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుండివాయువు, వాయువు నుండి జలం, జలం నుండి భూమి, భూమి నుండి ఔషధులు, ఔషధుల నుండి అన్నం, అన్నం నుండి జీవుడు పుట్టాయని వివరిస్తుంది. యమునానదీ పుష్కరాలు ఆరంభం జూన్ 2 నుండి జూన్ 13వరకు గురుగ్రహం సంవత్సరానికి ఒకసారి 12 రాశులలోకి, ఒక రాశి, నుండి మరో రాశిలోనికి మారినప్పుడల్లా, భారత దేశంలోని ఒక్కొక్క నదికి పుష్కరములు ఏర్పడతాయి. గురుడు కర్కాటకరాశిలో ప్రవేశించినప్పుడు యమునానదికి పుష్కరాలు వస్తాయి. ఆ సమయంలో, ఆ నది సకల తీర్థాలను తనలో నింపుకొంటుంది, అందువల్లే పుష్కర కాలంలో నదులకు మహా మహిమలు కలుగుతాయి అని మన పురాణాలు చెబుతున్నాయి. ఇది హిమవత్పర్వతంలోనే పుట్టింది. మంచు చరియల మధ్య ఇది పుట్టిన చోటుకు 4 మైళ్ళ తర్వాత జమునోత్రి ఆలయం ఉంది. మామూలుగా యమున ఇక్కడ నించి ఉదయించిందనిపేరు. ఇందులో యమునాదేవి విగ్రహం ఉంది. ఇక్కడనించి కదలి



చిన్న చిన్న శైల ప్రవాహాలను కలుపుకుంటూ దాదాపు 80 మైళ్ళు హిమాలయ ప్రాంతంలో ప్రయాణం చేసి ఖారా దాటిమరో 15 మైళ్ళు వెళ్ళి ఫైజాబాదు దగ్గర పెద్దనది అయింది. ఇక్కడినుంచే ఈ నదికి చాలా కాలవలు తీశారు. ఇది ఢిల్లీ, బాగ్పట్, బృందావ, మధుర, మహావన, ఆగ్రా, ఫిరోజాబాద్, ఇటావా, కల్పి, హమీర్పూర్ మొదలైన ప్రసిద్ధ ప్రదే శాల మీదుగా ప్రయాణంచేసి అలహాబాద్ దగ్గర గంగా నదితో కలిసింది. గంగా యమునల మధ్య ప్రయాగ నుంచి హరిద్వార్ దాకా ఉన్న ప్రదేశానికి బ్రహ్మావర్తమని, శశస్థలీ అనీ, అంతర్వేది అనీపేర్లు. యమున కళిందశిఖరం నించి ఉదయించటం చేత దానికి కళిందకన్య లేక కాళింది అని కూడా పేరు. వ్యాసుడు యమునలోని చిన్నద్వీపంలోనే పుట్టాడు. శ్రీకృష్ణుని జననం, విహారం యమునతో సన్నిహితమైనవి. ప్రపంచ దేశాలలో నదులు అక్కడి ప్రజలకు కేవలం భౌతిక జీవనాధారాలుగాపరిగణింపబడుతున్నాయి. కాని భారతదేశంలో అవి సాంస్కృతిక, ధార్మిక జీవనానికి ఆధారాలుగా పరిగణింపబడుతున్నాయి. భారతీయులు మన నదీనదాల మూలోత్పత్తులను, వాని వెనుకగల అధిదైవిక శక్తులను గుర్తించి పరంపరాగతంగా పరమ పవిత్రాలుగాను, తీర్థక్షేత్రాలుగాను, ముక్తిసాధనాలుగాను ఆరాధిస్తూ వచ్చారు.

**"గంగే చ యమునే కృష్ణ గోదావరి సరస్వతి నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు"** అంటూ స్నాన సమయంలో అనేక నదులను నిత్యం స్మరిస్తారు. మన ధర్మంలో దైవచింతన, ఆధ్యాత్మికత, దేశ చింతన, సమాజ చింతన, అఖండ జాతీయతా దృష్టి అన్నీ పెన వేసుకుని వున్నాయి. పూర్ణయాత్ర అంటే ఆధ్యాత్మిక దృష్టి, యావద్దేశసందర్శనమే కదా! నిత్యం అన్ని నదులను స్మరించుకోవాలంటే అర్థం దేశం మొత్తాన్ని అందులోని అణువణువును అందులోని దైవీశక్తి సంపదను స్మరించుకోవాలనేకదా! పవిత్ర నదీనదాల ప్రశస్తి మన ఆధ్యాత్మిక సంపదకు మూలభూతం. తీర్థయాత్రలవలన సమాజంలో ప్రతివారు తమకు చేతనయినంత లోకజ్ఞానాన్ని పొందడానికి అవకాశముంది. ఈపవిత్ర భావాల స్మరణద్వారా ప్రతివాడి భావాలు సంస్కరించబడతాయి. ఆదర్శంగా ప్రవర్తించడానికి కొంత జంకు ఏర్పడుతుంది. రాజు తాను స్వయంగా తీర్థసేవ ఆచరించి ప్రజలకు మార్గదర్శి అయినాడు తనచే పాలింపబడే రాజ్యానికి సరైన న్యాయం చేకూర్చగలుగుతాడు. రాముడు మానవుడు, రాజు. సంపూర్ణ మానవత్వమనేది ఆ జీవితంలో కనిపిస్తుంది. ఆయా సందర్భాలలో రాముడు తన విధులను సామాన్యునివలె నిర్వర్తించాడు నదులవద్ద. అట్లే అర్జునుడు బలరాముడు మున్నగువారు యాత్రల ద్వారా సమాజాన్ని దర్శించి జాతీయ అవగాహన పెంపొందించుకున్నారు. భారతంలో ధర్మపక్షపరులైన ప్రతివారు ఆధ్యాత్మిక జీవితాన్ని పూర్తిగా కొనసాగించకపోయినా కొంతకాలమైన తప్పనిసరిగా దాన్ని ఆచరించి భావసంస్కారాన్ని పొందారు. రాముడు వనవాస సమయంలో భరద్వాజాశ్రమంలో విశ్రాంతి తీసుకున్నాడు. తరువాత చిత్రకూట పర్వతం వద్దకు వెళుతూ మధ్యలో గంగా, యమునల సంగమాన్ని చూచాడు. యమునాతీరం నుండి తెప్ప సాయముతో యమునా నదిని దాటాడు. అక్కడ సీతాదేవి యమునానదికి తమవనవాసాన్ని శుభప్రదంగ ముగింపచేయమని ప్రార్థించింది. పట్టాభిషేకానంతరం మధ్యదానం, గోదానం నీ పేర చేయిస్తానని మొక్కింది. యమునానది ఒడ్డునే మాంధాత జన్మస్థలంఉన్నది. గంగా యమునల సంగమంలో వేదాలు అధ్యయనం చేయబడ్డాయి. యజ్ఞాలు అనుష్ఠింపబడ్డాయి. 60కోట్ల పుణ్యతీర్థాలు ఈ సంగమంలో కలిసుంటాయి. ఇందులో స్నానం చేసి రాజసూయ అశ్వమేధ యజ్ఞఫలాన్ని పొందుతారు. సత్య వాదులౌతారు. గంగా, యమునా నదుల్లో స్నానమాచరించి చతుర్వేద పఠన ఫలాన్ని పొందుతారని భారతంలో ప్రశంసించబడింది.

# ప్రజావాక్కు

## ఆర్థిక నిబంధనలకు విరుద్ధం

**నోటిఫికేషన్** పడటం, పరీక్ష రాయడం, చివరికి సెలెక్ట్ అవ్వడం ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికి తీసుకుని డ్యూటీలో చేరి జాయినింగ్ రిపోర్ట్ మీద సంతకం చేయడం మరో ఎత్తు. ఆ సంతకం పెట్టే వరకు వారు కేవలం 'అభ్యర్థులు' మాత్రమే, 'ఉద్యోగులు' కారు. అసలుసిస్టమ్‌లో ఉద్యోగిగా ఎంటర్ అవ్వకముందే, వారికి ఆ ఉద్యోగ సంబంధిత హక్కులు (పాత పెన్షన్) వర్తిస్తాయని చెప్పడం పాలనాపరంగా కరెక్ట్ కాదు. కట్ ఆఫ్ తేదీకి ఉన్న విలువప్రభుత్వం ఒక విధానాన్ని మార్చినప్పుడు ఒక స్పష్టమైన కట్‌ఆఫ్ తేదీని ప్రకటిస్తుంది. ఆ తేదీ నాటికి ఎవరైతే ఉద్యోగంలో ఉన్నారో వారికి పాత రూల్, ఆతర్వాత జాయిన్‌అయ్యే వారికి కొత్త రూల్ అని చట్టంచేసిన తర్వాత, 'మాకు నోటిఫికేషన్‌ముందే ఇచ్చారు కదా' అని మినహాయింపులు ఇస్తూ పోతే.. అసలు ఆ కట్‌ఆఫ్ తేదీకి, ప్రభుత్వ విధానాలకు అర్థమే లేకుండా పోతుంది. ఖాతా కూడాతెరవడానికి వీల్లేని సమయంలోని సర్వీసును ప్రామాణికంగా తీసుకుని ఓల్డ్ పెన్షన్ లెక్కించడం ఆర్థిక నిబంధనల ప్రకారం చాలా విరుద్ధం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## యువతకు అవకాశం కల్పించాలి

**ఎన్నికల** షెడ్యూల్‌వెలుపడటమే తరువాయి పోటీ చేసేందుకు తమకె అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలను కాకా పడుతూ వారిచుట్టుతిరిగేవారు ఇలాంటి రాజకీయ నాయకులు ఈరోజుల్లో చాలామంది ఉన్నారు. వీరు వయసులో చిన్న వారు కారు, చట్టసభలకు ఎన్నిక అవని వారూ కాదు. సీనియర్లు ఎంతో కాలంగా పార్టీకి సేవ చేస్తున్న వారు కదా అని అధిష్టానం వీరికి ఎన్నో సార్లు అవకాశం ఇచ్చింది. అయినా వీరికి తృప్తి ఉండటం లేదు. ఒక్కసారి కూడా అవకాశం రాని వారికి టికెట్ ఇవ్వాలి.

- కె.రామరాజు, హైదరాబాద్

## ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ఎలిమెంటరీను హైస్కూల్ నుండి వేరుచేయడం, ఇంటర్మీడియట్ విద్యను హైస్కూల్ ప్లస్‌గామార్చడం ఆహ్వానించదగ్గ మార్పు. విద్యాశాఖ సీనియర్లకు జూనియర్ల కంటే తక్కువ వేతనం రావడానికి ప్రధాన కారణం అన్వేషించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పింది. అప్రెంటిస్ కాలం పూర్తిచేసిన నేపథ్యంలో ఇవ్వబడిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వారు ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీ నుండి అమలు చేయాలి.

- బి. మేఘనాథం,విజయనగరం

## భారత్‌లో గోప్యత ఎక్కడ?

**డిజిటల్** యుగంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా మారిపోతున్నది. నగదు లావాదేవీల స్థానంలో డిజిటల్ చెల్లింపులు ప్రాముఖ్యత పొందుతున్నాయి. యూపీఐ, మొబైల్ వాలెట్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలు సాధారణ ప్రజల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వ నజర్ పెరగడం సహజమే. అయితే ఇది ప్రజల ప్రయోజనాలకు ఎంతవరకు అనుకూలం? లేదా వ్యక్తిగత గోప్యతకు ముప్పుకలిగించే అంశమా?అనే ప్రశ్నలు ప్రస్తుతానికి చర్చనీయాంశంగా మారాయి. మొదటగా, ప్రభుత్వ నజర్ వెనుక ఉన్న ఉద్దేశాన్నిపరిశీలిస్తే, ఆర్థిక పారదర్శకతను పెంచడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. డిజిటల్ లావాదేవీ లు ట్రాక్ చేయగలిగినవిగా ఉండటంవల్ల నల్లధనం నియంత్రణకు ఇది ఉపయోగపడుతుంది. పన్ను ఎగవేతను తగ్గించ డంలోకూడాఇది కీలకపాత్ర పోషిస్తుంది. డిజిటల్ లావాదేవీలు దేశ అభివృద్ధికి కీలకంగా మారిన ఈ కాలంలో, వాటిపై ప్రభుత్వ నజర్ అనివార్యం. అయితే అది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయకుండా, వారి గోప్యతను కాపాడే విధంగా ఉండాలి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

## పెరుగుతున్న సైబర్ నేరాలు

ఈ మధ్య సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయి. రూ. మూడువందల కోట్ల గ్లోబల్ సైబర్ ఫ్రాడ్ సిండికేట్ గుట్టు రట్టు కావడం సంచలనం సృష్టించింది. ఈ నేరగాళ్లు ఎంతటి సాంకేతిక నైపుణ్యంతో పనిచేస్తున్నారు. ఈనేరాల వెనుక ఉన్న సాధారణ ప్రవేశ మార్గం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒక నకిలీ ట్రేడింగ్ యాప్‌ద్వారా అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిప్రజలను వంచించారు. బాధితులు అజాగ్రత్తగా ఉన్నారని చెప్పలేం. ఈ మాయా వేదికలు అసలైన వాటిని పోలి ఉండటంతో వారు మోసపోయారు. ఇటువంటి దోపిడీలను అరికట్టడానికి వ్యవస్థలో మార్పులు రావాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఆక్రమణలను సుమోటోగా స్వీకరించాలి

**ఆంధ్ర రాష్ట్రంలో** దొంగస్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్నారు. హైకోర్టు వారు ఈ ఆక్రమణలను కూడా సుమోటోగా స్వీకరించి కూల్చి వేసేందుకు ఆదేశాలు ఇవ్వాలి. దాదాపు 25 సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతుంది. ప్రభుత్వ భూములను ఆక్రమించిన దొంగస్వాములను తన్ని తరమి వేయాల్సిన అధికారులు , దొంగబాబాల ప్రలోభాలకు, వత్తిళ్లకు లొంగిపోయారు.

-ఎన్.వేంకటేశ్, ప్రకాశంజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# వంటింట్లో గ్యాస్ మంట!

## సిలిండర్ ధర పెంపు

### రూ. 29 పెంచిన ఓఎంసిలు



న్యూఢిల్లీ,జూన్ 7: దేశంలో సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై ఎన్డీయే సర్కారు భారం పెంచుతోంది.గృహిణుల వంటింటి వ్యయాలు పెంచుతూ పోతోంది. ఓపక్క పొదుపు మంత్రం పఠిస్తూనే పెట్రోడీజిల్‌తోపాటు వంటగ్యాస్‌ధరలు కూడా పెంచుతూ వస్తోంది. పశ్చిమాసియా సంక్షోభాన్ని మోడీ ప్రభుత్వం లాభదాయకంగా వాడుకుంటున్నదని విపక్షాలు మండిపడుతున్న తరుణంలో తాజాగా రెండోసారి వంటగ్యాస్ ధరలను పెంచింది.దీనివల్ల మధ్యతరగతి, సామాన్య కుటుంబాలపై మరోసారి ధరల మరింత భారం పడింది. గృహావసరాలకు ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ వంటగ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రూ. 29 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ పెంచిన ధరలు ఆదివారం నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా వివిధ నగరాల్లో ఈ ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 913 నుంచి రూ. 942కి పెరిగింది. గత మూడు నెలల వ్యవధిలో వంటగ్యాస్ ధరలు పెరగడం ఇది రెండోసారి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ముడి చమురు, గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా భారతదేశానికి గ్యాస్ సరఫరా అయ్యే కీలకమైన హార్మూజ్ జలసంధి మార్గంలో ఏర్పడిన అంతరాయాలు దేశీయ ధరలపై ప్రభావం చూపాయి. ఈ సవరణకు ముందు వరకు చమురు సంస్థలు దేశీయ ఎల్పీజీ విక్రయాలపై సిలిండర్‌కు సుమారు రూ. 703 వరకు నష్టాన్ని భరిస్తూ వచ్చాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ తాజా పెంపు తర్వాత కూడా అంతర్జాతీయ కొనుగోలు ధరకు, దేశీయ విక్రయ ధరకు మధ్య ఉన్న వ్యత్యాసం పూర్తిగా భర్తీ కాలేదని తెలుస్తోంది. గత మార్చి నెలలో కూడా సిలిండర్ ధరను రూ. 60 పెంచిన సంగతి తెలిసిందే. వంటగ్యాస్ మాత్రమే కాకుండా, కొన్ని వారాలుగా ఇతర ఇంధన ధరలు కూడా సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. మేనెల మధ్యస్తం నుంచి ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ. 7.50 వరకు పెరగ్గా, కంప్రెస్డ్ నేచరల్ గ్యాస్ సీఎన్జీ ధరలు కిలోకు రూ. 6 వరకు పెరిగాయి. ఇంత పెరిగినప్పటికీ, ఆయిల్ కంపెనీలు ఇంకా పెట్రోల్‌పై లీటరుకు రూ. 11, డీజిల్‌పై రూ. 33.6 చొప్పున నష్టాన్ని భరిస్తున్నట్టు సమాచారం. ఈ వరుస ధరల పెంపు దేశంలోని కోట్ల మంది గృహిణుల నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి రాయితీ జమ అవుతున్నప్పటికీ, రాయితీ లేని సాధారణ వినియోగదారులు మాత్రం ఈ భారాన్ని పూర్తిగా మోయక తప్పడం లేదు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం పైప్డ్ నేచరల్ గ్యాస్ వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గులు సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతూనే ఉన్నాయి.

## పెంపుపై ఖర్గే మండిపాటు

## సమర్థించుకున్న కేంద్రం

**మల్లిఖార్జున్‌ఖర్గే విసుర్లు**

ఎల్జీజీ ధరలు రెండోసారి పెంచడంపై ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మండిపడ్డారు. యుపిఎ హయాంలో ఒక్కసారి ధరల సవరణ జరిగితేనే ద్రవ్యోల్బణం కట్టడిచేయలేకపోతోందంటూ వీధుల్లోకి వచ్చిన బిజెపి ఇపుడేమి సమాధానం ఇస్తుందని, పశ్చిమాసియా ఉద్రిక్తతల మాటున సామాన్య మధ్యతరగతిప్రజలపై వంటింటి భారం పెంచుతోందని విమర్శించారు. గడచిన నాలుగు నెలల్లోనే మోడీ ప్రభుత్వం దేశీయ ఎల్పీజీ సిలిండర్లధరలను రూ.89 రూపాయలు పెంచిందని గుర్తుచేసారు. మోడీజీ పార్లమెంటులో ఇంధన వనరులను 41 దేశాలనుంచి రప్పించుకుంటున్నట్లు పార్లమెంటులోనే చెప్పారని, అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొరత ఎందుకు ఉన్నదని ప్రశ్నించారు. ఉజ్వల స్కీం కింద 5.56 కోట్ల కుటుంబాలకు సింగిల్ సిలిండర్‌కూడా పొందలేకపోయారని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని మోడీ ప్రభుత్వం లాభదాయకతను పెంచుకోడానికి వాడుకుంటున్నదని మండిపడ్డారు.

# మెట్రోలో సిఎం డికె శివకుమార్ ప్రయాణం




బెంగళూరు, జూన్ 7: కర్ణాటక ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత డికె శివకుమార్ తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కనకపురలో పర్యటించారు. సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి డికె శివకుమార్ విధాన సౌధ మెట్రోస్టేషన్ నుంచి కనకపుర మెట్రోస్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఏ విధమైన హంగూ ఆర్భాటాలు లేకుండా ఒక సామాన్యుడిలా మెట్రో ఎక్కిన ముఖ్యమంత్రిని చూసి తోటి ప్రయాణికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ప్రయాణంలో భాగంగా ఆయన రైల్లోని ప్రయాణికులతో చాలా సాదాసీదాగా, సరదాగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నన్ను దొడ్డనహళ్లి, శాతనూర్ కనక్‌పుర, బెంగళూరుసౌత్‌లనుంచి విధాన సౌధకు తెచ్చారని, ప్రజలు నన్ను చూడాలనుకుంటున్నారని, నేనే వారికి సమయం ఇవ్వడంలేదని, అందుకు తాను కూడా బాధపడుతున్నానని అన్నారు. అందువల్లనే తనను కలిసేందుకు రావద్దని నేనే వస్తానని చెప్పానన్నారు.

అందుకే నా మొదటి పర్యటనగా నా నియోజకవర్గంలోకి వచ్చానన్నారు. ఎన్నుకున్న ప్రజలకు నాబాధ్యతగా కృతజ్ఞతలు చెప్పాలన్న లక్ష్యంతో వచ్చానన్నారు. ప్రజలను కలుసుకునేందుకు తన నియోజకవర్గంలో 20-25 కేంద్రాలు గుర్తించానని అన్నారు. అంతేకాకుండా ప్రజలను కలిసి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులను కూడా వేరుగా నియమిస్తానన్నారు. మెట్రో ప్రయాణం ముగిసిన తర్వాత కనకపుర స్టేషన్ వద్ద దిగి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ముందుకు సాగారు. వినూత్నంగా ఆలోచించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెట్రోను ఎంచుకున్న సిఎం డికె శివకుమార్‌పై బెంగళూరు ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సిఎం మొదటి పర్యటన కావడంతో కనకపుర తాలూకాలో ఉదయంనుంచి రాత్రివరకూ ఆదివారం పలు కార్యక్రమాలు ఏర్పాటుచేసారు.

# కోట్ల ఆస్తివివాదమే ఢిల్లీ ప్రొఫెసర్ హత్యకు కారణం

న్యూఢిల్లీ,జూన్ 7: ఆస్తి వివాదమే ఢిల్లీ ప్రొఫెసర్ హత్యకు కారణమని కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని శివాజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న దేవేస్మితా పాల్ అనే మహిళ హత్యకు గురైంది. నగరంలోని వసుంధరా ఎన్‌క్లేవ్‌లోని తన అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గత గురువారం హత్యకు గురైంది. ఈమెకు, ఒక దంపతులకు మధ్య ఒక ఫ్లాట్‌కు సంబంధించి వివాదం నడుస్తోంది. దేవోస్మితకు పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఒక ఫ్లాట్ ఉంది. అది ఆమె తాతముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చింది. అక్కడ ఆ ఫ్లాట్‌ను వారు దంపతులకు అద్దెకు ఇచ్చారు. కొన్నాళ్లుగా వారు అక్కడ అద్దెకు ఉంటున్నారు. ఆ ఫ్లాట్ బాగా నచ్చిన ఆ దంపతులు దాన్ని కొనాలనుకున్నారు. ఈ విషయం యజమాని అయిన దేవోస్మితకు, ఆమె సోదరులకు చెప్పారు. వారంతా దీనికి అంగీకరించారు. ఆ ఫ్లాట్ అమ్మాలని డిసైడ్ అయ్యారు. అది కోట్ల విలువ ఉంటుంది. ఆ కుటుంబంలో దేవోస్మిత మినహా అందరూ ఫ్లాట్ అమ్మేందుకు అంగీకరించారు. దాన్ని ఎట్టిపరిస్థితుల్లో అమ్మేది లేదని దేవోస్మిత తేల్చి చెప్పింది. తాము ఫ్లాట్ కొనడానికి ఏకైక అడ్డంకిగా ఉన్నదని ఆ దంపతులు దేవోస్మితను హత్య చేశారు. మృతురాలు దేవోస్మిత సోదరి దేవరతి పాల్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చి ఫ్లాట్ తలుపులు పగలగొట్టి చూడగా, దేవోస్మిత రక్తపు మడుగులో శవమై కనిపించింది. సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి సిసిటివి ఫుటేజీలను పరిశీలించారు. అందులో మాస్కులు ధరించిన ఓ పురుషుడు, స్త్రీ అనుమానాస్పదంగా మెట్లు ఎక్కి ఫ్లాట్ వైపు వెళ్లడం, దాదాపు 30 నిమిషాల తర్వాత దుస్తులు మార్చుకుని బయటకు రావడం రికార్డ్ అయ్యింది. ప్రత్యేక బృందాలు పశ్చిమ బెంగాల్ వెళ్లి నిందితులను అరెస్ట్ చేసి, తదుపరి విచారణ నిమిత్తం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తరలిస్తున్నారు. మాస్కులు ధరించి, లిఫ్ట్ వాడకుండా మెట్లమార్గంలో ఆమె ఫ్లాట్లోకి చేరుకుని, హత్య చేశారు. వారు ఫ్లాట్‌లోకి వెళ్లడం అక్కడి సీసీ కెమెరాలో రికార్డైంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపారు. నిందితులైన దంపతులను గుర్తించి అరెస్టు చేశారు.

# మోడీ ఇచ్చిన వజ్రాన్ని కొనాలనుకున్నా: జిల్ బైడెన్



వాషింగ్టన్, జూన్ 7: జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధాని మోడీ బహూకరించిన 7.5 క్యారెట్ల సింథటిక్ వజ్రాన్ని అమెరికా మాజీ ప్రథమ మహిళ జిల్ బైడెన్ గుర్తు చేసుకున్నారు. మోడీ బహుమతిగా ఇచ్చిన వజ్రాన్ని తన వద్దే ఉంచుకోవాలని తొలుత అనుకున్నానని.. కానీ, అమెరికా అధికారులు దానికి ఎక్కువ విలువ కట్టడంతో ఆ డైమండ్‌ను ఫెడరల్ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసినట్లు 'వ్యూ ఫ్రమ్ ది ఈస్ట్ వింగ్ : ఎ మెమోరియల్' అనే తన ఆత్మకథలో రాసుకొచ్చారు. ఈ పుస్తకంలో వైట్‌హౌస్‌లోని తెరవెనుక జీవితం గురించి.. అధ్యక్షుడి కుటుంబం అందుకునే బహుమతులకు ఉన్న నిబంధనల గురించి జిల్ బైడెన్ వివరించారు. 2023, జూన్‌లో అమెరికా అధ్యక్ష భవనం ఇచ్చిన అధికారిక విందులో మోడీ అతిథిగా పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన బహూకరించిన వజ్రం తనను ఎంతో ఆకర్షించిందని.. చాలా అద్భుతంగా ఉందని జిల్ బైడెన్ పేర్కొన్నారు. అయితే బైడెన్ పదవి తప్పుకున్న తర్వాత అమెరికా నియమాల ప్రకారం.. ఆ బహుమతిని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాల్సి వచ్చిందని తెలిపారు. దానికి అప్పట్లో ఉన్న మార్కెట్ విలువను చెల్లించి కొనుగోలు చేయాలని తాను అనుకున్నట్లు తెలిపారు.

విదేశాంగ శాఖ వజ్రం విలువను 20 వేల డాలర్లుగా అంచనా వేయడంతో దానిని కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. అందుకు బదులుగా ఆ వజ్రాన్ని అరువుగా తీసుకుని అధికారిక కార్యక్రమాల్లో ధరించడానికి అధికారులు తనకు అనుమతి ఇచ్చారని అన్నారు. దీంతో ఆ డైమండ్‌ను ఓ ఉంగరానికి పొదిగించి ధరించినట్లు తెలిపారు. ఫ్రాన్స్ ప్రథమ మహిళ బ్రిగిట్టే మెక్రాన్ తనకు ఇచ్చిన బ్రాస్‌లెట్‌ను అమెరికా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు.

# భారత్‌లో పడిపోతున్న జననాల రేటు: ఎలాన్ మస్క్



న్యూయార్కు, జూన్ 7: ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ సిఇఒ ఎలాన్ మస్క్ భారత్‌లో జననాల రేటు గణనీయంగా తగ్గుతోందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన పునఃస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని ఆయన హైలైట్ చేశారు. ఈ అంశంపై మీడియా సంస్థ ఏఎఫ్ పోస్ట్ షేర్ చేసిన డేటాను ప్రస్తావిస్తూ మస్క్ ఎక్స్ వేదికగా స్పందించారు. భారత్‌లో జననాల రేటురీప్లేస్‌మెంట్ స్థాయి కంటే తగ్గింది. ఉన్నత విద్యావంతుల్లో ఈ రేటు చాలా యేళ్ల క్రితమే పడిపోయిందని తన పోస్టులో పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) ప్రతి మహిళకు 2.1 పిల్లలు అనే ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని ఏఎఫ్ పోస్ట్ నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలోనే ఈ రేటు 2.3 నుంచి 1.9కి క్షీణించిందని తెలిపింది. ఢిల్లీలో అయితే ఈ రేటు 1.2కి పడిపోయిందని, ఇది ఫిన్‌లాండ్ కంటే కూడా తక్కువని నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పిఎ) విడుదల చేసిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్ 2025 కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.9గా నమోదైందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువ అని స్పష్టం చేసింది. సంతానోత్పత్తి రేటు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రతి తరం మునుపటి తరం కంటే చిన్నదిగా మారి, దేశ జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని నివేదిక విశ్లేషించింది.

జననాల రేటు తగ్గుతున్నప్పటికీ, 146 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతోంది. 2023లో చైనాను అధిగమించి భారత్ ఈ స్థానానికి చేరుకుంది. విద్య, పట్టణీకరణ పెరగడం, మహిళలు ఉద్యోగాల్లో చేరడం, మారుతున్న కుటుంబ ప్రాధాన్యతలువంటివి జననాల రేటు తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రసూతి మరణాలు, లింగ వివక్ష వంటి సవాళ్లు ఉన్నాయని యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక తెలిపింది.



## గర్భిణీల పోషకాహారంలో చచ్చిన పాము

భోపాల్, జూన్ 7: మధ్యప్రదేశ్‌లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో అంగన్వాడీ ఆహారంలో చనిపోయిన పాము కనిపించింది. అంగన్వాడీ సెంటర్ల ద్వారా గర్భిణీలకు అందించే పోషకాహార లడ్డూ ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల కనిపించడం స్థానికంగా కలకలం కలిగించింది. ఈ ఘటన పాండుర జిల్లాలోని కర్ఘాట్ కమ్హి గ్రామంలో చోటుచేసుకుంది. వచలా బాయి ధుర్వే అనే గర్భిణీ స్త్రీకి అంగన్వాడీ కేంద్రంనుంచి పోషకాహార ప్యాకెట్ అందించారు. ఇంటికితీసుకెళ్లిన తర్వాత కుటుంబీకులు ఆ ప్యాకెట్‌ను తెరిచి చూడగా అందులో చనిపోయిన పాము పిల్ల కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగాషాక్ అయ్యారు. అయితే, ఈ ఆహారాన్ని ఎవరూ తినకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఫుడ్ శాంపిళ్లను పరీక్ష కోసం పంపారు.

## ఎఐ కంపెనీల్లో అమెరికా ప్రజలకు వాటాలు

### డొనాల్డ్‌ట్రంప్ కొత్త వ్యూహాలు


వాషింగ్టన్,జూన్ 7: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలకు సంబంధించి ఒక సంచలన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ప్రముఖ ఎఐ సంస్థలు అమెరికన్ ప్రజలకు తమ కంపెనీల్లో వాటాలను ఇచ్చేలా ఒక సరికొత్త విధానాన్ని తీసుకురావాలని తన బృందం యోచిస్తోందని ఆయన వెల్లడించారు. వచ్చేవారం ఎఐ రంగానికి చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో తాను సమావేశం కానున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇది చాలా ఆసక్తికరమైన ఆలోచన. దీనివల్ల ఎఐ కంపెనీలకు, అమెరికా ప్రజలకు మధ్య ఒక మంచి భాగస్వామ్యం ఏర్పడుతుంది. దీనిపై మేము కచ్చితంగా ఆలోచిస్తామని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భాగస్వామ్యంపై ముందస్తు చర్చలు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. అమెరికా ప్రభుత్వ ఉన్నతాధికారులు అప్పుడే కొన్ని ఎఐ కంపెనీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అమెరికా ప్రభుత్వం కొన్ని ప్రముఖ కృత్రిమమేధ సంస్థల షేర్లను కొనుగోలు చేసి, వాటిలో భాగస్వామ్యం తీసుకునే అవకాశం ఉందనే అంశం కూడా ఈ చర్చల్లో వచ్చినట్లు తెలుస్తోంది.

## జ్యూయెలరీ తయారీ యూనిట్‌లో విషవాయువు లీక్

### నలుగురు మృతి

సూరత్, జూన్ 7: గుజరాత్‌లోని పారిశ్రామిక నగరం సూరత్‌లోని జ్యువెలరీ తయారీ యూనిట్‌లో విషవాయువు లీక్ అయి ఓ సూపర్‌వైజర్ సహా నలుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం అశ్విని కుమార్ రోడ్డు పరిధిలోని జ్యువెలరీ తయారీ ప్రక్రియలో వెలువడే రసాయన వ్యర్థాలను సేకరించేందుకు ఆ ఫ్యాక్టరీ ఆవరణలో ఓ ఈటీపీ సెప్టిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి 2 నెలలకు ఒకసారి ఈ ట్యాంక్‌ను శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఎప్పటిలాగే ఇవాళ ఉదయం ఓ సూపర్‌వైజర్, ముగ్గురు కార్మికులతో కూడిన నలుగురు సభ్యుల బృందం ఆ ట్యాంక్‌ను క్లీన్ చేయడానికి వెళ్లింది. ట్యాంక్ క్లీన్ చేస్తున్న సమయంలో ఓ కార్మికుడు అకస్మాత్తుగా లోపలికి జారిపడిపోయాడు. అతడని కాపాడే క్రమంలో మిగిలిన ముగ్గురు కూడా ఒకరి వెనుక ఒకరు ట్యాంక్ లోపలికి దిగారు. ట్యాంక్‌లో అప్పటికే పేరుకుపోయిన రసాయనాల వల్ల తీవ్రమైన విషవాయువులు వెలువడటంతో, ఊపిరాడక నలుగురు అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయి ప్రాణాలు విడిచారు.

## మళయాల నటుడు సలీమ్‌కుమార్ కన్నుమూత



తిరువనంతపురం, జూన్ 7: మలయాళ చిత్ర పరిశ్రమ అద్భుత మైన నటుణ్ని కోల్పోయింది. మలయాళ సీనియర్ నటుడు, జాతీయ అవార్డు గ్రహీత సలీం కుమార్ కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్రమైన కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన, కేరళలోని కొచ్చిలో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతూనే పరిస్థితి విషమించి, గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్య వర్గాలు అధికారికంగా వెల్లడించాయి. ఆయన మరణవార్త విన్న సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.



## గల్ఫ్ మిత్ర దేశాల కోసం ఇరాన్ ఆస్తులపై అమెరికా కన్ను?

వాషింగ్టన్, జూన్ 7: ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనకపోయినా.. అమెరికా–ఇరాన్ మధ్య పోరులో గల్ఫ్ దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. యుద్ధం కారణంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీంతో గల్ఫ్ మిత్రదేశాల పునర్నిర్మాణానికి సాయం అందించాలని అమెరికా భావిస్తున్నట్లు తెలుస్తోంది, ఇందుకోసం ఇరాన్ ఆస్తులను వినియోగించుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ మిత్రదేశాలకు కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఒక బృందాన్ని ఆదేశించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆ నష్టాన్ని పూడ్చేందుకు ఇరాన్ ఆస్తులను ఉపయోగించడాన్ని వారు పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. ఈ ఆస్తులను భవిష్యత్తు పునర్నిర్మాణం, మరమ్మతుల కోసమే కాకుండా.. ఇప్పటికే భాగస్వాములకు జరిగిన నష్టానికి పరిహారంగా అందించాలని భావిస్తున్నట్లు వెల్లడించాయి. అయితే, ఇరాన్‌కు చెందిన ఏ ఆస్తులను పరిగణనలోకి తీసుకున్నారనే విషయాన్ని స్పష్టం చేయలేదు.



## అభిలాషా బరాక్‌కు యుఎన్ అవార్డుపై ప్రధాని మోడీ అభినందనలు

న్యూఢిల్లీ,జూన్ 7: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మేజర్ అభిలాషా బరాక్‌కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. ఐక్యరాజ్యసమితి అందించే యూఎన్ మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఆమె ఎంపిక కావడం పట్ల ప్రధాని మోడీ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం మేజర్ బరాక్ లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి తాత్కాలిక బలగాలలో ఎంగేజ్‌మెంట్ టీమ్ కమాండర్‌గా, జెండర్ ఫోకల్ పాయింట్‌గా తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆమెకు దక్కిన ఈ గౌరవం ఆమె అసాధారణ సేవలకు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ఈ అవార్డు మేజర్ బరాక్ ప్రతిభను గుర్తించడంతో పాటు, ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక దేశాల్లో భారతదేశం సుదీర్ఘకాలంగా అందిస్తున్న సహకారానికి దక్కిన గొప్ప గుర్తింపు అని ప్రధాని మోడీ కొనియాడారు. దేశానికి, మానవాళికి సేవ చేయాలనుకునే కోట్లాది మంది యువ భారతీయులకు, ముఖ్యంగా భారతీయ కుమార్తెలకు (మహిళలకు) ఆమె సాధించిన ఈ విజయం ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రధాని తన సందేశంలో ఆకాంక్షించారు.



## ఇది ట్రైలర్ మాత్రమే!

### కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాల్సిందే

### లేదంటే దేశవ్యాప్త ఉద్యమం: కాక్రోచ్ పార్టీ వార్నింగ్

న్యూఢిల్లీ,జూన్ 7: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఏడు రోజుల్లోగా మంత్రి తన పదవి నుంచి తప్పుకోవాలని, లేదంటే దేశవ్యాప్తంగా నిరసనలను ఉధృతం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందురోజు జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో తాము చేపట్టిన శాంతియుత నిరసన ఒక చరిత్ర అని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. 'బొద్దింకలు' ఏకమైతే ఏం చేయగలవో ప్రభుత్వానికి మేం చూపించిన ట్రైలర్ ఇది. నిన్నటి నిరసనలో పాల్గొన్న వారిలో చాలామందికి అదే తొలిసారి. అయినా, విద్యావ్యవస్థపై తమకున్న తీవ్రమైన కోపాన్ని, నిరాశను వ్యక్తం చేయడానికి వారు ధైర్యంగా ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా నిరసనలో పాల్గొన్న యువత, విద్యార్థులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. శాంతియుత నిరసనే మన గొప్ప బలం. ఐక్యంగా ఉన్న శాంతియుత ఉద్యమాన్ని ప్రభుత్వం ఏమీ చేయలేదు. మనం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని దీప్కే అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ ఒక తరానికి అన్యాయం చేశారని ఆరోపించిన ఆయన, ఈ విషయం ఇక్కడితో ముగిసిపోదని స్పష్టంచేశారు. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఈరోజు ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో మాట్లాడతానని ఆయన తన అనుచరులకు సూచించారు.

## విదేశాల్లో కూర్చుని పార్టీలు నడిపించలేరు

### సిజెపిపై బిజెపి చీఫ్ నితిన్ నబిన్ ఘాటు విమర్శలు



రాంచి, జూన్ 7: కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) శనివారం జంతర్ మంతర్‌వద్ద నిరసన కార్యక్ర మాన్ని నిర్వహించింది. నీట్ పేపర్ లీక్‌పై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఘటనపై బిజెపి చీఫ్ నితిన్ నబీన్ స్పందించారు. సిజెపిపై పరోక్ష విమర్శలు చేశారు. భారత్ యువతను డిజిటల్ ప్రచారాలతో తప్పుదారిపట్టించే ప్రయ త్నాలను దేశం సహించదని అన్నారు. విదే శాల్లో కూర్చొని భారత యువతను ఆడించలే రని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జార్ఖండ్‌లోని రాంచీలో పార్టీ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, దేశ యువతను ప్రతికూల రాజకీ యాల వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారత యువత సానుకూల రాజకీ యాలను మాత్రమే విశ్వసిస్తుందని చెప్పారు.

8-6Pg6exHMNWJQE.qxd:8-6Pg6exHMNWJQE.qxd 1/1/02 6:32 AM Page 1



# వ్యాపారలావాదేవీల్లో విభేదాలతో గొడవలు

## ఇరువర్గాలపై కేసులు నమోదు

**తిరుపతి,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** హోటళ్ళ వ్యాపార లావాదేవీల్లో విభేధాలు తలెత్తడంతో రెండు వర్గాలు బాహాబాహీగా గొడవపడ్డాయి. చేతులకు దొరికిన రాడ్లు, గాజుసీసానీళ్ళ బాటిళ్ళతో పరస్పరం దాడులకు దిగారు. ఈ ఉదంతంపై పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను విచారణ చేసి కేసు నమోదు చేశారు. తిరుమలలో అనధికారికంగా వ్యాపారం చేసుకుంటున్న రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు బాలాజీ, దిలీప్, విజయ్ కుమార్, పవన్, శివ కుమార్,లక్ష్మి దేవి, మురుగా, మరోవర్గం తోట దీరజ్ కుమార్, గోగుల శ్రీకాంత్, గోగుల కోటి, శ్రీనివాసులు, చరణ్, సాయి వ్యక్తుల మధ్య పాత, వ్యక్తిగత విభేదాలు ఆధిపత్య పోరు కారణంగా వాగ్వాదం చోటుచేసుకొంది. ఈ ఘటనలో ఇరు వర్గాలకు చెందిన కొందరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న తిరుమల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, ఘర్షణకు పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, ఇరు వర్గాలపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఇరు వర్గాల నుండి అందిన ఫిర్యాదుల మేరకు సంబంధిత నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఇరువర్గాలకు చెందిన వారిని అరెస్టు చేసినట్లు తిరుమల డిఎస్పీ విజయశేఖర్ తెలిపారు. తిరుమలలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఏ వ్యక్తులైనా, వారు ఎంతటి వారైనా చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరించారు. తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ ఆదేశాలతో మీ చుట్టుపక్కల భద్రతాపరమైన ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 112 ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు.



# ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగ ఒక సాధనం

**తిరుపతి,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** యోగా అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరి జీవితంలో నిత్య సాధన కావాలని తిరుపతి సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గ దర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. జూన్ 7వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు అన్ని సచివాలయాలు, మండలాలు, డివిజన్లు జిల్లా స్థాయిలలో విస్తృతంగా యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ సూచనల మేరకు జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కూడా ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఆదివారం ఉదయం ఎస్‌వి జూపార్క్‌లో ఈ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జూన్ 12న చారిత్రాత్మకమైన చంద్రగిరి కోటలో మరో ప్రత్యేక యోగా ఆంధ్ర కార్యక్రమం ఉంటుం దన్నారు. గ్రామ, సచివాలయ, మండల, డివిజన్ జిల్లా స్థాయిలలో ప్రతిరోజూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ కోసం జిల్లాలో సుమారు 200 మంది మాస్టర్ ట్రైనర్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్ గోవిందరావు, డి ఆర్‌ఓ నరసింహులు, హస్తకళల బోర్డుసంస్థ ఛైర్మెన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నంసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరే షన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ మంత్రి పరసారత్నం,రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం, బిజెపి అధికారి ప్రతినిధి జల్లి మధుసూదన్, బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర మంతట పం దుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగా గురువు చెప్పిన విధంగా ఆసనాలను ఆసక్తిగా వింటూ ప్రజలు, అధికారులు, యువత మహిళలు ఆసనాలు వేయడం జరిగింది.





# యోగతో ఆత్మవిశ్వాసం: టిటిడి ఇఒ రవిచంద్ర

**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** యోగ సాధన ద్వారా వ్యక్తి జీవితంలో సమతుల్యత, ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. జూన్ 7 నుంచి 21 వరకు టిటిడి ఉద్యోగులందరూ క్రమం తప్పకుండా యోగ సాధనలో పాల్గొనాలని సూచించారు. యోగాభ్యాసం వల్ల ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందన్నారు. ప్రారంభంలో యోగ కొంత కష్టంగా అనిపించినప్పటికీ, నిరంతర సాధన ద్వారా శరీరం, మనస్సుపై సంపూర్ణ నియంత్రణ సాధించవచ్చని చెప్పారు. యోగతో శారీరక దృఢత్వం, మానసిక వికాసం, అంతర్గత చైతన్యం పెంపొందుతాయని వివరించారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం (జూన్ 21) సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యోగ-టిటిడి ఆరోగ్యానంద' కార్యక్రమాన్ని ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రారంభించారు. మానసిక ఒత్తిడికి యోగానే ఉత్తమ పరిష్కారమని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు.

నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడులు, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి యోగ సాధన అత్యంత అవసరమని అన్నారు. యోగ ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, భావోద్వేగ నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. యోగ అనేది కేవలం ఆరోగ్య సాధన మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక వికాసానికి మార్గదర్శకమని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అన్నారు. జూన్ 20 వరకు యోగా ప్రామాణిక విధానాల ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఉద్యోగి ప్రతిరోజూ ఉదయం జరిగే యోగాభ్యాసంలో పాల్గొనాలని కోరారు. యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 18, 19, 20 తేదీలలో ఉద్యోగులకు యోగ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జూన్ 21న టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు టిటిడి పరిపాలనా భవనం, ఎస్వీ ఆయుర్వేద కళాశాల, స్విమ్స్, బర్డ్, శ్వేత భవనం, ఎస్వీ సంగీత కళాశాల, గోవింద రాజస్వామి ఆలయం తదితర కేంద్రాలలో ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది గంటపాటు యోగా సనాలు నిర్వహించారు.

అనంతరం భారీ ర్యాలీగా మహతి కళాక్షేత్రానికి చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగా మాస్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, వివిధ యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఒ కె.వి. మురళీకృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, హెచ్‌డీపీపీ ఇన్‌చార్జ్ కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, డిప్యూటీ ఇఒలు ఆనందరాజు, గోవిందరాజన్, శివప్రసాద్, సెల్వం, సిఎంఒడాక్టర్ కుసుమకుమారి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి , శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

**తిరుపతి,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం)ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమ వారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి విని యోగదారులు 8977716661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

కాగా డయల్ యువర్ ఎస్పీ డీసీఎల్ తో బాటుసర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుండి నుంచి 9: 30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ" విని యోగదారు లు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది.తిరుపతి:8712652679, ,చిత్తూరు: 7993147979,నెల్లూరు: 08612320427, అన్నమయ్య:9440817449,కడప: 08562242457,కర్నూలు:7382614308, నంద్యాల:7382618976, అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి: 9963707847.

# సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే నాయకత్వం

### భారత్ రష్యా బంధం విడదీయలేనిది

### మాతృభూమి అభివృద్ధి ప్రయాణంలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి

### రష్యా ఇండియన్ డయాస్పోరా సమావేశంలో మంత్రి నారా లోకేష్



ప్రవాస భారతీయ సంఘ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

**విజయవాడ, జూన్ 7.ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వమని, ఏపీ యువతకు అవకాశాలు కల్పించేందుకే తాను రష్యాలో పర్యటిస్తున్నానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రష్యా పర్యటనలో భాగంగా మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ప్రవాస భారతీయులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రష్యాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు, తెలుగు కుటుంబాలు, విద్యార్థులు, నిపుణులు, పారిశ్రామికవేత్తలు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మనల్ని ఒకచోట చేర్చిన మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి నా కృతజ్ఞతలు. మీరు భారతదేశాన్ని విడిచి ఇక్కడకు వచ్చారు..కానీ భారతదేశం మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టదు. స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ మన విలువలు, సంస్కృతి, సాంప్రదాయాలు, దేశం పట్ల ప్రేమను నిరంతరం గుండెల్లో మోస్తున్నారు. మీ విజయాలు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్టను మరింత బలోపేతం చేస్తున్నాయి. అందుకు ప్రతి భారతీయుడు మిమ్మల్ని చూసి గర్విస్తున్నారు. ప్రపంచం మారింది. ప్రపంచ కూటములు రూపాంతరం చెందాయి. అయినప్పటికీ భారత్‌రష్యా స్నేహబంధం పునాది మాత్రం బలంగానే ఉంది. నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ నాయకత్వంలో ఈ సంబంధాలు నూతన సహకార రంగాలు, అభివృద్ధి అవకాశాల వైపు విస్తరిస్తూనే ఉన్నాయి. తాను ఇక్కడికి పర్యాటకుడిగా రాలేదు. స్పష్టమైన లక్ష్యంతో వచ్చా. భాగస్వామ్యాలను నిర్మించడానికి, సంబంధాలను బలోపేతం చేయడానికే ఇక్కడకు వచ్చా. అన్నింటికంటే ముఖ్యంగా.. ఏపీ యువతకు అవకాశాలు కల్పించేందుకు వచ్చాను.

నేడు ఏపీ దేశంలోనే సరికొత్త అభివృద్ధి లక్ష్యాలతో దూసుకుపోతున్న రాష్ట్రాలలో ఒకటిగా నిలిచింది. ప్రతి ఏడాది లక్షలాది మంది యువత మెరుగైన జీవితం నిర్మించుకునేందుకు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వపరంగా పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలను, స్థాపించడం, ఉపాధిని సృష్టించడం, జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, ప్రతి యువకుడు విజయవంతం కావడానికి తగిన అవకాశం ఉండేలా కృషిచేస్తున్నాం.

డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ శక్తిని చంద్రబాబు ముందే గ్రహించారు. ఇన్నోవేషన్ అనేది ట్రెండ్ కాకముందే టెక్నాలజీ ఎకో సిస్టమ్ నిర్మించేందుకు కృషిచేశారు. పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉత్పాదకత, సాంకేతికత, స్థిరమైన వృద్ధికి ఏపీని గ్లోబల్ డెస్టినేషన్ గా మార్చేందుకు ఈ రోజు మళ్లీ దృష్టిసారించారు.

గత రెండేళ్లలో ఏపీ దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానాలలో ఒకటిగా నిలిచింది. రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, డేటా సెంటర్స్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. స్థిరత్వం, మౌలిక వసతులు, అనుసంధానం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రగతిశీల విధానాలు, అమలుకు కట్టుబడిన రాష్ట్రంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు.. పెట్టుబడులను ఉపాధిగా మార్చడమే మా లక్ష్యం. ఏపీతో భాగస్వాములు కావాలని, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని రష్యాలోని భారతీయ సమాజానికి, రష్యన్ భాగస్వాములకు వ్యక్తిగతంగా ఆహ్వానం పలుకుతున్నాను. మీ మాతృభూమి అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావడానికి ఇదే సరైన సమయమన్నారు.

### ప్రవాసాంధ్రులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి

కష్టాన్ని నమ్ముకున్న తెలుగువారు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా గౌరవం దక్కు తుంది. ఏ దేశంలో ఉన్నా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోరు. మీ మనస్సు రాష్ట్రం మీదే ఉంటుంది. మీకు ఏ సమస్య ఉన్నా ఏపీ ఎన్ఆర్టీ అండగా ఉంటుంది. మీ బాధ్యత నాది. తెలుగు కుటుంబాలను చూసినప్పుడు నాకు గర్వంగా ఉంటుంది. మీరంతా ఎంతో సాధించారు. ఇప్పుడు సొంత రాష్ట్ర అభివృద్ధిలో భాగం అవ్వండి. మీరంతా బ్రాండ్ అంబాసిడర్లుగా మారి ఏపీని ప్రమోట్ చేయండి. ఒక్క పెట్టుబడి... ఒక్క పరిశ్రమ తీసుకురండి... యువతకు ఉద్యోగాలు కల్పించడంలో మీరు భాగస్వామ్యం అవ్వండి అని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇండియన్ అంబాసిడర్ ఇన్ మాస్కో వినయ్ కుమార్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

# ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

### ఎమ్మెల్యే నొక్కేసిన రూ.100కోట్లు ఇస్తే ఆయన కాళ్లు కడుగుతా

### ఎమ్మెల్యేకి సవాల్ విసిరిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



**కావలి (నెల్లూరు), జూన్ 7, ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నాపై మోపిన నిందారోపణలను నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటానని కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. కావలి వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కావలి ఎమ్మెల్యే అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆయన చేసిన అనేక గ్రావెల్ దందాలను అమృత పథకంకు సంబంధించిన కాంట్రాక్టర్ సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలక్రిష్ణలతో ఉండేది ఎల్ఈడి స్క్రీన్‌లో చూపించడం జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు నేను అమృతపథకం నిధులు రూ.14కోట్లు మింగేశానని నిందలు చేశారని ప్రస్తుతం వాళ్ళ ప్రభుత్వం అధికారంలో ఉందని దమ్ము ధైర్యం ఉంటే ఆ నిధులపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయించాలన్నారు. ప్రభుత్వం వచ్చి రెండేళ్ళు అవుతున్నా ఇప్పటి వరకు ఆ కాంట్రాక్టర్‌ను ఏమి చేయలేక నీకు తెలియకుండా మీ పార్టీ నాయకులే విజిలెన్స్ విచారణ వేయిస్తే అధికారులను, మీ నేతలను పంపించి ఎందుకు అడ్డుకుంటున్నావు అని అన్నారు. కావలిలో ఎమ్మెల్యే చేసిన ఒక్క మంచిపని చేయలేదని మహిళలు వద్దన్నచోట బార్లు ఏర్పాటు చేయడం దంపుడు మాటలు, అబద్దపు వాగ్దానాలు అని మండిపడ్డారు. ముసునూరు మనీ స్కామ్‌లో రూ.100కోట్లు అవినీతికి పాల్పడింది ఎమ్మెల్యే అని ఆయన ఆరోపించారు. ఈ రూ.100కోట్లు దోపిడి సొమ్మును ప్రజలకు తిరిగి ఇచ్చేస్తే కావలి యానదిరెడ్డి విగ్రహం సాక్షిగా కాళ్ళు కడుగుతా అని అన్నారు. మా వైసిపి ప్రభుత్వంలో 126 ఎకరాలు కబ్జా అయ్యాయని అంటున్నావు అని ఇందులో కనీసం 50 ఎకరాలనైనా ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయారన్నారు. ఆ కబ్జారాయుళ్ళు నీకు కప్పం కట్టి నీ చుట్టూనే తిరుగుతున్నారని ఒకవేళ ఆ భూమిని స్వాదీనం చేసుకున్నా నీ కాళ్ళు కడిగేందుకు నేను సిద్ధం అని సవాల్ చేశారు. ఎమ్మెల్యే వచ్చిన ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో రౌడీయిజం పెరిగిపోయిందని విమర్శింఆరు. ఒక సామాజిక వర్గానికి చెందిన నేతను బెదిరించారని, మరో సీనియర్ నేతను బూతులు తిట్టారని ధ్వజమెత్తారు. పాపం టిడిపి కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ సుబ్బానాయుడును ఏకంగా కాటికే పంపించావు అని ఆరోపించారు. పేపర్ల వారి పాలెంకి తాగేందుకు నీటిని అడిగితే టిడిపి కార్యకర్తను చెంప చెల్లుమనిపించావు అని అన్నారు. మాటలు ఎక్కువ పని తక్కువ అని సాక్షాత్తూ సిఎం చంద్రబాబునాయుడు చెప్పినా నీకు బుద్ది రాలేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షం ఆరోపణలకు అధికారపార్టీ కూటమి నేతలు స్పందించ చాలి అలా కాకుండా పెయిడ్ బ్యాచ్ స్పందించడం విడ్డూరం అని అన్నారు. జువ్వలదిన్నె బోట్ల వ్యవహారంలో మత్స్యకారులను అడ్డుపెటుకొని బీద సోదరులపై ఎమ్మెల్యే కుట్రలు పన్నారని ఆ రికార్డులన్నీ బీద మస్తాన్‌రావు వద్దకు చేరాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ కుట్రలన్నీ బయటపడుతాయన్నారు. నీ దోపిడీలు దుర్మార్గాలు బయటపడతాయనే భయంతోనే నాపై తప్పుడు మర్డర్ కేసులు పెట్టించావు అని అన్నారు. ఎమ్మెల్యే రెండున్నర సంవత్సరానికి మాత్రం ఎమ్మెల్యే అని అదికూడా సంగం నియోజకవర్గానికి మాత్రమేనని అల్లారు, దగదర్తి మండలాలకు వెళ్ళే పరిస్థితి లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో పొరపాటున నీకు మళ్ళీ టికెట్ వస్తే నేను 60వేల ఓట్ల భారీ మెజారీతో గెలవడం తథ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బధిర మహిళల రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

**విజయవాడ, జూన్ 7, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఆఫ్ డెఫ్ ఉమన్ (బధిర మహిళ) రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారంవిజయవాడ బందరురోడ్‌లోని ఠాగూర్ గ్రంధాలయంలో డిల్లీ నుండి వచ్చిన ప్రతినిధులు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా పి.యు.ఉషాభాస్కర్, ఉపాధ్యక్షులుగా ధరణికు మారి, ప్రధానకార్యదర్శిగా షేక్ చోటి, ప్రోగ్రాం కార్యదర్శిగా వై.రాజ్యలక్ష్మిలతోపాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు హాజరై కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. బధిర మహిళల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఈసందర్భంగా కోటేశ్వరావు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రంధాలయ అధికారి కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్నికలకు గ్రందాలయంలోని హాలును ఇవ్వటంతో పాటు భోజన వసతి కల్పించిన కృష్ణాజిల్లా గ్రంధాలయసంస్థ ఛైర్మన్ యం. యస్.బేగ్‌కు బధిర మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

# మూడేళ్ల చిన్నారి అదృశ్యం

### విస్తృతంగా పోలీస్ గాలింపు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 7, ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన బాలిక అదృశ్య సంఘటన కలకలం రేపుతుంది. అగ్రహారం గ్రామానికి చెందిన సుంకర జాను (3) శనివారం మధ్యాహ్నం తల్లిదండ్రులు పనిచేస్తున్న సమయంలో ఆడుకుంటూ పెంపుడు కుక్కతో పాటు అదృశ్యం అయింది. ఈ సంఘటనతో చిన్నారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు తోటను ఆనుకుని ఉన్న కొండలు, అటవీ ప్రాంతంలో బాలిక ఆచూకీ కోసం గ్రామస్తులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవరావు ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి




సిబ్బందితో ముమ్మరంగా బాలిక ఆచూకీ కోసం గాలింపు చేపడుతున్నారు. డ్రోన్లు, డాగ్ స్క్వాడ్ బృందాలతో నిరంతరాయంగా గాలిస్తున్నప్పటికీ చిన్నారి ఆచూకీ లభించకపోవడంతో చిన్నారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య పాప ఆచూకీ దొరకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పోలీస్ బృందాలు పాప ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి.

# పెద్దిరెడ్డిపల్లిలో పిడుగుపాటు

### మేకల కాపరి మృతి

**వరికుంటపాడు (నెల్లూరు), జూన్ 7, ప్రభాతవార్త :** వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం అకాల వర్షంతో కూడిన పిడుగుపాటు ఘటనలో మేకల కాపరి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామానికి చెందిన అరవ రమణయ్య (40) మేకలను మేపేందుకు పొలాలకు వెళ్లిన సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిఈదురు



రమణయ్య(ఫైల్)

గాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. రమణయ్య గ్రామ శివారులోని ఖాళీ ప్రదేశంలో మేకలను మేపుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు పడింది. ఆ పిడుగు రమణయ్యపై పడటంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. దూరంలో ఉన్న మరికొందరు కాపరులు గమనించి కేకలు వేసినా ఫలితం లేకపోయింది. మేకల కాపరిగా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రమణయ్య ఆకస్మిక మృతితో భార్య, ఇద్దరు పిల్లలు దిక్కు తోచని స్థితిలో పడ్డారు. రమణయ్య మృతదేహాన్ని చూసికుటుంబ సభ్యులు గ్రామస్థులు బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఉద్యోగుల బకాయిలు చెల్లించండి

### ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగులకు చెల్లించాల్సి వివిధ రకాల బకాయిలు,ఇతర ఆర్థిక అంశాలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఏపీఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు.పీఆర్‌సీ,ఐఆర్‌లపై ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. విజయవాడలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్రకార్యవర్గం సమావేశం ఏపీఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన భేటీ అయింది. మొత్తం 28 జిల్లాల ప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పీఆర్‌సీ నియామకం, ఐఆర్ ప్రకటన అంశాలతో పాటు ఉద్యోగ సమస్యలపై పలువురు చర్చించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఐఆర్, పీఆర్‌సీ ప్రకటించాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను ఉద్యమానికి సిద్ధం చేయాలని నిర్ణయించామని బొప్పరాజు స్పష్టం చేశారు. 13 మందితో వేసిన కమిటీ రేపటి నుంచి పనిచేస్తుందని వివరించారు. వివిధ సంఘాల నాయకులు కలిసివస్తారని కోరుకుంటున్నామని బొప్పరాజు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్టీసీ భవిష్యత్తుపై రేపు సమావేశమవుతామని ఐకాస అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు.



# రేపు గవర్నర్ నెల్లూరు జిల్లాకు రాక

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెలూరు-కలెక్టరేట్, జూన్ 7, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జూన్ 9వ తేదీన (మంగళవారం) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 9వ తేదీ ఉదయం 9.35 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి, ఉదయం 10.50 గంటలకు నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అనంతరం ఉదయం 11.00 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి, ఉదయం 11.15 గంటలకు గోలగమూడి రోడ్డులోని కనుపర్తిపాడు వద్ద ఉన్న వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 12.40 గంటల వరకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10, 11, 12వ స్నాతకోత్సవ (కాన్వొకేషన్) కార్యక్రమంలో పాల్గొంటారు.

కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్ నుండి బయలుదేరి, మధ్యాహ్నం 1.05 గంటలకు నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్‌కు చేరుకుని, మధ్యాహ్నం 1.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి మధ్యాహ్నం 2.00 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు తాజ్ తిరుపతికి చేరుకుని బస చేస్తారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



# నేడు డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

విశాఖపట్నం, జూన్ 7, ప్రభాతవార్త :

ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ కార్యక్రమం విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30గంటల వరకు నిర్వహించబడుతుంది. సంస్థ పరిధి లోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు 8688400499 ఫోన్ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియ జేయవచ్చు. విద్యుత్ సరఫరా అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, సరఫరా పునరుద్ధరణలో ఆలస్యం, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి, రూఫ్‌టాప్ సోలార్ వంటి వివిధ సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకురావచ్చు. ఈ అవకాశాన్ని సంస్థ పరిధిలోని 11 జిల్లాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న టీడీపీ రాజ్యసభ అభ్యర్థి చింతకాయల విజయ్


8లో



తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన చింతకాయల విజయ్‌ని విజయవాడలోని వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ యువనాయకులు, శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ. ఈ సందర్భంగా కర్రి సాయికృష్ణ మాట్లాడుతూ పార్టీకి విశేష సేవలు అందించిన చింతకాయల విజయ్‌కి రాజ్యసభ అభ్యర్థిత్వం లభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. (విశాఖపట్నం-ప్రభాతవార్త)

# నర్సీపట్నంలో మిన్నంటిన టీడీపీ శ్రేణుల సంబరాలు



**చింతకాయల విజయ్‌కు రాజ్యసభ ఎంపీ స్థానం దక్కడం పట్ల హర్షం**





విశాఖపట్నం-ప్రభాతవార్త

నర్సీపట్నంలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఉత్సాహం మిన్నంటింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ కు రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం నర్సీపట్నంలో భారీ ఎత్తున సంబరాలు జరిగాయి. పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకల్లో అత్యుత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాసం వద్ద నుండి భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నలుమూలల నుండి తరలివచ్చిన వందలాది మంది యువకులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాత మున్సిపల్ ఆఫీస్, పోలీస్ స్టేషన్, కృష్ణ బజార్, అబీద్ సెంటర్, శ్రీకన్య సెంటర్ మీదుగా బొడ్డేపల్లి వరకు ఈ ర్యాలీ కోలాహలంగా సాగింది. దారిపొడవునా టపాసులు కాల్చుతూ, డ్యాన్సులు వేస్తూ కార్యకర్తలు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. మండుతున్న ఎండను సైతం ఏమాత్రం లెక్కచేయకుండా వందలాది బైక్‌లతో ఈ ర్యాలీని అట్టహాసంగా నిర్వహించారు. ర్యాలీ ముగిసిన అనంతరం బొడ్డేపల్లి సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ రమణమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, లాలం మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆదిలక్ష్మి తదితరులు ప్రసంగించారు. పార్టీకి చేసిన విశేష సేవలను అధిష్టానం గుర్తించిందని, ఇన్ని సంవత్సరాల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని వారు హర్షం వ్యక్తం చేశారు. పార్టీనే పరమావధిగా నమ్ముకున్నందుకు భగవంతుని ఆశీస్సులతో ఈ సత్ఫలితం దక్కిందని పేర్కొన్నారు. యువ నాయకుడు చింతకాయల విజయ్‌కు ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకు ఈ సందర్భంగా వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# స్వర్గీయ పల్లా సింహాచలం స్ఫూర్తితోనే ప్రజాసేవ

గాజువాక, జూన్ 7, ప్రభాతవార్త

సర్పంచిగా, కార్మిక నాయకుడిగా, శాసనసభ్యుడిగా తాను నమ్ముకున్న సిద్ధాంతాలకు రాజీపడకుండా ప్రజల పక్షాన నిలిచి, వారి హృదయాల్లో కీ.శే. పల్లా సింహాచలం చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్నా రని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితోనే తాము నీతి, నిజాయితీలతో కూడిన ప్రజాసేవ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఆదివారం పల్లా సింహాచలం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెదేపా నియోజకవర్గ సమన్వయ కర్త, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పల్లా శ్రీనివాసరావు, ఆయన సోదరుడు పల్లా శంకర్రావు 8వ పేజీలో



**తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు -అకాల మరణం చెందిన 200 మంది కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం - స్వర్గీయ పల్లా సింహాచలం సంస్మరణ సభలో సొంత నిధుల పంపిణీ**

# కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ధర్మకర్తల మండలి కార్యాలయానికి శ్రీకారం**



విశాఖపట్నం, జూన్ 7, ప్రభాతవార్త

విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం బురుజుపేటలో వున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నాగరాజుతో పాటు సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ధర్మకర్తల మండలి కృషి చేయాలని సూచించారు. కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం విశాఖ నగర ఆధ్యాత్మిక చిహ్నంగా నిలిచిందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనకు అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన చోరీ కేసులో పురోగతి సాధించిన పోలీసులు



**అభినందనలు వెల్లువ**

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి జరిగిన హుండీల చోరీ కేసులో పోలీసులు మూడు రోజులు వ్యవధి లోనే పురోగతిని సాధించారు. గత మూడు రోజుల నుంచి జిల్లాతో పాటు నియోజకవర్గంలోనే పెద్ద చర్చనీయాంశం అవుతున్న ఈ చోరీ కేసు పోలీసులు వేగవంతంగా నిందితులను పట్టుకుని పనిలో పురోగతి సాధించడంతో విషయం తెలుసుకున్న ప్రజలు పోలీసులను అభినందిస్తున్నారు. ఈ చోరీ కేసులోసీసీ పుటేజీల ఆధారంగా నిందితులను జిల్లా ఎస్పీ ఆదేశాల నాయకులు డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్ సారథ్యంలో సీఐ జూరెడ్డి మురళి పర్యవేక్షణ ఎస్సైలు, ఈ కేసు కోసం ఏర్పాటుచేసిన పోలీస్ బృందాలు అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేసి గుర్తించారు. దీంతో మిస్టరీగా మారిన ఈ కేసు కొలిక్కివచ్చినట్టేనని అందరూ భావిస్తున్నారు. పోలీసులు అధికారికంగా వివరాలు ప్రకటించకపోయినప్పటికీ మండలంలో ఇదే విషయం చర్చనీయాంశమైంది. అందరూ బాహాటంగానే నిందితులు గురించి చర్చించుకుంటున్నారు. ఉపమాక వెంకన్న ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితులు ఇదే మండలం రేబాక పంచాయతీకి చెందిన ఇద్దరు యువకులుగా పోలీసులు నిర్ధారించారు. మొబైల్ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి, గ్రామంలో లేకుండా తప్పించుకున్న ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి దొంగతనం చేసేందుకు ఎలా వచ్చారు? ఎలా వెళ్లారు? హుండీల్లో లభించిన సొమ్ములో ఎంత ఖర్చు చేశారు? తదితర వివరాలు, సీన్ వెరిఫికేషన్ వంటి అంశాలను పోలీసులు పరిశీలించారు. ఆదివారం ఉదయం నిందితులను పోలీస్ అధికారులు రేబాక గ్రామానికి తీసుకురావడంతో ఆ ప్రాంతంలో అందరికీ ఈ చోరీకి సంబంధించిన నిందితుల వివరాలు తెలిసిపోయింది. నాలుగురో జుల్లో ఈ దొంగతనం కేసు మిస్టరీని పోలీసులు సాధించగలిగారు. సోమవారం నిందితులను అరెస్ట్ చేసి ఎస్పీ తుహిన్ సిన్హా, లేదా డీఎ స్పీ సమక్షంలో పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడిస్తారని తెలిసింది. ఉపమాక ఆలయంలో దొంగతనం కేసు ఛేధించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక బృందాలను నియమించిన విషయం తెలిసిందే.! ఈ విషయమై హోంమంత్రి అనితకు కూడా సమాచారం అందజేశారు. ఇప్పటికే రాష్ట్ర హోం మంత్రి ఎస్.రాయవరం మండలం వేమగిరి పర్యటనలో ఉంటున్న సమయంలో విషయం తెలియడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసు విషయంలో జిల్లా పోలీస్ అధికారులు, స్థానిక సర్కిల్ సీఐ తో పాటు ఏర్పాటుచేసిన బృందాలతో పాటు రాష్ట్ర హోం 8వ పేజీలో

# 'ఆడారి తులసిరావు'కు ఘన నివాళి



నక్కపల్లి/ ఎస్.రాయవరం, ప్రభాతవార్త

పాడి రైతుల ఆశాజ్యోతి స్వర్గీయ ఆడారి తులసిరావు చిత్రపటానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్. రాయవరం మండలం వేమగిరి గ్రామంలో డైరీ నిధులతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన సందర్భంగా చైర్మన్ అడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పిల్లా రమా కుమారి, డైరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ ల నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడున్న చిన్నారులతో హోంమంత్రి అనిత ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులతో పాటు టిడిపి మండల శాఖ అధ్యక్షులు అమల కంటి అబద్ధం, పార్టీ నాయకులు నల్లల వెంకటరాజు, నాగేశ్వరరావు డైరీ సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్వాసితులకు 50శాతం ఉద్యోగాలివ్వాలి



గాజువాక,జూన్ 6,ప్రభాతవార్త :

వడ్లపూడి రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ నిర్వాసితులకు 50 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏపీఐఐసీ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.కె. సేనాపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి ఇల్లపు రాము మాట్లాడుతూ.. వినతిపై సీపీఎం సానుకూలంగా స్పందించారని, నెల రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక స్థానికులకు ఉపాధి దక్కేలా కాంట్రాక్టర్లకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పురోగతిని సమీక్షించేందుకు 15 రోజుల తర్వాత మళ్లీ కలవాలని కోరారన్నారు. ఈ నెల 8న కలెక్టర్, డీఆర్ఎంలకు, వచ్చే వారంలో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తామని భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. 15 రోజుల్లోగా 50 శాతం ఉద్యోగాల కోటా అమలు కాకుంటే వడ్లపూడి, ఫకీర్ తక్యా, యాదవ్ జగ్గరాజుపేట, తుంగ్లా గ్రామస్థులతో కలిసి ఉమ్మడి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి. ఎల్లజీ రావు, గొలగాని సన్యాసిరావు, ఈగల అప్పారావు, ఎం.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కేజీహెచ్ పిల్లలు వైద్య విభాగంలో రెండు హెల్త్ డిజిటల్ యాప్‌ల ఆవిష్కరణ

## జాతీయ పూరక దినం సందర్భంగా యాప్‌లను ప్రారంభించిన కెజిహెచ్, ఎఎంసీ చీఫ్‌లు డాక్టర్ వాణి, సంధ్యాదేవి




విశాఖపట్నం జూన్ 6, ప్రభాతవార్త

జాతీయ పూరక దినం (నేషనల్ కంప్లిమెంటరీ ఫీడింగ్ డే) జూన్ 6 సందర్భం గా ఫస్టుఫుడ్స్, ఫీడ్ స్మార్ట్ కేజీహెచ్ డిజిటల్ యాప్‌లను శనివారం పిల్లలు వైద్య విభాగంలో కెజిహెచ్ సూపరిండెంటెంట్ డా.ఐ.వాణి ఏఎంసీ ప్రిన్సిపాల్ డా.సంధ్యాదేవి లు ఆవిష్కరించారు. పిల్లల ఆరోగ్యం, పూరక ఆహారంపై తల్లిదం డ్రులకు అవగాహన పెంచేందుకు ఆసుపత్రి పిల్లలు వైద్య విభాగా ధిపతి డా.బీఎస్.చక్రవర్తి రూపొందించిన ఈ రెండు ఆరోగ్య సాధనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా డా.ఐ.వాణి మాట్లాడుతూ పిల్లలలో సరైన పూరక ఆహారం ఆరోగ్య కరమైన పెరుగుదల, మెదడు అభివృద్ధి, భవిష్యత్ ఆరోగ్యానికి చాలా ముఖ్యమని తెలిపారు. ఆరు నెలల తర్వాత పిల్లలకు ఏ ఆహారం ప్రారంభించాలి, ఎంత ఇవ్వాలి, ఎంత తరచుగా ఇవ్వాలి, ఆహార వైవిధ్యం ఎలా ఉండాలి అనే విషయాల్లో తల్లిదండ్రులకు స్పష్టమైన మార్గదర్శకత్వం అవసరమని అన్నారు. ఫస్టుఫుడ్స్ కేజీహెచ్ యాప్ తల్లిదండ్రులకు 6 నెలల తర్వాత పిల్లలకు పూరక ఆహారం ప్రారంభించే విధానం, వయస్సు వారీ ఆహార సూచనలు, ప్రేమతో తినిపించే పద్ధతి, అలెర్జీ ఆహారాల పరిచయం, నీటి వినియోగం, అనారోగ్య సమయంలో ఆహారం, ప్రమాద సంకేతాలపై సులభమైన తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో మార్గదర్శకత్వం అందిస్తుందని తెలిపారు. ఫీడ్ స్మార్ట్ కేజీహెచ్ యాప్ 6-24 నెలల పిల్లల కోసం వ్యక్తిగత పూరక ఆహార మార్గదర్శిగా పనిచేస్తుందని, వయస్సుకు తగిన ఆహార సూచనలు, ఫుడ్ డైవర్సిటీ స్కోర్,, అలెర్జీ సూచనలు, అనారోగ్య సమయంలో ఆహార మార్గదర్శకత్వం, వాట్సాప్ /కాపీ /సేవ్ / ప్రింట్ నివేదికల సౌకర్యం కలిగి ఉందని వివరించారు. ప్రిన్సిపాల్ డా,కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి మాట్లాడుతూ ఈ యాప్‌లు వైద్యుడు రోగి మధ్య అవగాహనకు ఒక మంచి వారధిగా పనిచేస్తాయని, తల్లిదండ్రులు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఆశా, అంగన్వాడీ సిబ్బంది మాత్రమే కాకుండా వైద్య విద్యార్థులకు కూడా ఇవి ఉపయోగకరంగా ఉంటాయని అభినందించారు. పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా.బి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ ఈ యాప్‌లు నిర్ధారణ కోసం కాకుండా స్క్రీనింగ్, అవగాహన కోసం రూపొందించబడినవని తెలిపారు. పిల్లలలో పోషకాహార లోపాలు, సరైన ఆహారపు అలవాట్ల లోపం, ప్రమాద సంకేతాలు వంటి అంశాలను ముందుగానే గుర్తించి, సరైన సమయంలో శిశు వైద్యుడిని సంప్రదించేందుకు ఇవి సహాయపడతాయని చెప్పారు. ఈ యాప్‌లు యూజర్-ఫ్రెండ్లీగా, తెలుగు ఇంగ్లీష్ భాషల్లో రూపొందించబడ్డాయని, వినియోగదారుల డేటా, ప్రైవసీ పూర్తిగా సురక్షితంగా ఉండే విధంగా రూపొందించామని తెలిపారు. తల్లిదండ్రులు, ఆరోగ్య సేవాదారులను సరైన అవగాహనతో శక్తివంతం చేయడం ఈ యాప్‌ల ప్రధాన లక్ష్యమని వివరించారు. పిల్లల పోషణ పెంపకాలలో ఎంతో కీలక పాత్ర పోషించే రెండు ఆరోగ్య సాదనాలు (యాప్)ల రూపకర్త డాక్టర్ బీఎస్. చక్రవర్తిని ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డా.వాణి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సంధ్యదేవిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ సత్యకుమారి, డాక్టర్ సత్యవాణి, డాక్టర్ సందీప్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు, స్టాఫ్ నర్సులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

గాజువాక,జూన్ 7,ప్రభాతవార్త



నేటి యువత సెల్‌ఫోన్లకే పరిమితం కాకుండా క్రీడలపై దృష్టి సారించాలని అంతర్జాతీయ క్రీడాకారిణి అండిబోయిన లక్ష్మి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 75వ వార్డు నడుపూరు హైస్కూల్‌లో నెల రోజులుగా నిర్వహించిన కర్రసాము, కత్తిసాము, టైక్వాండో సమ్మర్ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వారి చేతుల మీదుగా టీ షర్టు, ప్రోటీన్ ఫుడ్ పంపిణీ చేశారు. అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ మరుగున పడుతున్న ప్రాచీన సమర కళలను నేర్చుకోవడం వల్ల పిల్లల్లో ఆత్మరక్షణ సామర్థ్యం పెరుగుతుందని, మానసిక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉరుకుటి చందు, అండిబోయిన అప్పారావు, పులి రమణారెడ్డి, కిల్లాడి ముసలయ్య, కోచ్‌లు రాజు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## 'వెన్నుపోటు రెండుళ్లు' టౌన్‌హాల్ సమావేశం -వైకాపా గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి




గాజువాక,జూన్ 7,ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను దళిత వర్గాల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైకాపా గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పెద్ద గంట్యాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన ఎస్సీ సెల్ ముఖ్య నాయకులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 9 గంటలకు బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ (మేయర్) కళ్యాణమండపంలో నిర్వహించనున్న 'వెన్నుపోటు రెండుళ్లు' టౌన్‌హాల్ మీటింగ్‌ను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విశాఖ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కాకినాడ పెంటారావును దేవన్‌రెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులు, ఎస్సీ మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్ బాబు పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. గాజువాక నుంచి మార్డుపూడి పరదేశి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాకినాడ పెంటారావు, గంట్యాడ గురుమూర్తి, గంట్యాడ గోవిందరాజు, గొందేశి శ్రీనివాసరెడ్డి, గంట్యాడ పెదరాజు, గొందేశి వెంకటరమణారెడ్డి, పిట్టా రెడ్డి, మార్డుపూడి రాములు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను విస్తరించాలి

ఆనందపురం, జూన్ 7, ప్రభాతవార్త




గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు చెప్పారు. మండలంలోని గొట్టిపల్లిలో ఉన్న శ్రీ సత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరం 9వ వార్షికోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, రుద్రాభిషేకం, పల్లకి సేవ, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు మాట్లాడుతూ గొట్టిపల్లి శ్రీ సత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరం గత తొమ్మిదేళ్లుగా ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోందన్నారు. మందిరం ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాల్లో చేపట్టిన సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని, భజన మండలిగా ఉన్న గొట్టిపల్లి సమితి పరిధిలోని ఆనందపురం, చందక, వెంకటాపురం, ఏనుగులపాలెం ప్రాంతాల్లో ఇకపై మరింత విస్తృతంగా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించి శ్రీ సత్యసాయి బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఉదయం సమితి ఆధ్యాత్మిక కో-ఆర్డినేటర్ వి. కృష్ణమూర్తి రాజు ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించగా, సమితి కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు దంపతులు, భజన మండలి కన్వీనర్ డి.పి. రాజు దంపతులు శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ కో-ఆర్డినేటర్ ఆర్.ఏ. నాయుడు, సిటీ సమితి కన్వీనర్ సాయికుమార్, జిల్లా గ్రామ సేవల కోఆర్డినేటర్ అప్పారావు, విశాఖపట్నం జోన్ కోఆర్డినేటర్ ఎం.వి.ఎస్. సాయికుమార్, సమితి కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, యూత్ జాయింట్ కో-ఆర్డినేటర్ డబ్బీరు శరత్ కుమార్, బాల వికాస్ కో-ఆర్డినేటర్ డి.వి. సంతోష్ కిరణ్, సేవాదళ్ కో-ఆర్డినేటర్ బి.సత్యం, ఇతర కో-ఆర్డినేటర్లు డి. భరత్, డి. కార్తిక్, కె. ఆచారి, మణికంఠ, మహిళా కో-ఆర్డినేటర్లు, సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌కు దూరం.. ప్రకృతికి దగ్గర!

## మాంసం కొనుగోళ్లకు స్టీల్ బాక్స్ వాడదాం -పర్యావరణ పరిరక్షణకు గొంప సాహితి పిలుపు

గాజువాక,జూన్ 7,ప్రభాతవార్త




సాధారణంగా ఆదివారం వచ్చిందంటే చికెన్, మటన్ కొనుగోలు చేయడానికి ప్రతి ఒక్కరూ మార్కెట్‌కు వెళ్తుంటారు. అయితే అలా వెళ్లేటప్పుడు మన వెంట ఒక స్టీల్ బాక్స్ తీసుకెళ్లే అలవాటు చేసుకోవాలని పర్యావరణ ప్రేమికురాలు గొంప సాహితి పిలుపునిచ్చారు. ఇలా చేయడం వల్ల నిత్యం టన్నుల కొద్దీ పేరుకుపోతున్న ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని మనం చాలా వరకు తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్లాస్టిక్ అనేది ప్రకృతికి, జంతువులకు,మన ఆరోగ్యానికి ఎంతో హానికరమని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఇంట్లోని చిన్న చిన్న అలవాట్లతోనే సమాజంలో పెద్ద మార్పు తీసుకురాగలమని, మనం ఈ రోజు నుంచి ఒక స్టీల్ బాక్స్ తీసుకెళ్లడం ప్రారంభిస్తే.. రేపటి తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమని స్పష్టం చేశారు. "ప్లాస్టిక్‌కు దూరం... ప్రకృతికి దగ్గర" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

# పల్లా సింహాచలం సేవలు చిరస్మరణీయం

## గాజువాక జంక్షన్‌లో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి-ఘనంగా మాజీ ఎమ్మెల్యే ప్రథమ వర్ధంతి వేడుకలు -తెదేపా రాష్ట్ర పరిశీలకులు పప్పు రాజారావు



గాజువాక,జూన్ 7,ప్రభాతవార్త

ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు, మాజీ శాసనసభ్యుడు కీ.శే. పల్లా సింహాచలం అని తెదేపా రాష్ట్ర పరిశీలకులు, రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు కొనియాడారు. పల్లా సింహాచలం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం గాజువాక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పప్పు రాజారావు మాట్లాడుతూ.. ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన పల్లా సింహాచలం సేవలు, విలువలు, ఆదర్శాలు ఎల్లప్పుడూ నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ప్రజాపక్షాన ఆయన అందించిన సేవలకు గుర్తుగా గాజువాక జంక్షన్‌తో పాటు విశాఖ జిల్లాలోని ప్రముఖ కేంద్రాల్లో స్వర్గీయ పల్లా సింహాచలం కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ.. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు వానపల్లి జగ్గారావు, 71వ వార్డు తెదేపా ఉపాధ్యక్షుడు నక్కా రాజారావు, పేతకంశెట్టి జగన్, దొడ్డి వెంకట అప్పారావుతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

# ఇష్టాలు..నైపుణ్యాల ఆధారంగానే కెరీర్ ఎంపిక

## -ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి

గాజువాక,జూన్ 7,ప్రభాతవార్త



యువత తమ కెరీర్‌ను ఎంపిక చేసుకునే టప్పుడు వ్యక్తిగత ఇష్టాలకు, నైపుణ్యాలకు, మార్కెట్ డిమాండ్‌తో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితికి ప్రాధాన్యత ఇవ్వాలని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి సూచించారు. వి.మాడుగుల విలియం మేయర్ డెవలప్‌మెంట్ సొసైటీలో సెయింట్ ఆన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కెరీర్ కౌన్సిలింగ్ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కెరీర్ అంటే కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాదని, ఒక రంగంలో సంపాదించే అనుభవం, పేరు ప్రఖ్యాతులే నిజమైన విజయమని పేర్కొన్నారు. ప్రజల ప్రగతిపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్న ఆమె.. పదో తరగతి, ఇంటర్ తర్వాత ఉన్నత విద్యా, ఉపాధి అవకాశాలను వివరించారు. వి మాడుగులో విలియం మేయర్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ సిస్టర్ సాజిత అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో యువత, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# భగవన్నామస్మరణతో ఆధ్యాత్మిక చైతన్యం



విశాఖపట్నం జూన్ 7 ప్రభాతవార్త

మహానగర విశాఖ పరిధిలో గల రాజీవ్ నగర్ శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ వారి ఆధ్వర్యంలో అధిక జేష్ట మాసం (పురుషోత్తమ మాసం) సందర్భంగా ప్రత్యేక సంకీర్తన ఆధ్యాత్మిక ప్రసంగం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.కుసుమ, పి.సూర్యకుమారి, కె.జ్యోతి, కె.నాగేశ్వరరావు పెండ్యాల సీతారామయ్య రచించిన శ్రీ కుసుమహరనాథ సంకీర్తనలు మధురంగా గానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ పాల్గొన్న భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ భగవన్నామ సంకీర్తనతోనే ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు . వచ్చేనెల జూలై 5వ తేదీన ఆశ్రమంలో నిర్వహించే శ్రీ హరనాధుని జయంతిలో భక్తులందరూ పాల్గొని స్వామివారి కటాక్షాన్ని, ప్రేమ మయి కుసుమకుమారి దేవి అనుగ్రహాన్ని పొందాలని కోరారు. వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు బివి బాబాజీ, కార్యదర్శి ఆర్విఎస్ రమేష్, కోశాధికారి ఎస్ అన్నాజీరావు, సంయుక్త కోశాధికారి కే మంగరాజు ఆశ్రమ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదము వితరణ చేయడం జరిగింది.

# మునగపాకలో యూరియా కొరత లేదు : కూటమి నాయకులు

విశాఖపట్నం-ప్రభాతవార్త



మునగపాకలో యూరియా కొరత ఉందని రైతుల ద్వారా సమాచారం అందుకున్న టీడీపీ యువ నాయకులు కర్రి సాయికృష్ణ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో మాట్లాడగా, వెంటనే అధికారులు స్పందించారు. మంత్రితో మాట్లాడిన 24 గంటల్లోనే ఏడి, ఏఓచొరవతో రెండు లోడ్ల యూరియా బస్తాలు మునగపాక ప్యాక్స్ భవనానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మన్ విల్లూరి నరసింగరావు, దాడి శివ, పెంటకోట శ్రీరామమూర్తి, డైరెక్టర్ పలిపిని రాము, మొల్లి అప్పలరాజు సమక్షంలో యూరియా బస్తాలను కోఆపరేటివ్ సొసైటీ వద్ద అన్‌లోడ్ చేయించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మునగపాకలో యూరియా కొరత లేదని కూటమి నాయకులు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# సామయ్యవలసలో అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీలు సీజ్



పద్మనాభం, జూన్ 7, ప్రభాతవార్త

మండలంలో సామయ్యవలస గ్రామంలో అక్రమంగా మట్టితరలిస్తున్న లారీలను భూగర్భ,గనులశాఖ అధికారులు శనివారం రాత్రి సీజ్ చేసి తమ పోలీసు స్టేషనుకి అప్పగించినట్లు పద్మనాభం పోలీసులు చెప్పారు. ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా పంటపొలాల నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీలను, జెసిపిని తమకు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టుకొని సీజ్ చేసారని పోలీసులు చెప్పారు. వీటికి తహాశీల్దారు రుసుం విధిస్తారని పోలీసులు చెప్పారు.

# మదర్ థెరీసా సేవారత్న అవార్డును అందుకున్న పోలీసునాయుడు

పద్మనాభం, జూన్ 7, ప్రభాతవార్త



మండలంలో రేవిడిగ్రామ పంచాయతీ మదుర గ్రామం రౌతులపాలెంకి చెందిన తూగురోతు బంగారునాయుడు (పోలీసు నాయుడు), 2026వ సంవత్సరం మధర్ థెరీసా రాష్ట్ర సేవారత్న అవార్డును ఆదివారం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందుకున్నారు. తాను నిస్వార్థంగా ప్రజలకు చేసిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించిన మదర్ థెరీసా సంస్థ వారు ఈ అవార్డును ఇవ్వడంపై తమకు ఆనందంగా ఉందని పోలీసునాయుడు అన్నారు. ఇకపై కూడా తమ శక్తి మేరకు ప్రజలకు సేవాలందిస్తారని ఆయన అన్నారు.

# ఈ నెల 9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పద్మనాభం, జూన్ 7, ప్రభాతవార్త

పద్మనాభం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల9న ఉదయం పది గంటలకు మండల పరిషత్ అధ్యక్షులు కె.రాంబాబు అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపిడిఒ బండారు చిన్నారావు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, ఎంపిటీసీలు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

# నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

## జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం జూన్ 7, ప్రభాతవార్త



జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని, రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలు, మీకోసం. ఏపీ జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఇప్పటివరకు ఆయా శాఖలకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత నివేదికలతో అధికారులు నిర్ణీత సమయానికి రావాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.

# నవ్వులు పూయించిన కామెడీ షో



విశాఖపట్నం, జూన్ 7, ప్రభాతవార్త

ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ విశాఖ, హైదరాబాద్ ప్రతి నెల నిర్వహించే "వినోదాల విందులో భాగంగా స్థానిక ద్వారకానగర్ పౌరగ్రంధాల యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కామెడీ షో నిర్వహిం చారు. దీనిలో ఎం వి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, నక్షత్ర, సూర్య మద్రాపు, పుష్యమి, బోను నరసింహారావు,కామెడీ స్కిట్స్‌లు, ముందుగా శ్రీ కళా రాధన, మ్యూజిక్, డాన్స్ అకాడమి గాజువాక డా.తాళ్లపాక సందీప్ కుమార్ శిష్య బృందం, రోషిత, తనీషా, నివేదిత, నిహారిక, మోనిషా రెడ్డి, జాస్మిత, అక్షయ, షణ్ముఖ ప్రియలు శాస్త్రీయ నాట్య ప్రదర్శన చేసిన అనంతరం పార్టీ, హోటల్, నోములు, ఆఫీస్ వాతావరణం, పెద్దాయన్ని పిలు, రాసిన నవల, యాత్రలు, పేలుడు పధార్థాలు, షాపింగ్, చెప్పులు, ఇంకా ఎన్నో స్కిట్స్ ప్రదర్శించి నవ్వులు పూయించారు. అనంతరం అధితులు తిలక్ పట్నాయక్ ఆడిటర్, శైలజ చేతుల మీదుగా మెమెంటో గిఫ్ట్ అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వహణ ఎం వి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్. డాన్స్ గురువు తాళ్లపాక సందీప్ కుమార్ పిల్లలను తీర్చి దిద్దినందుకు అధితులు మెమెంటోలు, గిఫ్ట్ అందజేసీ ఆత్మీయత సత్కరమ్ పురస్కారం అందజేశారు. కళాకారులను అందర్నీ అభినందించారు.

# ప్రజాస్వామ్య హక్కుల్ని హరించే బీజేపీ ఆర్ఎస్ఎస్

విశాఖపట్నం, జూన్ 7 ప్రభాతవార్త




జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్క్ఎదురుగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్.రహిమాన్ మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్దా కాక్రోచ్ జనతా (సిజేపి) జరుగు నిరసనకు సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి అనీ రాజా ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జాతీయ కార్యదర్శి నిషా సిద్దు ఏవైఎఫ్ ఏఐఎస్ఎఫ్ జాతీయ నాయకులు సంఘీభావం తెలపడానికి వెళితే ఆర్ఎస్ఎస్ అనీ రాజాపై అక్కడున్న సిపిఐ నాయకులు పై దాడులకు పాల్పడ్డారు దీన్ని తీవ్రంగా విశాఖ జిల్లా సమితి ఖండిస్తుందని బిజెపి అనుబంధం సంఘాలైన ఆర్ఎస్ఎస్ పై కేసులు పెట్టి వారిని జైలు పంపించాలని డిమాండ్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ నీట్ ప్రశ్న పత్రాలు లీకైన దానికి బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని ప్రజాస్వామ్య బద్దంగా నిరసన తెలిపితే బిజెపి ప్రభుత్వం ఆర్ ఎస్ ఎస్ ఇటువంటి దాడులకు పాల్పడుతూ రాజ్యాంగం ఇచ్చే హక్కులను ఉల్లంఘిస్తూ స్వేచ్ఛ సమానత్వాన్ని అనగ దొక్కుతూ ప్రశ్నించేవారు ని గొంతు నొక్కి ఊపా చట్టం క్రింద కేసులు పెడుతూ వారిని జైలు పంపిస్తున్నారని విమర్శించారు. బిజెపి దాని అనుబంధ ఆర్ఎస్ఎస్ గుండాలు సిపిఐ నాయకులు గొంతును నొక్కాలనుకోవడం మీ తరంకాదన్నారు. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానని నేడు ఉద్యోగాలు ఎక్కడివి అని అడిగితే వారిపై దాడి చేయడం దురదృష్టంకరమని ఈ దాడిని సిపిఐ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అత్తిలి విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం పైడిరాజు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసరావు, కె వనజాక్షి, ఎన్.నాగభూషణరావు జిల్లా సమితి సభ్యులు గుడాల.రాంబాబు, ఏ.దేవుడమ్మ, జి వామనమూర్తి సిహెచ్.కాసుబాబు, పద్మ, కాసుల్ రెడ్డి, టీ.వెంకటేశ్వరరావు పి.పుష్పలత కే.లక్ష్మణరావు ఏ.రవి, డి సత్తిబాబు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, జూన్ 7, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ, ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, పెందుర్తి, గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించబడునని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. నగరంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు జివిఎంసి కమిషనర్ తెలియచేశారు.

# విశాఖలో ముగిసిన 3 రోజుల సహజయోగ జాతీయ శ్రీ ఆదిశక్తి పూజ, అవగాహన సదస్సు

విశాఖపట్నం, జూన్ 7, ప్రభాతవార్త



విశాఖ తీరంలో మూడు రోజుల పాటు జరిగిన ఆధ్యాత్మిక మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య ముగిసింది. దేశ, విదేశాల నుండి సుమారు 7,000 మంది ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు హాజరైన ఈ జాతీయ సదస్సు లో చివరి రోజు భక్తుల సందడి రేకెత్తింది. జూన్ 5, 6 తేదీల్లో అంతర్గత కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి కాగా, చివరి రోజైన ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ముఖ్యంగా సాయంత్రం 6 గంటలకు గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించిన ఉచిత సహజ యోగ ధ్యాన పరిచయ కార్యక్రమం సూపర్ హిట్ అయింది. నిత్య జీవితంలో ఒత్తిడి, ఆందోళనలతో సతమతమవుతున్న సామాన్య ప్రజలకు ఈ ధ్యాన పద్ధతులపై నిర్వాహకులు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. సరళమైన పద్ధతిలో కుండలినీ జాగృతి, ఆత్మ సాక్షాత్కారం ఎలా పొందాలో వివరించారు. 1970లో ప్రారంభమైన ఈ సహజ యోగ ధ్యానం.. సమాజం లోని అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా నేటి ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని రాష్ట్ర కోఆర్డినేటర్ రామకృష్ణ పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం ఇంత పెద్ద ఎత్తున విజయవంతం కావడం పట్ల నేషనల్ వైస్ చైర్మన్ భల్లా, నేషనల్ సెక్రటరీ రమేష్ కుమార్ గుప్తా, ట్రస్ట్ సభ్యులు మధుసూదనరావు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విశాఖ ప్రజలకు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన సహాయోగులకు నిర్వాహక కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.



# క్రికెట్ స్టేడియం పరిశీలించిన ఆపరేషన్ టీమ్

విశాఖపట్నం, జూన్ 7 ప్రభాతవార్త

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపిఎల్) ఆపరేషన్స్ టీమ్ ఆదివారం స్టేడియంని పరిశీ లించారు. విశాఖపట్నంలో జరగబోయే మ్యాచ్‌లకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నట్లు ధృవీకరించింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఏసీఏ, సిఓఓ గిరీశ్ డోంగ్రే మాట్లాడుతూ జూన్ 9 నుండి ప్రారంభమవుతున్న ఏపీఎల్ మ్యాచ్‌లకు వేదిక సిద్ధంగా ఉందని తెలియ జేశారు. టోర్నమెంట్ జూన్ 9 రాత్రి 7:30గంటలకు ప్రారంభమవుతుందని కాకినాడ కింగ్స్ సింహాద్రి విశాఖ లయన్స్‌ల మధ్య ఆడానుంది అని తెలియజేశారు .క్రికెట్ అభిమానులు ప్రజలకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆహ్వానం ఇస్తుందని తెలిపారు. స్టేడియంకు ప్రవేశం అన్ని ప్రేక్షకులకూ ఉచితంగానే ప్రవేశ ఉంటుందని ఆయన తెలియజేశారు. నిర్వహించిన పరిశీలనలో పాల్గొన్న ఏసీఏ అధికారులుగా ఎంఎస్ కుమార్, జి ఎం (గేమ్ డెవలప్‌మెంట్ ఏసీఏ), జెకె ఎం రాజు (స్టేడియం మేనేజర్, ఏసీఏ), వై. వెంకటేష్ (మీడియా మేనేజర్, ఏసిఏ) పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న టీడీపీ రాజ్యసభ అభ్యర్థి చింతకాయల విజయ్

విశాఖపట్నం-ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన చింతకాయల విజయ్ ఆదివారం కుటుంబ సమేతంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. రాజ్యసభకు ఎంపికైన సంతోషకరమైన తరుణంలో ఆయన అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, ఆశీస్సులు అందుకున్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో విజయ్ వెంట ఆయన తల్లి, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారి సతీమణి చింతకాయల పద్మావతి, అలాగే విజయ్ సతీమణి డాక్టర్ సువర్ణ తదితరులు ఉన్నారు. ఆలయ మర్యాదల ప్రకారం వారికి దర్శన ఏర్పాట్లు జరగ్గా, పండితులు అమ్మవారి ఆశీర్వచనం అందజేశారు.

# ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన..

7వ పేజీ తరువాయి ..

మంత్రి వంగలపూడి అనిత ఎప్పటికప్పుడు ఆరా తీయడంతో పాటు నిందితులను పట్టుకోవడం విషయంలో ప్రతిష్టాత్మంగా తీసుకొని నిత్యం పరిశీలన చేస్తూ అందర్నీ అప్రమత్తం చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, సీఐ జూ రెడ్డి మురళి పాటు పోలీస్ సిబ్బందికి ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

# స్వర్గీయ పల్లా సింహాచలం స్ఫూర్తితోనే ప్రజాసేవ

7వ పేజీ తరువాయి ..

కలిసి తమ సొంత నిధులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో తెదేపా సభ్యత్వం తీసుకుని, అకాల మరణం చెందిన 200 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాడు అన్న నందమూరి తారక రామారావు నుంచి నేటి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, లోకేశ్ వరకు తమ కుటుంబానికి ఎంతో గుర్తింపునిచ్చి ఆదరించారని పల్లా శ్రీనివాసరావు గుర్తుచేసుకున్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను తాము ఎల్లప్పుడూ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు,రాష్ట్ర డైరెక్టర్లు మొల్లి పెంటిరాజు, నాయకులు వెన్నెల ఈశ్వరరావు, వివిధ వార్డుల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## పాడేరు గిరి కైలాస క్షేత్రానికి గాలిపంక బహుమతి



పాడేరు,జూన్7,ప్రభాతవార్త

పాడేరు గిరి కైలాస క్షేత్రంలో ఉన్న శ్రీ ఉమా నీల కంఠేశ్వర స్వామి వారి సమేతా శ్రీ రాజరాజేశ్వరి అమ్మ వారి దేవాలయంకు గాను గర్భాలయంలో అమర్చుటకు భక్తి పూర్వకంగా గాలిపంకాను అందించిన భక్తులు సూడి తమ్మనదొర చిలకమ్మ దంపతుల కుమారులు కిశోర్ చంద్ర దేవ్, జగదీష్ చంద్ర దేవ్ భక్తి పూర్వకంగా ఈ కానుకను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామశాస్త్రి, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ఉపాధ్యక్షులు కొట్టగుల్లి రామారావు, కిముడు కాత్యాయని, కోడా రాజేశ్వరి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. నగదు రూపంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణమునకు విరాళం అందించిన భక్తులు. శ్రీనివాసరావు మేనేజర్ -3000, రాచకొండ భూపతి రావు - 2100, హైదరాబాద్ వారు విరాళం అందించారు. ఆలయ అభివృద్ధికి అన్ని రకములుగా ప్రోత్సహిస్తున్న దాతలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఘనంగా ప్రారంభం అయిన నక్కలపుట్టు అమ్మవారి ఉత్సవాలు

పాడేరు,జూన్7,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా పాడేరు మండలం నక్కలపుట్టు గ్రామంలో శ్రీ మోద కొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభం అయ్యాయి. అమ్మవారి జాతర మహోత్స వాలు సందర్భంగా మామిడితోటలో ఉన్న శ్రీ మోద కొండమ్మ అమ్మవారి ఆలయంలో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, ఘటానికి, పాదాలకు గ్రామ పెద్దలు, ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని శిరస్సుపై పెట్టుకుని నక్కలపుట్టు జంక్షన్ వరకు ఊరేగింపుగా తీసుకు వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శకంపట్టు ఉత్సవ విగ్రహాన్ని, పాదాలనుఘటాన్ని ప్రతిష్టించారు. దీంతో మూడు రోజుల అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఘటాలు పటిష్ట కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొర్రా నాగరాజు, ఉత్సవ అధ్యక్షులు మోస్యా పాలవెల్లి, కార్యదర్శి కొత్తేల త్రినాధ్, లింగేరి విశ్వనాధం, కొత్తేల అప్పారావు, కర్రి రమణ, పెనుగొండ పాపారావు, ఆలయ ధర్మకర్త జనరెడ్డి శ్రీను, జనరెడ్డి వెంకట్, స్టలదాత దుంబెరి కొండలరావు, నాగేంద్ర, దేముడు భక్తులు పాల్గొన్నారు.

## పాత పాడేరులో ఘనంగా ఇటుకలు పండుగ

### గిరిజన సంప్రదాయ నృత్యాలు..వన భోజనం



పాడేరు,జూన్7, ప్రభాతవార్త

గిరిజన ప్రాంతంలో పూర్వీకులు నిర్వహించిన ఆచారం, సంప్రదాయాలు,తూచా తప్పకుండా దశాబ్దాల కాలంగా నిర్వహిస్తున్న గిరిజన సాంస్కృతి సాంప్రదాయాలను విడనాడకుండా పాడేరు పట్టణం పాతపాడేరు గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. ఐదుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కేంద్రం పాడేరు పంచాయతీ పాత పాడేరు గ్రామంలో గత ఇటుకల పండగ సందర్భంగా పాత పాడేరు గ్రామంలో ఏటా జరిగినట్టు ఈ సంవత్సరం కూడా నెలరోజులు ఇటుకల పండగ నిర్వహించారు. ఈ పండుగ చివరి రోజులు అనగా శనివారం మగవారి బద్దులాగడం ఆదివారం ఆడవారి బద్దులాగడం ఏట జరుగుతుంది. ఈ సంవత్సరం కూడా సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడవారు బద్దులాగే సందర్భంలో ఆడపడుచులు ఒకవైపు వదిన మరదలు ఒకవైపు ఆడపడుచులు అనగా టేకులు వదిన మరదలు భూములుగా విభజించి బద్దులాగడం అనవసితీగా జరుగుతుంది. ఈ క్రమంలో ఆడపిల్లలు అనగా టేకులు గెలవడంతో వదిన మరదలు భూములు ఆడపడుచుని ఈ సంవత్సరం కోరబు లక్ష్మీ భవాని వదిన మరదలు ఇంటి వరకు దప్పు వైద్యాలతో ఇంటి వరకు ఎత్తుకొని వెళ్ళే కార్యక్రమం నిర్వహించారు. వారికి ఆదివారం వనభోజనాలు ఏర్పాటు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాడేరు పంచాయితీ సుంద్రు పుట్టు గుడివాడ, కొత్త పాడేరు, గొందూరు, పాతపాడేరు గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాత పాడేరు గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు డప్పు వాయిద్యాల నడుమ థింసా నృత్యాలు చేస్తూ సరదాగా గడిపారు.

## 'పెద్ది' సినిమాలో ఆదివాసీలను అవమానించే పదాలను తక్షణమే తొలగించాలి : 'ఐస్టా' డిమాండ్

### డైరెక్టర్ బుచ్చిబాబు, సెన్సార్ బోర్డు స్పందించకుంటే జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

పాడేరు,జూన్7, ప్రభాతవార్త



పెద్ది'చలనచిత్రంలో ఆదివాసీలను ఉద్దేశించి పదేపదే వాడిన "కొండ నా కొడుకు.. కొండ నా కొడుకు." అనే డైలాగ్, యావత్ ఆదివాసీ సమాజం ఆత్మగౌరవాన్ని, మనో భావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు మసాడా ఈశ్వరరావు ప్రధాన కార్యదర్శి ముఖిశేషాద్రి, సిపిఎస్ జిల్లా అధ్యక్షులు మోరీ మోహన్, ప్రధాన కార్యదర్శి సాగిన వెంకట్రావులు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. చలనచిత్రాలలో గిరిజనులను కించపరిచేలా, హీనపరిచేలా మాట్లాడటం చట్టరీత్యా నేరమని వారు గుర్తుచేశారు. చిత్ర దర్శకుడు బుచ్చిబాబు, సెన్సార్ బోర్డ్ అధికారులు దీనిపై తక్షణమే స్పందించి, సినిమా నుండి ఆ వివాదాస్పద పదాలను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జాతీయ ఎస్టీ కమిషన్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి, చిత్ర యూనిట్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేలా పోరాడతామని వారు పత్రికా ముఖంగా హెచ్చరించారు.

## వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా బురిడి ఆనందరావు



అరకులోయ, జూన్ 7, ప్రభాతవార్త

వాలీబాల్ అల్లూరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా అరకులోయకు చెందిన బురిడి ఆనందరావు ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా మధు సూధనరావు, కార్యదర్శిగా కిల్లో అప్పల రాజు, సంయుక్త కార్యదర్శిగా శెట్టి నాగేశ్వరరావు, కోశాధికారిగా పూర్ణరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కొర్రా రామారావు, శెట్టి లక్ష్మణరావు, ఎగ్జిట్ మెంబర్స్ వంతల రాంబాబు, లైకోస్ మాస్టారు, కిల్లో డొంబు నాయుడును ఎన్నుకున్నారు. అదేవిధంగా అసోసియేషన్ సలహాదారులుగా కొర్రా రవి మాస్టారు, బురిడీ ప్రకాష్‌రావు, బేతా రాజారావు, కాపుగంటి కృష్ణారావు, రావుపల్లి రవి, అలాగే మరి కొంతమంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా బురిడి ఆనందరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అరకులోయ వాలీబాల్ క్రీడా మైదానం నుండి ఎంతోమంది క్రీడాకారులు ఉన్నత టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ క్రీడా మైదానం నుండి ఉత్తమ క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. కాగా అరకులోయ వాలీబాల్ క్రీడా మైదాన అభివృద్ధికి అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అంతే కాకుండా ఈ నెల 11న స్వయంగా క్రీడా మైదానంను పరిశీలించనని వస్తానని చెప్పినట్లు ఆయన తెలియజేశారు. అదే విధంగా క్రీడా మైదానంను కాపాడు కునేందుకు గాను ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమని, అందరి సహాయ సహకారాలతో బేడా ప్రాంగణాన్ని అభివృద్ధి పరుస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ క్రీడాకారులు పొలు మాస్టారు, గెన్ను మాస్టారు, సంతోష్, సంజు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన బంతులతో పచ్చదనం పరిడవిల్లాలి

### విత్తన బంతులతో సామాజిక వనాలు -14న ఉత్తరాంధ్ర రైతుల సమ్మేళనం జయప్రదం చేయండి

### -జలగం కుమారస్వామి, జాతీయ కార్యవర్గ సభ్యులు, భారతీయ కిసాన్ సంఘ్



విశాఖపట్నం, జూన్ 7, ప్రభాతవార్త

విత్తన బంతులతో పచ్చదనం పరిడవిల్లాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎ హబ్ వద్ద ప్రతి ఆదివారం నిర్వహించబడు ప్రకృతి రైతు సంతలో గ్రీన్ క్లైమెట్ టీం ఎన్జిఓ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం నేతృత్వంలో విత్తనాల బంతులు తయారు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. శీతోష్ణస్థితి మార్పు వల్ల ఏర్పడిన వాతావరణ విపత్తుల నుండి మనం బయటపడాలంటే ప్రతి ఒక్కరూ విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంపొందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ తినే పండ్ల విత్తనాలు ఆరబెట్టి విత్తనాల బంతులు తయారు చేసి సామాజిక వనాలు పెంపొందించాలని కోరారు. ఈ నెల 14 వ తేదీన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం విశాఖ నగరంలోని వివికె కళాశాలలో నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర రైతుల సమ్మేళనం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిపుచ్చుకునే విధానంలో విత్తనాల రైతులకు అందజేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలోని ప్రకృతి ఆహారం పంటలు పండించే రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్ అధ్యక్షులు ఎం ఆర్ ఎన్ వర్మ, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, సీనియర్ జర్నలిస్టు యుగంధర్ రెడ్డి, గోవర్ధన పురం గోశాల ప్రతినిధి భోగ మహేష్, ప్రకృతి రైతులు శంకర్, రిషి, త్రినాథ్, జెవి రత్నం, ప్రీతమ్ వర్మ, గ్రీన్ క్లైమెట్ టీం ఎన్జిఓ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, సమన్వయ కర్త, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దారకొండలో మలేరియా కలకలం ఒక్కరోజే 78 కేసులు



గూడెంకొత్తవీధి జూన్ 7, ప్రభాతవార్త

జీకే వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా విష జ్వరాలు రోజురోజుకూ పెరుగుతుండడంతో రోగులు భయాందోళన చెందుతున్నారు. ఆది వారం ఒక్కరోజే 78 కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపారు. హాస్పిటల్‌లో తక్కువ బెడ్లు ఉండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బెడ్ల సంఖ్య పెంచాలని పీసా కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నేతలు కోరారు. సీజనల్ విష జ్వరాలు ప్రబలుతున్నందున అధికారులు తక్షణం స్పందించి ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మందులు, పరీక్షలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పీసా కమిటీ అధ్యక్షుడు శెట్టి రాంబాబు, మండల కార్యదర్శి కిల్లో ధర్మారావు, బాకూరు కోటేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందేందుకు రైతులు

## ఈ-కేవైసీ, బ్యాంకు ఖాతా వివరాలు సరిచేసుకోవాలి

గూడెంకొత్త వీధి, జూన్ 7, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం 2026-27 రెండో సంవత్సరం తొలి విడత ఆర్థిక సహాయం జూన్ మూడో వారంలో విడుదల కానున్న నేపథ్యంలో రైతులు తమ వివరాలను వెంటనే సరిచేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గిరిబాబు సూచించారు. పథకానికి సంబంధించి ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతులు జూన్ 9వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ-కేవైసీ రిజెక్ట్ అయిన రైతులు తమ ఆధార్ వివరాలను అందజేస్తే సంబంధిత ఉన్నతా ధికారుల కార్యాలయం ద్వారా యాక్టివేట్ చేయించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ఏడాది రెండో విడతలో రైతు జీవించి ఉన్నప్పటికీ "డెత్"గా నమోదైన కేసులు, అలాగే "ఇన్‌కమ్ ట్యాక్స్ పేయర్"గా చూపించి అర్హులైన రైతులు పథకం నుంచి తప్పించబడినట్లయితే వారి వివరాలను మండల వ్యవసాయ అధికారులకు అందజేయాలని కోరారు. సంబంధిత సమాచారాన్ని ఎక్సెల్ ఫార్మాట్‌లో, రైతుల సంతకాలతో సమర్పించాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌పీసీఐ ఇనాక్టివ్ ఖాతాలను యాక్టివేట్ చేసుకున్న రైతుల ఖాతాలకు కూడా పథక నిధులు జమయ్యే అవకాశం ఉందని తెలిపారు. పథకానికి సంబంధించిన అన్ని మార్పులు, సవరణలు జూన్ 9వ తేదీలోగా పూర్తిచేయాలని, అనంతరం లబ్ధిదారుల జాబితా ఖరారు చేయబడుతుందని పేర్కొన్నారు. ఒకసారి జాబితా ఖరారైన తర్వాత మరో ఏడాది వరకు ఎటువంటి మార్పులు, అభ్యంతరాలు లేదా గ్రీవెన్స్‌లకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను వెంటనే ధృవీకరించుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి గిరిబాబు విజ్ఞప్తి చేశారు.

## పెద్ది సినిమా డైరెక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : భారత్ ఆదివాసీ పార్టీ

గూడెం కొత్తవీధి జూన్ 7,ప్రభాతవార్త



పెద్ది సినిమా డైరెక్టర్ బుచ్చిబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎస్టీ కమీషన్లకు భారత్ ఆదివాసీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు సూచించారు. పెద్ది సినిమాలో గిరిజనులను ఉద్దేశించి ఉపయోగించిన భాష అభ్యంతకరమని, సెన్సార్ బోర్డ్ కూడా ఇలాంటి భాషను ఎలా అంగీకరించిందని, ఇలాంటి భాష వేరే కులాల మీద ఉపయోగిస్తే ఈపాటికి దియేటర్లు తగలబడేవని, ఆదివాసీలు మైనార్‌గా ఉన్నారు కదా అని ఇలాంటి భాషను ఉపయోగించడం పద్దతిగా లేదు. ఈ దేశానికి మూలవాసులు ఆదివాసీలు,ఈ దేశానికి ప్రథమ పౌరురాలైనా రాష్ట్రపతి ఒక ఆదివాసీ. సినిమాలో వాడిన ఆ భాష యావత్తు ఆదివాసీ సమాజానికి కించే పరిచే విధంగా ఉంది కనుక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎస్టీ కమిషన్ లు పెద్ది సినిమా డైరెక్టర్ బుచ్చిబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. ఆదివాసీలపై ఉపయోగించిన అభ్యంతకరమైనా పదాలను తీసివేయాలని సెన్సార్ బోర్డ్‌కు నోటీసు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆదివాసీ పార్టీ నాయకులు పండా క్రిష్ణమూర్తి, పోతురాజుదొర తదితరులు పాల్గొన్నారు.

## విధేయతకు గుర్తింపు.. నిబద్ధత, నిజాయితీలకు నిదర్శనం..!

### విజయ్‌కి రాజ్యసభ అవకాశంపై జిసిసి మాజీ చైర్మన్ ప్రసాద్ హర్షం



కొయ్యూరు, జూన్ 7 ప్రభాతవార్త

చింతకాయల విజయ్‌ను రాజ్యసభ సభ్యత్వం వరించడం పార్టీ పట్ల ఉన్న విధేయతకు తగిన గుర్తింపుగా, నిబద్ధత నిజాయితీలకు నిదర్శనం గా నిలిచిందని జిసిసి మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎంవివి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఐటిడిపిని ముందుండి నడిపించి, సాంకేతికత ను ఆయుధంగా మలచి, కేడర్‌కు విజయ్ కొండంత అండగా నిలిచారన్నారు. పదవులు చూసి వచ్చే వారు కొందరైతే, "నమ్మకం", "విధేయత" అనే పదాలకే నిలువెత్తు రూపమై, నమ్ముకున్న జెండా కోసం అహర్నిశలు శ్రమించిన నిజమైన శ్రామికుడు విజయ్ అని అన్నారు. యువ నాయకుడు విజయ్ చింతకాయల రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక కావడం, కష్టపడే ప్రతి కార్యకర్తకు దక్కిన గౌరవంగా భావిస్తూ ఇది నిబద్ధతకు దక్కిన అఖండ విజయంగా అభివర్ణించారు. పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ వేయనున్న చింతకాయల విజయ్‌కు ఎంవివి ప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## పబ్లిక్ గ్రీవెన్స్‌కు మండలాధికారులు విధిగా హాజరు కావాలి

### మండల తహశీల్దార్ కె.ప్రసాద్ రావు వెల్లడి

కొయ్యూరు, జూన్ 7 ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు మేరకు మండలంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌కి మండల అధికారులంతా విధిగా హాజరు కావాలని తహశీల్దార్ కె.ప్రసాద్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సమస్యల గురించి ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు అధికారులు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించారన్నారు. కలెక్టర్ వారు ఆదేశాల మేరకు ప్రతి ఒక్క మండలాధికారి కూడా ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు మండల పరిషత్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ కు హాజరు కాక తప్పదని తహశీల్దార్ వివరించారు.




## తృటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి/అడ్డురోడ్డు, ప్రభాతవార్త

మండలంలోని వేంపాడు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం త్రుటిలో గొప్ప ప్రమాదం తప్పింది. కాకినాడ జిల్లా తుని నుంచి విశాఖ వైపు వస్తున్న కారు వేంపాడు వద్దకు వచ్చేసరికి అకస్మాత్తుగా లారీ ఆగడంతో దాన్ని ఢీకొట్టింది. కారు డ్రైవర్ చాకిచెక్కిన వ్యవహరించడంతో కారులో ఉన్న ఏ ఒక్కరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. హైవే పోలీసులు నేషనల్ హైవే టోల్ ప్లాజా సిబ్బంది గుర్తించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

## ఏఎంసీ ప్రభుత్వ వైద్యుల సంఘం కొత్త కార్యవర్గం ఎన్నిక

విశాఖపట్నం, జూన్ 7,ప్రభాతవార్త



ఆంధ్ర వైద్య కళాశాల ప్రభుత్వ వైద్యుల సంఘం, (జి.డి.ఏ.ఏ.పి.) నూతన అధ్యక్షులుగా ఫిజియాలజీ వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ఆంధ్ర వైద్యశాల సోషల్ ప్రీవింటివ్ మెడిసిన్ (ఎస్‌పీఎం) మీటింగ్ హాల్‌లో ఇటీవల జరిగాయి. ఈ ఎన్నికలలో కళాశాల ఫిజియాలజీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డా.రాజు అధ్యక్షుడు గానూ, అనస్థీషియా విభాగ ప్రొఫెసర్ డాక్టర్ అపరంజి కార్యదర్శిగాను అనాటమీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డా.దీపిక కోశాధికారిగాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనాటమీ విభాగాధిపతి ప్రొఫెసర్ రవీంద్ర కిషోర్, మానసిక వైద్య విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్, పోష్టు పార్టం విభాగ వైద్యులు డాక్టర్ చిరువోలు శ్రీధర్ జనరల్ కౌన్సిల్ సభ్యులు గాను ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ప్రభుత్వం వైద్య సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఐ.బాబ్జీ శ్యామ్ కుమార్ కేంద్ర ఎన్నికల పరిశీలకుడుగా పర్యవేక్షించారు. కింగ్ జార్జి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవిలకు ఎన్నికైన కార్యవర్గాన్ని కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ బాబ్జీ శ్యామ్ కుమార్ పరిచయం చేయగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఐ.వాణి, ప్రిన్సిపాల్ డా.సంధ్యాదేవి అభినందించారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సంఘ నియమాలను పాటిస్తామని,ప్రభుత్వ వైద్యుల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసారు.




## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత.. గంజాయి నిర్మూలనపై నిబద్ధత..!

### రాజేంద్రపాలెం వారపు సంతలో పోలీసుల అవగాహన కార్యక్రమం



కొయ్యూరు, మే 7, ప్రభాతవార్త

సైబర్ నేరాలపై ఉండాల్సిన అప్రమత్తత పైనా, గంజాయి నిర్మూలన పట్ల ప్రతి ఒక్కరికి ఉండాల్సిన నిబద్ధత పట్ల మండలంలోని రాజేంద్రపాలెం వారపు సంతలో గిరిజనులకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన, మహిళల భద్రత, రోడ్డు భద్రతపై ప్రజలకు ఆదివారం వారపు సంతలో సి.ఐ. కొయ్యూరు బమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ, పోలీసు సిబ్బంది కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుమూల గిరిజన గ్రామాల నుండి సంతకు వచ్చిన ప్రజలను నేరుగా కలిసి ప్రజల భద్రత, చట్టాల పట్ల అవగాహన, సామాజిక బాధ్యతలపై సూచనలు అందించారు. సి.ఐ. బమ్మిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, నకిలీ లోన్ యాప్స్, కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే సందేశాలు, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, యూపీఐ పిన్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు తెలియజేయరాదని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద నిలబడరాదని, బహిరంగ ప్రదేశాలలో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు వ్యవసాయ పనుల సమయంలో వాతావరణ హెచ్చరికలను గమనించాలని సూచించారు. గంజాయి నిర్మూలన, మాదక ద్రవ్యాల నియంత్రణ అంశంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా, నిల్వ, విక్రయం వంటి చర్యలు చట్టరీత్యా తీవ్రమైన నేరాలని పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తులు డబ్బు ఆశ చూపి గంజాయి రవాణాకు సహాయం కోరవచ్చని, అలాంటి ప్రలోభాలకు లొంగవద్దని హెచ్చరించారు. గంజాయి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. గిరిజన రైతులు గంజాయి సాగుకు బదులుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళలపై నేరాల నివారణ గురించి మాట్లాడుతూ మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు, బెదిరింపులు లేదా అనుమానాస్పద సంఘటనలను ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళల భద్రతకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని వివరించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, గ్రామాలలో గంజాయి సాగు, రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సి.ఐ. కోరారు. ప్రజలు పోలీసుల సూచనలను ఆసక్తిగా విని తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

## కూటమి ప్రభుత్వంపై ప్రస్తుతం ప్రజలు అసహనం

### ప్రజలను పరీక్షిస్తే అసహనాన్ని కంట్రోల్ చేయలేరు : మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు

పాడేరు,జూన్7, ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వంపై ప్రస్తుతం ప్రజలు అసహనంతో ఉన్నారని.. ప్రభుత్వం.. యంత్రాంగం పరీక్షించాలనే ప్రయత్నం చేస్తే ప్రజల అసహనాన్ని కంట్రోల్ చేయలేరని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుపులేటి బాలరాజు పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడారు. గత రెండేళ్లగా పాలన సర్దుబాటు అవుతుందనే చూసామని.. మంచి జరుగుతుందని చూస్తున్నా దాదాపు ఎక్కడ మంచి కనిపించడం లేదని మాజీ మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు వాస్తవాలు ప్రజలకు తెలియకపోతే ఎంతో నష్టపోవడం ఇబ్బందులు గురికావాల్సి వస్తుందన్నారు. ఏజెన్సీలో వ్యవస్థలు, పాలకులు, ప్రభుత్వాలు వివక్షత ధోరణిలో వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి ఆరోపించారు. ఏజెన్సీలో జిల్లాలో క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఎవరు పని వారు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు ప్రజలను మభ్య పెట్టేలా తీయటి ప్రకటనలు తప్ప ...ఏం చెప్పినా సాగిపోతుందనే ధోరణిలో ఉన్నారన్నారు. అమలు జరగని ప్రకటనలో చేస్తూ గడిచిన రెండు సంవత్సరాల్లో అల్లూరు జిల్లాలో ఈ ప్రాంతానికి అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకం రాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతున్న పథకాలే తప్ప... రాష్ట్రంలో పథకాలు ప్రారంభ సమయంలో ఇక్కడ హడావుడి తప్ప జిల్లాకు ఉపయోగపడే ఏ పథకం కొత్తగా లేవన్నారు. అల్లూరు జిల్లాను జోన్ 2లో కలపడం వలన భవిష్యత్తు కాలంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయని ఉద్యోగ అవకాశాలు తగ్గుతాయని ఉద్యోగులకు బదిలీల వ్యవహారంలో పదోన్నతులలో నియామకాల్లో ఇబ్బందులు కలుగుతాయ ఆయన అన్నారు. జీవో నెంబర్ 3లో అన్ని శాఖల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు తన హయాంలో 20 జూనియర్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు తర్వాత వచ్చిన ప్రభుత్వాలు వాటిని అమలు చేయడం లేదన్నారు. అల్లూరి జిల్లా మొత్తంలో ఒక్క పరిశ్రమ కూడా లేదని పరిశ్రమలు లేకపోతే ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఎలా వస్తాయి అని ఆయన ప్రశ్నించారు. చట్టాలు ఒప్పుకో వని యంత్రాంగం చెప్తున్నా చిత్తశుద్ధి ఉంటే ఐదు ఎకరాలు 10 ఎకరాల్లో కూడా నిబంధనలకు అనుకూలంగా పరిశ్రమలు ఏర్పాటు చేసు కోవడానికి ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నించాలన్నారు విమానాశ్రయాలు ప్రైవేట్ కంపెనీలకు భూములు సేకరిస్తున్న ప్రభుత్వం ఏజెన్సీలో పరిశ్రమలు ఏర్పాటుకు భూములు సేకరించలేదా? అంటూ మాజీ మంత్రి ప్రశ్నించారు ఆంధ్రాలో ఒక్క పరిశ్రమ లేని అల్లూరీ జిల్లా మాత్రమే ఉందన్నారు దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. అంతేకాకుండా అల్లూరు జిల్లాలో ఒక్క ఇంజనీరింగ్ కాలేజీ కూడా లేదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లోనైనా గిరిజన యువత విద్యను అభ్యసిస్తున్నారు అన్నారు. జిల్లాలో బీఈడీ కాలేజి ఐటిఐ మంజూరైన వాటిని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం వివక్షత చూపిస్తుందన్నారు ఉపాధి కోసం స్థానికులకు ప్రభుత్వం సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రకటనలతో కాలయాపన చేస్తున్నారే తప్ప ఏజెన్సీలో జిల్లా అభివృద్ధికి కొత్త పథకాలు రావడం లేదన్నారు ఏజెన్సీలో కొత్త ప్రయోగాలు చేయకుండా అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించిన కాఫీ ఉత్పత్తిని రకరకాలుగా తయారుచేసి పెద్ద కాఫీ పరిశ్రమను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి బాలరాజు డిమాండ్ చేశారు. ఏజెన్సీలో వ్యవసాయ ఆధారక పరిశ్రమలు ఏర్పాటు చేయాలని దీంతో రైతులకు మేలు చేయడమే కాకుండా వారికి ఆర్థికంగా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో పారదర్శకత లోపించిందని ఉపాధి హామీ పథకం కార్మికులకు కూలీ డబ్బులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తూ కోట్లాది రూపాయలు కాంట్రాక్టు పనులకు బిల్లులు చెల్లిస్తున్నారని బాలరాజు ఆరోపించారు ఉపాధి పథకం నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయ అన్నారు రైతాంగానికి ఉపయోగపడే పనులు ప్రభుత్వం చేయాలన్నారు రోడ్లు నిర్మాణాలపై నివేదిక ఇవ్వమంటే ఏడాది అవుతున్న అధికారులు స్పందించడం లేదన్నారు ఏజెన్సీలో ఆటోలు అంబులెన్సులు గ్రామాల్లో తిరిగేలా రోడ్లు వేయాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ఏజెన్సీలో జరుగుతున్న అన్ని పనులపై లోతైన సమీక్ష సమావేశాలు ప్రభుత్వం యంత్రాంగం నిర్వహించాలని ఆయన సూచించారు ఆక్రమణలకు గురైన స్థలాలపై ప్రభుత్వం దృష్టి సా ఆర్గానిక్ ప్రాంతంలో పండించే పంటలకు ప్రభుత్వ ప్రోత్సహించాలన్నారు ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పాంగి నాగరాజు,శరభ సూర్యనారాయణ, బోధ నారాయణ, హుడా త్రినాథ్ పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయం ఎండోమెంట్‌కు అప్పగిస్తే ఆలయం అభివృద్ధి

### మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు



పాడేరు,జూన్7,ప్రభాతవార్త:

పాడేరు శ్రీ మోద కొండమ్మ ఆలయ నిర్వహణ ఎండోమెంట్‌కు అప్పగిస్తే ఆలయం అభివృద్ధితో జవాబు దారితనం ఉంటుందని మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నాయకులు పసుపులేటి బాలరాజు స్పష్టం చేశారు. ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి వెళితే ఆదాయం తెలుస్తుంది. ఆస్తులు తెలుస్తాయి. ఆలయానికి మంచి పేరు వస్తుందని మాజీ మంత్రి బాలరాజు అన్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సాక్షాత్తు సిఎం చంద్రబాబు ఆలయ అభివృద్ధికి రెండు కోట్లు మంజూరు చేస్తే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని ఎందుకు ఆగిపోయిందో చెప్పాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. ఎండోమెంట్ పరిధిలోకి వెళితే ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వంలో అభివృద్ధి చెందుతుందన్నారు.




## క్రీడల పట్ల ఆసక్తి ఉండాలి



**రైల్వే సూపరింటెండెంట్ సురేష్ కుమార్**

**ఎలమంచిలి, జూన్ 7, ప్రభాతవార్త:**

పట్టణంలోని ఎలమంచిలి బాల్ బ్యాడ్మింటన్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ సూపర్డెంట్ ఆకుల సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులకు బాల్ బ్యాట్మెంటన్ బ్యాట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకుల సురేష్ కుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుండే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని, అప్పుడే సాధించాలని పట్టుదల ఉంటే సాధించే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి వీర ప్రజానాయక్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు బ్యాట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ సెక్రటరీ జోసఫ్, ఏసుబాబు, త్రిమూర్తులు, కె ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



### నియోజకవర్గ సమావేశంలో పిలుపు

**( అచ్యుతాపురం, జూన్ 7, ప్రభాతవార్త ):**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ, నియోజకవర్గ పరిశీలకుడు పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని సూచించారు. మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఓటరు జాబితాల స్థితిగతులను నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. బూత్ స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. నెలరోజుల పాటు కొనసాగే ఈ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, సందేహాలను వెంటనే పార్టీ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాల ప్రాధాన్యతను ప్రతి కార్యకర్త గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, మండల అధ్యక్షులు పీల తులసీరామ్, ఇత్తంశెట్టి సన్యాసినా యుడు, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, పిఎసిఎస్ ఎరిపిల్లి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎం. జగన్నాథపురంలో ఎమ్మెల్యే సుందరపు పర్యటన

**( అచ్యుతాపురం, జూన్ 7, ప్రభాతవార్త ) :**



అచ్యుతాపురం మండలం ఎం. జగన్నాధపురం గ్రామంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం తెల్లవారుజామునే పర్యటించారు. ఉదయం 6 గంటలకు గ్రామానికి చేరుకున్న ఆయన పలు సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, గ్రామస్థులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని డ్రైనేజీలు, రహదారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇంటింటి తాగునీటి కొళాయిల పరిస్థితిని పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన అంచనాలు (ఎస్టిమేట్లు) సిద్ధం చేసి, పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా పేద కుటుంబాలకు ఇంటి స్థలాల కేటాయింపునకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించి, ఇంటి స్థలాలకు అర్హులైన కుటుంబాల పూర్తి జాబితాను సిద్ధం చేసి నివేదిక అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పర్యటనలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటేది మీరే... నరికేది మీరే!

## ప్రజాధనానికి బాధ్యత ఎవరిది ?

**( అచ్యుతాపురం, జూన్ 7, ప్రభాతవార్త ) :**

పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయలు వెచ్చించి మొక్కలు నాటిస్తోంది. "చెట్లు నాటండి – భవిష్యత్ తరాలకు జీవనాధారం అందించండి" అంటూ ఉన్నతాధికారులు ప్రజలకు సందేశాలు ఇస్తుంటారు. అయితే, క్షేత్రస్థాయిలో జరుగుతున్న చర్యలు మాత్రం ఈ నినాదాలకు పూర్తిగా విరుద్ధంగా కనిపిస్తున్నాయి. రహదారుల వెంట భారీ సంఖ్యలో మొక్కలు నాటుతున్న అధికారులు, అదే ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఉన్న విషయాన్ని ముందుగానే ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదన్న ప్రశ్న తలెత్తుతోంది. నాలుగు నుంచి ఐదు సంవత్సరాలు పెరిగిన తర్వాత విద్యుత్ తీగలకు అడ్డంగా మారాయనే కారణంతో చెట్లను నరికి వేస్తున్నారు.ఒక మొక్కను నాటడం నుంచి దాని సంరక్షణ వరకు ప్రజాధనం ఖర్చవుతోంది. నీటి సరఫరా, ఎరువులు, రక్షణ కంచెలు, కార్మికుల వేతనాలు వంటి అంశాలకు లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. అనంతరం అదే చెట్టును తొలగించేందుకు మరోసారి ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడం సరైన ప్రణాళికతో జరుగుతోందా? సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉందా? చెట్లు నాటే ముందు భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలను ఎందుకు అంచనా వేయడం లేదు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టే కార్యక్రమాలు కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించేలా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సరైన ప్రదేశాల్లో నాటి సంరక్షించడం అంతకంటే ముఖ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.ప్రజాధనంతో పెంచిన చెట్లు కొన్నేళ్లకే నరికివేయాల్సిన పరిస్థితులు ఎందుకు వస్తున్నాయో సంబంధిత శాఖ అధికారులు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఎండను సైతం లెక్క చేయకుండా..

**నక్కపల్లి, జూన్ 7:**



మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకోవడానికి భక్తులు ఎండను సైతం లెక్క చేయకుండా తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆదివారం అధిక జ్యేష్ఠమాసం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి పసుపు,కుంకుమలు, చీర, రవికలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అ అమ్మవారికి సింహ హారతి, రుద్ర హారతి, కుంభహారతులు ఇచ్చినప్పుడు అమ్మవారి నామంతో ఆలయం మార్మోగింది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు, భీమవరం, అదేవిధంగా ఎలమంచిలి, కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, తుని, నాతవరం, కోటనందూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రేబాక తరలివచ్చారు. అమ్మవారి దర్శన అనంతరం ఆలయ ప్రాంగణం లోనే చాలా మంది వంటలు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయాన్ని దర్శించుకున్న భక్తులందరికీ సౌభాగ్య ప్ర సాదంగా పసుపు కొమ్ములు, గాజులు పంపిణీ చేశారు. ప్రసాదాలను పంపిణీ చేశారు.

## పిల్లల గురించి తల్లిదండ్రులు గర్వంగా చెప్పుకోవాలి

### ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి, జూన్ 7, (ప్రభాత వార్త):**

తమ పిల్లలు ఉన్నత స్థాయిలో ఉన్నారని తల్లిదండ్రులు గర్వంగా చెప్పుకునే రోజులు రావాలని మాజీమంత్రి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆకాంక్షించారు. స్థానిక సత్య గ్రాండ్ ఏసీ కళ్యాణ్ మండపంలో ఆదివారం జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జరుగు పదవ తరగతి, ఇంటర్ మెరిట్ యాదవ విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు 2026 కార్యక్రమానికి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రతిభావంతుల పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ విద్యా పురస్కారాలు అందుకున్న విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి ప్రోత్సహిస్తున్న బాబురావు కి, రామారావు కి, యాదవ సంఘ పెద్దలకు,సంఘ సభ్యులకు, హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి దిగ్విజయంగా నడుస్తున్న కార్యక్రమానికి మంచి ఫలితాలు కనబడుతుందని, ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ విద్యార్థుల్ని ప్రోత్సహించడం వల్ల గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం విద్యార్థులు పెరిగారని ఉన్నారు. విద్యార్థులు అందరూ మంచి జ్ఞానాన్ని, పెద్ద చదువులు చదువుకొని జన్మనిచ్చిన తల్లిదండ్రులకి, ఊరికి, చదువు చెప్పిన గురువులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆకాంక్షించారు. చదువుకు మించిన ధనం లేదు, అది ఎప్పటికీ దొంగలించ లేనటువంటి ఆస్తి అన్నారు. ఈరోజు తల్లిదండ్రులు మా పిల్లలు ఇలా సాధించారని గర్వంగా చెప్పుకునే రోజులు వస్తున్నాయని అన్నారు. శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చేది చదువు ఒక్కటే అన్నారు. పిల్లలకి సమాజ నైతిక విలువలు నేర్పి, ఉమ్మడి కుటుంబ వ్యవస్థను అలవాటు చేయాలని, పిల్లల దినచర్యలను గమనిస్తూ సెల్ ఫోన్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేటట్లు చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్రం మెరుగైన విద్యార్థి వ్యవస్థను పటిష్టం చేస్తూ మెరుగైన ఉద్యోగ కల్పన దిశగా ముందుకు వెళుతుందని, ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా పరిశ్రమక రంగంలో, అత్యధిక ఉద్యోగ కల్పన కల్పించే దిశగా ఈ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని, పెద్ద పెద్ద మల్టీ నేషనల్ ఐటీ కంపెనీలు విశాఖలో స్థాపిస్తున్నారని, మెరుగైన ఐటీ ఉద్యోగాలు విశాఖలో లభించే అవకాశం దక్కుతుందని అన్నారు. వీటన్నిటిని సద్వినియోగ పరుచుకోవడానికి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని ఆశీర్వదించారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు భరణికాన సాయినాధరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు భరిణికాన రామారావు, భరణికాన నరసింహమూర్తి, కరక సోమినాయుడు, సబ్బి శ్రీనివాసరావు, పంచదారల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా ప్రారంభమైన యోగాంధ్ర-2026 సందడి



### ఈనెల 21 వరకు యోగా శిక్షణ

**(నక్కపల్లి, ప్రభాతవార్త)జూన్7:**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర–2026 కార్యక్రమాలను వాడవాడలా విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, ఎంపీడీవో కె.చలపతిరావు, వేంపాడు ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె. రఘు పిలుపునిచ్చారు. ఆదివారం నక్కపల్లి హైస్కూల్ క్రీడామైదానంలో ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులతో యోగా ప్రోటోకాల్ శిక్షణ ప్రారంభించారు. ఆయుష్ యోగా ఇనస్ట్రక్టర్ దవరశింగి రాంబాబు,తెలుగు పండిట్ ఎన్ వీ ఎస్ ఆచార్యులు ప్రోటోకాల్ యోగాసనాల పై శిక్షణనిచ్చారు. గ్రామ,వార్డులనుండి యోగాంధ్రపోర్టల్ ద్వారా అందరూ రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలన్నారు. ఈనెల 7 నుండి 21 వరకూ యోగా శిక్షణ,, పోటీలుంటాయన్నారు.వ్యక్తిగత ప్రదర్శనల విభాగంలో ఆసనాలు,ప్రాణాయామంపై పోటీలు ఉంటాయన్నారు .జూనియర్స్ ను10నుండి 18 సంవత్సరాల వయస్సుగాను, యువత విభాగంలో 19 నుండి 35 సంవత్సరాలుగా,సీనియర్స్ విభాగంలో 25 సంవత్సరాలు దాటినవారిని విభజించి మండల,జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈపోటీలలో పాల్గొనదలచినవారు ముందుగా యోగాంధ్ర పోర్టల్‌లో పేర్లు,వివరాలను నమోదుచేసుకోవా లన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు,జనసేన మండలశాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్, హెచ్.ఎమ్ వి.బాలాజీ, ,పలుపాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## నూకాంబిక భక్తులకు మజ్జిగ పంపిణీ

**అనకాపల్లి జూన్ 7 (ప్రభాత వార్త) :**




స్థానిక గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వీధిలో ఆదివారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాండ్రేగుల దుర్గాప్రసాదరావు చల్లని మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుండి 3 గంటలవరకు ఉచిత చల్లని మజ్జిగను ఆదివారం సంతకు వెళ్లే పల్లె జనానికి, నూకాలమ్మ గుడికి వెళ్ళే భక్తులకు పంపిణీ చేశారు. సుమారుగా 1500 మంది చల్లని మజ్జిగ స్వీకరించారు. కాండ్రేగుల టి. వి.జగదీష్, బుద్ధ నూకరాజు, పిళ్ళా శ్రీనివాస్ కాండ్రేగుల కుమారి పాల్గొన్నారు. ప్రతీ ఆదివారం ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నూకాంబిక కు మొక్కలు తీర్చుకున్న భక్తులు

**అనకాపల్లి , జూన్ 7 (ప్రభాత వార్త):**



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం లోవెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా చుట్టుపక్కల నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి ముక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు,కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై టిడిపి నాయకులకు అవగాహన






**(నక్కపల్లి/ఎస్. రాయవరం ,ప్రభాతవార్త)జూన్ 7:**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై నక్కపల్లి మంత్రి నివాసం వద్ద ఆదివారం టిడిపి నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఎ లు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ,నియోజకవర్గ ముఖ్య నాయకులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఓటర్ల జాబితాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి ఓటర్ల జాబితా కీలకమని, అందువల్ల ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. అలాగే పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ 'మై టీడీపీ' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రానున్న 45 రోజుల పాటు బి ఎల్ ఏలు, వి ఎల్ వో లతో సమన్వయంగా పనిచేస్తూ ఓటర్ల వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఈ నెల 14వ తేదీలోపు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, ఓటరు జాబితాపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణలో బి ఎల్ ఏ ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి టీడీపీ కార్యాలయం నుంచి వచ్చిన సురేష్ ఎస్ఐఆర్ కార్యక్రమం, బిఎల్ఎల బాధ్యతలపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ,మండల పార్టీ అధ్యక్షులు,నాయకులు గింజల లక్ష్మణరావు, అమలకంటి అబద్ధం ,చించలపు పద్దు, పెద్దిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి బుజ్జి ,విలియం కేరి, లింగం నాయుడు, దార్ల కృష్ణ, వైబోయిన వెంకటరమణ, కురందాసు నూకరాజు, యల్లవరహాలు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### జబర్దస్త్ నటుడు నాగరాజుకు

## 5000 రూపాయలు ఎంవిఆర్ ఆర్థిక సహాయం

**అనకాపల్లి ,జూన్ 7, (ప్రభాత వార్త):**



ప్రముఖ టీవీ కామెడీ షో 'జబర్దస్త్' ద్వారా గుర్తింపు తెచ్చుకున్న నటుడు నాగరాజ్ (జబర్దస్త్ నాగరాజు)కు ప్రముఖ వ్యాపారవేత్త, బీజేపీ నాయకులు ఎంవిఆర్ (ముత్యాలు వెంకటేశ్వర రావు) ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం నాగరాజు పట్టణంలోని నరసింగరావుపేటలో గల ఎం.వి.ఆర్ ప్రధాన కార్యాలయం నందు ఎం వి ఆర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నటుడు నాగరాజు తన కామెడీ టైమింగ్‌తో కార్యాలయంలో కాసేపు సందడి చేస్తూ, అక్కడ ఉన్నవారందరినీ ఎంతగానో ఎంటర్‌టైన్ చేశారు.నాగరాజు ప్రతిభను అభినందించిన ఎం వి ఆర్, ఆయన కళా రంగానికి , భవిష్యత్తు కార్యక్రమాలకు తన వంతు మద్దతుగా రూ. 5,000 (ఐదు వేల రూపాయలు) నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. కష్టాల్లో ఉన్న కళాకారులను ఆదుకోవడం, వారిని ప్రోత్సహించడం అభినందనీయమని,ఎం వి ఆర్ చూపిన ఈ ఉదారతపై నటుడు నాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాడి రైతు నేస్తం ఆడారి తులసీరావు

**పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన రాష్ట్ర హోంమంత్రి "అనిత".!**



**(యస్ .రాయవరం , ప్రభాతవార్త) జూన్ 7:**

ఉత్తరాంధ్ర తోపాటు కోస్తాంధ్ర జిల్లాల్లో ఉన్న పాడి రైతులకు స్నేహితుడు అంటూ ఎవరైనా ఉన్నారంటే అది అడారి తులసీరావు అని ఏ పాడి రైతు ని అడిగిన అదే చెబుతారని అటువంటి చరిత్ర పాడిరంగంలో సృష్టించారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.ఎస్. రాయవరం మండలం వేమగిరి గ్రామంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తోపాటు పాడి రైతులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతం చెబుతూ ఆత్మీయంగా ఆహ్వానించారు. పర్యటనలో భాగంగా ముందుగా హోంమంత్రి వేమగిరి గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాబార్డ్ నిధుల కింద రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన ధర్మవరం––ఎలమంచిలి ఆర్‌డబీ రహదారిని ప్రారంభించారు. అనంతరం విశాఖ డెయిరీ నిధులతో నిర్మించిన శ్రీ తులసి కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో మంచి మెజార్టీతో గెలుపొందానని తెలిపారు. ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచి, వెలుగులు నింపిన వ్యక్తి ఆడారి తులసిరావు అని కొనియాడారు. తనను సొంత కూతురిలా చూసుకునేవారని గుర్తు చేశారు. విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, పాయకరావుపేట నియోజకవర్గంలో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేమగిరి గ్రామంలో రూ.70 లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా రామాలయ అభివృద్ధికి రూ.40 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అడ్డురోడ్డు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత చేరువైందని పేర్కొన్నారు. ఇటీవల ఉపమాక ఆలయంలో జరిగిన చోరీ ఘటనలో రెండు రోజుల వ్యవధిలోనే పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి అన్ని కోణాల్లో రాత్రింబగళ్లు శ్రమించి నిందితులను పట్టుకున్న పోలీసులను ఈ సందర్భంగా డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాస్ తో పాటు సిఐ మురళి ,ఇతర సర్కిల్ ఎస్సైౖ, సిబ్బంది నీ ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కాకర దేవి,మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం , బిజెపి నాయకురాలు, ఎలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి,విశాఖ డైరీ విశాఖ డైరీ డైరెక్టర్, రెడ్డి రామకృష్ణ పిఎసిఎస్ అధ్యక్షులు నాగేశ్వరరావు నల్లల వెంకటరాజు తోపాటు విశాఖ డైరీ మేనేజర్, సిబ్బంది, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థి తల్లిదండ్రులను సత్కరించిన కొణతాల

**(నక్కపల్లి, ప్రభాతవార్త):**



మండలం డి ఎల్ పురం గ్రామానికి చెందిన గింజాల మేఘసందేశ్ కు పదవ తరగతి ఫలితాలలో 600 కి గాను 597 మార్కులు రావడం రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం పట్ల అనకాపల్లిలో ఆదివారం జిల్లా యాదవ సంఘం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా తండ్రి వెంకటరమణ ఘనంగా సత్కరించడంతో పాటు యాదవ సంఘం అందించిన ప్రతిభా అవార్డు అందజేశారు.కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు బర్నికాన బాబురావు, మాజీ శాసనసభ్యులు పీలా గోవిందు, బర్ని కాన రామారావు, దేవర సత్యనారాయణ, కురందాసు నూకరాజు, నక్కపల్లి ఫార్మర్ ప్రొడ్యూసింగ్ కంపెనీ సీఈవో గింజాల అప్పారావు, నక్కపల్లి మండల యాదవ సంఘం అధ్యక్షులు పాము సత్యనారాయణ, పాయకరావుపేట మండల అధ్యక్షులు తాటిపర్తి కాసులు, యాదవ సంఘం కుటుంబ సభ్యులందరూ తదితరులు పాల్గొన్నారు.

## ఆడారి తులసిరావుకు ఘనంగా నివాళులు



**(నక్కపల్లి/ ఎస్. రాయవరం, ప్రభాతవార్త ):**

పాడి రైతుల ఆశాజ్యోతి స్వర్గీయ ఆడారి తులసిరావు చిత్రపటానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్. రాయవరం మండలం వేమగిరి గ్రామంలో డైరీ నిధులతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన సందర్భంగా చైర్మన్ అడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పిల్లా రమా కుమారి, డైరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ ల నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడున్న చిన్నారులతో హోంమంత్రి అనిత ముచ్చటించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులతో పాటు టిడిపి మండల శాఖ అధ్యక్షులు అమల కంటి అబద్ధం, పార్టీ నాయకులు నల్లల వెంకటరాజు ,నాగేశ్వరరావు డైరీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ కీ బోర్డు ప్లే చేయడంలో గిన్నిస్ రికార్డ్ సాధించిన అభిషేక్ రాజన్

**పాయకరావుపేట రూరల్, జూన్ 7, ప్రభాత వార్త :**




ఎలక్ట్రికల్ కీ బోర్డు ప్లే చేయడంలో పాయకరావుపేటకు ఇందిర కాలనీకి చెందిన ఆలపు అభిషేక్ రాజన్ గిన్నిస్ రికార్డు సాధించారు. పట్టణంలోని కనోస్సా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న అభిషేక్ రాజన్ చిన్న వయస్సులోనే ఈ ఘనత సాధించి అభినందనలు, మన్ననలు అందుకుంటున్నాడు. హైదరాబాద్ లో 2026, ఫిబ్రవరి 6 న గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన రెండు వేల మంది ఎలక్ట్రికల్ కీ బోర్డు వాయిద్యకారులు పాల్గొన్నారు. గంటపాటు కీ బోర్డు ఆగకుండా వాయిస్తూ ప్రతిభ కనబరచిన 777 మంది విద్యార్థులను గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు ఎంపిక చేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించిన సందర్భంగా అభిషేక్ రాజన్ ను జూన్ 6, 2026 న విశాఖపట్నం, పెందుర్తి ఇండియన్ పెంతుకోస్ట్ చర్చిలో జరిగిన ఒక కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు అగస్టిన్ దండంగి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. అభిషేక్ రాజన్ తండ్రి ఆలపు నూకరాజు అలియాస్ విజయ్ విశాఖపట్నం జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. తల్లి అమ్మాణి జ్యోతి గృహిణి. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన అభిషేక్ రాజన్ ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, సహచర విద్యార్థినీ, విద్యార్థులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

8-6Pg7exHMNWJQE.qxd:8-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:50 AM Page 1



# ఇంద్రకీలాద్రిపై వైభవంగా యోగాంధ్ర



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



చింతకాయల విజయ్‌కు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జూన్ 7, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో యోగాంధ్ర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఉత్తర్వుల ప్రకారం ప్రారంభించిన ఈ ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం ప్రముఖ యోగా అధ్యాపకులు గర్రె రాజేష్ ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బంది, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు నిలయాలైన దేవాలయాలకు, మనస్సును ప్రశాంత పరిచే యోగాధ్యయనానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీనిని విజయవంతం చేయాలని చైర్మన్ కోరారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పెనుమత్స రాఘవరాజు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులందరికీ దేవస్థానం తరపున ఉచిత ప్రసాదాలు, మంచినీరు పంపిణీ చేశారు.

**వేదోక్తంగా సూర్యోపాసన సేవ :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం ఉదయము సూర్యోపాసన సేవ అత్యంత వైభవంగా నిర్వహించబడింది. లోక క్షేమ కల్యాణార్థం రంగులతో ఆదిత్య మండల యంత్రం ముగ్గు వేసి సూర్యనమస్కారములతో ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా అరుణ మహాసౌర పారాయణలు ఆదిత్య హృదయం అష్టోత్తర శతనామావళితో మంగళవాయిద్యముల నడుమ సూర్య భగవానుడికి గోదుమ పాయసం నివేదించి భక్తులకు ప్రసాద పంపిణి వేదాశీర్వాదం చేశారు. సూర్యోపాసన అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సూర్యోపాసన వంటి ఆర్జిత సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు యందు డబ్లుడబ్లుడబ్లు. కనకదుర్గమ్మ. ఓఆర్‌జి వెబ్‌సైట్ ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని ఇఒ తెలిపారు.

**ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్త జనం**

ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వేసవి సెలవులు, ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు డీఈఓ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పర్యవేక్షణలో ఆలయ ఏఈవోలు చంద్రశేఖర్ ,వెంకటరెడ్డి ,రమేష్ క్యూలైన్ల పర్యవేక్షణ చేయగా భక్తులకు కావలసిన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు.

**దుర్గమ్మవారి సేవలో రాజ్యసభ ఎంపి అభ్యర్థి:** దుర్గమ్మవారిని రాజ్యసభ ఎంపి అభ్యర్థి చింతకాయల విజయ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, అమ్మ వారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు మరియు చిత్రపటాన్ని బహుకరించారు.

**విరాళాలు:**

విశాఖపట్నంకు చెందిన ఏ బిజీ అమిత్ రెడ్డి, భవ్య ఆదివారం రూ.1,00,000 విరాళాన్ని నిత్య అన్నదాన పథకంకు అందించారు. విజయవాడకు చెందిన సోలా దుర్గారావు దంపతులు రు.2లక్షలను నిత్యాన్నదాన పథకానికి విరాళంగా అందించారు. విజయవాడకు చెందిన జె దేవీ సుప్రజా దంపతులు రు.1లక్ష విరాళం నిత్యాన్నదాన పథకానికి విరాళమందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



## ఓటర్ల జాబితా సవరణపై అవగాహన సదస్సు

### కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

**కావలి, (నెల్లూరు), జూన్ 7, ప్రభాతవార్త :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజల్లో, పార్టీ నాయకుల్లో అవగాహన పెంపొందించేందుకు ఆదివారం స్తానిక దొడ్ల మనోహర్‌రెడ్డి, నారాయణ కళ్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు జయంతిబాబు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ముందుగా నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ సందర్బంగా ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా తీసుకవాల్సిన చర్యలు, తప్పుల సవరణ చిరునామా మార్పులు వంటి అంశాలపై నాయకులకు వివరణ ఇచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని నాయకులకు సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఓటుహక్కు ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పట్టణ, మండలపార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, టిడిపి నాయకులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ క్లస్టర్లు, వార్డు, గ్రామ పంచాయితీ అధ్యక్షులు,సెక్రటరీలు టిడిపినాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ఎపిఎఐఎంఎస్ 2.0 దోహదం

### రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువుల పంపిణీ

### కౌలు రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు కృత్రిమ కొరత, మళ్లింపులను అరికట్టేందుకు విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలి



### జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రూపొందించిన ఏపీఎఐఎంఎస్ 2.0 వ్యవస్థను విజయవంతంగా అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఎరువుల పంపిణీని ఎపిఎఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా అమలు చేసే అంశంపై ఆదివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కొత్త విధానం అమలుతో కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి జిల్లా, క్షేత్రస్థాయిలో విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కృత్రిమ డిమాండ్, ఎరువుల మళ్లింపు, రైతుల్లో అనవసర ఆందోళనలను అరికట్టాలని ఆదేశించారు. వివిధ పంటలకు అవసరమైన ఎరువుల వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పంటల సరళి, అంచనా డిమాండ్ ఆధారంగా మండల స్థాయిలో ముందస్తుగా ఎరువుల నిల్వలు ఉంచాలని సూచించారు. గత ఏడాది ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృష్ణ, కాకినాడ జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద కేంద్ర ప్రభుత్వం తయారు చేసినటువంటి ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని, మిగతా 26 జిల్లాల్లో ఎపిఎఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు జరుగుతుందని వెల్లడించారు. ఎరువుల పంపిణీ ప్రక్రియకు ఆటంకం కలిగించేలా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

సిఎం కార్యదర్శి రాజమౌళి మాట్లాడుతూ ఎరువుల మళ్లింపును అరికట్టేందుకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ విశ్లేషణాత్మక నివేదికలు సమర్పించాలని, రైతుల సమస్యల పరిష్కారానికి రియల్‌టైమ్ గ్రీవెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల మధ్య ఉత్తమ విధానాలను పంచుకుంటూ సమస్యల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎపిఎఐఎంఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి రైతులకు పారదర్శక, వేగవంతమైన ఎరువుల పంపిణీని నిర్ధారించాలని అన్ని జిల్లాల అధికారులకు సమావేశం ముగింపులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీ ఏపీఎఐఎంఎస్ 2.0 అభివృద్ధి పురోగతి, జిల్లాల సన్నద్ధతపై వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు (ఆర్ఎస్‌కెలు) లాగిన్ వివరాలు అందజేసినట్లు తెలిపారు. ఖరీఫ్2025 ఈక్రాప్ బుకింగ్ పరిధిలో ఉన్న రైతుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఎరువుల రిటైలర్లు, పిఎసిఎస్‌లను ఎపిఎఐఎంఎస్ 2.0లో నమోదు చేసి సంబంధిత రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేసినట్లు తెలిపారు. అన్ని వర్గాల రైతులు తమకు సమీపంలోని గుర్తింపు పొందిన రిటైలర్ల ద్వారా ఎరువులను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన సాధారణ ఎరువుల సిఫార్సుల ఆధారంగానే ఎరువుల కేటాయింపు జరుగుతుందని చెప్పారు.

## నిమ్స్ డైరెక్టర్‌గా డాక్టర్ రాహుల్ దేవరాజ్



డాక్టర్ రాహుల్ దేవరాజ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ నగరి బీరప్ప

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 7, ప్రభాతవార్త:** నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన డైరెక్టర్‌గా డాక్టర్ రాహుల్ దేవరాజ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న డాక్టర్ నగరి బీరప్ప మూడేళ్ల పదవీ కాలం ముగియడంతో డాక్టర్ రాహుల్ దేవరాజ్‌ను డైరెక్టర్‌గా నియమిస్తూ ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చోంగ్తు ఆదేశాలు జారీ చేశారు. పాల మూరు ప్రాంతానికి చెందిన ఆయన మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. డాక్టర్ రాహుల్ దేవరాజ్ నిమ్స్‌లో యూరాలజీ విభాగాధిపతిగా ఉన్నారు. కిడ్నీ మార్పిడిలో చికిత్సలలో ఆయన ప్రత్యేక నిపుణుడు. నిమ్స్ ఆసుపత్రిలో ఇప్పటివరకు జరిగిన దాదాపు 2వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో ఆయన ఆద్వర్యంలోని వైద్య బృందం ఎంతో కీలక పాత్ర పోషించింది. దీనికితోడు ప్రభుత్వ రంగంలో దక్షిణాదిలో మొదటి రోబోటిక్ కిడ్నీ మార్పిడి చేసిన వైద్యుడిగా గుర్తింపు సాధించారు. నిమ్స్‌లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న క్రమంలో నిమ్స్ సమస్యలు, పరిష్కారాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టే అవకాశం ఉంది.

# మృగశిర కార్తె ప్రారంభవేళ.. చేప మందు పంపిణి

### నేడు హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో

### రాత్రి 9 గంటలకు ప్రారంభం

### దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన ఆస్తమా రోగులు

**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 7, ప్రభాతవార్త:** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం కోసం వచ్చే అస్తమా రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగు కుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.మృగ శిర కార్తె మారడంతో చేప ప్రసాదం పంపిణి చేసే బత్తిని సోదరులు ఆస్తమా రోగులకు ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేసిన శిబిరంలో ఆస్తమా రోగులకు ఈ నెల 8వ తేదిన రాత్రి 9గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కలిసి చేప ప్రసాదాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు.ప్రతి యేటా మృగశిర కార్తె జూన్8వ తేదిన ప్రారంభ మవుతుందని వివిధ రాష్ట్రాల నుంచి ఆస్తమా రోగులు చేప ప్రసాదం కోసం తరలి రావడం కనిపించింది.రాత్రి 9గంటలకు ప్రారంభించి 9వ తేది రాత్రి 9గంటలకు వరకు చేప ప్రసాదం కొనసా గుతుందని బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్‌గౌడ్ తెలిపారు.

ప్రతి యేటా మాదిరిగానే ఈసారి కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 8, 9 తేదిల్లో జరుగనున్న చేప ప్రసాదం పంపిణికి ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు.భారత దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజలందరూ(ఆస్తమారోగులు)తమ వంతు వచ్చే వరకు క్యూలైన్లలో వేచి ఉండి ప్రశాంతంగా ప్రసాదం స్వీకరించి సురక్షితంగా తిరిగి వెళ్లే విధంగా వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులతో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సమీక్షించారు. పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బి. వాటర్ వర్క్స్, మత్స్య, సమాచార, విద్యుత్, వైద్య, జిహెచ్ ఎంసి, అగ్నిమాపక, జలమండలి, ట్రాఫిక్ తదితర శాఖల సమన్వయంతో రోగులకు ఎటువంటి ఇబ్బంది అసౌకర్యం కలుగ కుండా అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు.ముఖ్యంగా పరిసి థతులను ఎప్పటికప్పుడు బేరీజ్ వేస్తూ తగు చర్యలు తీసుకునేందుకు ప్రజలకు తగు సూచనలు అందించేందుకు వీలుగా పోలీసు సమాచార, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కూడిన కంట్రోల్ రూంను ఏర్పాట్లు చేశారు. ఇందులో తెలుగు,హిందీ,ఉర్దూ తదితరభాషలో ప్రజలకు సూచనలు ఇచ్చేందుకు అనౌన్సర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే బ్యారి కేడింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సూచికలు, మంచినీరు, షెడ్లు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లు పూర్తి చేశారు.రోగులకు అత్యవసర పరిస్థితుల్లో చికిత్సలు అందించడానికి వీలుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆద్వర్యంలో ఆరోగ్య శిభిరాలు 4, అంబులెన్స్4, సర్వీసులు,కూడా సిద్దం చేశారు. మత్స్య శాఖ ద్వారా ఇప్పటికే లక్షకు పైగా చేపపిల్లలు సిద్దం చేశారని,34 టోకెన్ కౌంటర్లు,34 చేప పిల్లల కౌంటర్లు ఏర్పాటు చేశారు. తెలిపారు.జలమండలి ద్వారా మంచి నీటి ట్యాంకర్లు త్రాగునీటి ప్యాకెట్లు సిద్దం చేసినట్లు చేశారు.

**75 చోట్ల సిసి కెమోరాలు ఏర్పాట్లు**



నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో జరిగే చేపప్రసాదాన్ని తిలకిచేందుకుగాను సమాచారశాఖ తో పాటు పోలీసులు విభాగం ఎగ్జిబిషన్ మైదానంలో ప్రతి కదలికను తెలుసుకు నేందుకు గాను 75సిసి కెమెరాలు ఏర్పాట్లు చేశారు.చేప ప్రసాదం ముగిసే వరకు కొన సాగుతుంది. చేప ప్రసాదం కోసం వాహనాదారుల కోస ం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.అఫ్జల్‌గంజ్‌వైపునుంచి వచ్చే వాహనాలను ఎంజె మార్కెట్ చౌరస్తానుంచి అబిడ్స్‌వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు.అదే విధంగా నాంపల్లివైపునుంచి గాంధీభవన్ వైపు వచ్చే వాహనాలను బషీర్‌బాగ్ జగ్జీజీవన్ రాం విగ్రహం నుంచి అబిడ్స్‌వైపు మళ్లించనున్నట్లు వివరించారు.అదేవిధంగా ఎక్‌మినార్ వైపు ట్రాఫిక్ రద్దీని బట్టి తగ్గిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చేపప్రసాదం కోసం వచ్చేవారు తమ వాహనాలను ఇందిరా ప్రియదర్శిని జూనియర్ కళాశాల,గగహన్ వివహార్,గృహ కాంప్లెక్స్,గాంధీభవన్ టిఎన్‌జి భవన్ ముందు పార్కింగ్ చేసుకో వచ్చునన్నారు. చేప ప్రసాదం కోసం విధులకు వచ్చే అధికారులు తమ వాహనాలను భీమ్‌రాంబాడాలో పారి ్కంగ్ చేసుకోవాలన్నారు.

**34 కేంద్రాల ద్వారా ప్రసాదం టోకెన్‌ల పంపిణి**

ఎగ్జిబిషన్ గ్రౌండ్ అజంతా గేట్ వద్ద ఏర్పాటు చేసిన 34 భారీ కేడ్‌లలోవెళ్లే ఆస్తమా రోగులు అర కిలో మీటర్ తరువాత గాంధీదర్శన్ ముందు 34 కేంద్రాల ద్వారా ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన చేప ప్రసాద టోకెన్‌లను కౌంటర్‌లలో తీసుకు వలసి ఉంటుంది. ఈ ప్రాంతంలో ఎలాంటి తొక్కిసలాటకు తావులేకుండా అన్ని విభాగాల అధికారులు ఏర్పాట్లు చేశారు.50 రూపాయలు చెల్లించి టోకెన్ తీసుకున్న తరువాత నేరుగా భారీ కేడ్‌ల వెంబడి మరో అరకిలోమీటర్ వెళ్లి ఆస్తమా రోగులు కమలా నెహ్రూపాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో చేపపిల్లలను తీసుకుని కొద్ది దూరంలో చేపప్రసాదాన్ని స్వీకరించాల్సి ఉంటుంది.అక్కడే నేరుగా చేపిల్లల ద్వారా ప్రసాదాన్ని అందించే బత్తిని సోదరులు ఉచితంగా కార్తె ప్రసాదాన్ని అందచేస్తారు.

## ప్రతి రోజూ 5 నిమిషాలు యోగా, మెడిటేషన్

### నిరంతరం గేమ్స్, స్పోర్ట్స్ నిర్వహించాలి ఏప్రిల్ 23, 2027 చివరి పనిదినం, 227 పనిదినాలతో 2026-27, అకడమిక్ క్యాలెండర్ విడుదల

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రతి రోజూ పాఠశాలలో 5 నిమిషాలపాటు యోగా, మెడిటేషన్‌ను చేయించాలని, ఉదయం ప్రార్థనా సమయంలో గానీ లేదంటే క్లాస్ రూమ్‌లో గానీ అమలు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది. అలాగే ప్రతి రోజూ గేమ్స్, స్పోర్ట్స్ ను నిర్వహించాలని నిర్ణయించింది. 227 రోజులతో 2026-27 విద్యా సంవత్సరం కొనసాగనుంది. జూన్ 15న ప్రారంభమయ్యే నూతన విద్యా సంవత్సరం ఏప్రిల్ 24, 2027తో ముగియనుంది. 51 రోజుల వేసవి సెలవుల అనంతరం జూన్ 14, 2027లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన 2026-27 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌ను విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేశారు. 10వ తరగతి విద్యార్థులకు జనవరి 10లోపు సిలబస్‌ను పూర్తి చేయాలని, 1 నుంచి 9 తరగతులకు ఫిబ్రవరి 28 లోగా సిలబస్ పూర్తి చేయాలంది. దసరా సెలవులు అక్టోబర్ 10 నుంచి 22 వరకు 13 రోజులపాటు కొనసాగనున్నాయి. సంక్రాంతి సెలవులు జనవరి 13 నుంచి 17 వరకు 5 రోజులుంటాయని తెలిపింది. ఏప్రిల్ 23, 2027 చివరి పనిదినంగా, ఏప్రిల్ 24 నుంచి జూన్ 13, 2027 వరకు సమ్మర్ హాలిడేస్ ఉంటాయని అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొంది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)-1ను జూలై 31 లోపు, ఎఫ్ఏ-2ను సెప్టెంబర్ 21 లోపు, సమ్మేటీవ్-1 పరీక్షలను అక్టోబర్ 1 నుంచి 9 వరకు, ఎఫ్ఏ-3ను డిసెంబర్ 10 లోపు, ఎఫ్ఏ-4ను 10వ తరగతి వారికి జనవరి 27 లోపు, 1 నుంచి 9వ తరగతుల వారికి ఫిబ్రవరి 15 లోపు నిర్వహించాలి. 10వ తరగతి ప్రీఫైనల్ పరీక్షలను ఫిబ్రవరి 28 లోపు నిర్వహించాలని ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలను మార్చి 2027లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఎస్ఏ-2 పరీక్షలను 1 నుంచి 9వ తరగతుల వారికి ఏప్రిల్ 9 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు. దసరా సెలవులు అక్టోబర్ 10 నుంచి 22 వరకు, క్రిస్మస్ సెలవులు మిషనరీ పాఠశాలలకు డిసెంబర్ 23 నుంచి 27 వరకు, సంక్రాంతి సెలవులు జనవరి 13 నుంచి 17 వరకు ఉంటాయని ప్రకటించింది. జూన్‌లో 14 రోజులు, జులైలో 26, ఆగస్టులో 22, సెప్టెంబర్‌లో 23, అక్టోబర్‌లో 15, నవంబర్‌లో 23, డిసెంబర్‌లో 24, జనవరిలో 20, ఫిబ్రవరిలో 23, మార్చిలో 21, ఏప్రిల్‌లో 16 రోజులు కలిపి మొత్తం 227 పనిదినాలతో 2026-27 విద్యా సంవత్సర అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించారు. ప్రతి మూడో శనివారాన్ని నో బ్యాగ్ డేగా అమలు చేయాలని నిర్ణయించారు. 10 మూడో శనివారాలను అమలు చేయా లని సూచించారు. ప్రతి రోజూ 30 నిమిషాలు పఠనానికి కేటాయించాలి. అందులో పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాలు, వార్తాపత్రిక, మ్యాగజైన్ మొదలైనవి చదివించాలి. దీనిని ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ స్వయంగా పర్యవేక్షించాలి.

# ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం కేపిటల్‌గా హైదరాబాద్

### ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ విదేశీయులకు వైద్యసేవలు ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం కాపి టల్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా.. ప్రభుత్వ హాస్పి టల్స్ లోనూ విదేశీయులకు వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకుప్రభుత్వ హాస్పి టల్స్ లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజాన్ని ప్రోత్స హించేందుకు అవసరమైన చర్యలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి. గౌతమి, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బీరప్పలను నియమించింది.

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం అమలుకు సంబంధించిన వివిధ అంశాలను కమిటీ పరిశీలించనుంది.

సనత్‌నగర్ టిమ్స్‌లో ప్రత్యేక ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం బ్లాక్ ఏర్పాటుపై అధ్యయనం చేయడంతోపాటు, విదేశీ రోగులకు అందించే వైద్య సేవలు, వాటికి తగిన ప్యాకేజీలు, ధరల విధానాన్ని సూచించనుంది. భాషా అనువాద సేవలు, పేషెంట్లకు అందించే ఆహారం తదితర అంశాలపై కమిటీ సిఫార్సులు చేయనుంది. తెలంగాణ మెడికల్ అండ్ వెల్‌నెస్ టూరిజం ప్రమోషన్ బోర్డుతో సమన్వయం చేస్తూ ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం అభివృద్ధికి అవసరమైన ప్రచార, మార్కెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై కూడా కమిటీ సూచనలు చేయనుంది. నెలరోజుల్లో కమిటీ తన నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## డిస్కం ఏర్పాటు విప్లవాత్మక నిర్ణయం

### తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** వ్యవసాయం తదితర ఉచిత పథకాల కోసం ప్రత్యేకంగా విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేయడం విప్లవాత్మక నిర్ణయమని రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్ ఎం కోదండరెడ్డి తెలిపారు. అయితే మోటార్లకు మీటర్లు బిగించబోతుందనేది ప్రతిపక్షాల అపోహ మాత్రమేనన్నారు. రైతుల సమస్యలను రాజకీయం చేయడం సరైందికాదని ప్రతిప క్షాలను కోరారు. హైదరాబాద్‌లోని బీఆర్‌భవన్‌లో రైతు కమిషన్ రూపొందించిన పంటల మార్పిడి నివేదికను ఆయన విడుదల చేసి మాట్లాడారు. అన్ని పంటలకు మద్దతు నిర్ణయించడం, వాటిని కొనడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతన్నారు.

## తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు

### 15న పాఠశాలలు పునఃప్రారంభం

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు మరో మూడు రోజు లు పొడిగింపబడ్డాయి. 2026-27 విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభం కావల్సి ఉన్నందున .. ప్రభుత్వానికి అందిన విజ్ఞ ప్తుల మేరకు పాఠశాలలను ఈ నెల 12 నుంచి కాకుండా ఈ నెల 15 నుంచి పునః ప్రారంభిం చాలని నిర్ణయించినట్టు పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం, పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని పాఠశాలలు వేసవి సెలవుల తర్వాత ఈ నెల 12న తిరిగి ప్రారంభం కావాల్సి ఉంది. పాఠశాలల పునః ప్రారంభ తేదీని పునః పరిశీలించమని కోరుతూ వివిధ భాగస్వాముల నుండి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు అందాయి. ఈ నెల 13 రెండోవ శనివారం, 14 ఆదివారం వస్తున్నందున, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఈ నెల12కు బదులుగా ఈ నెల 1న తిరిగి తెరవాలని నిర్ణ యించనట్టు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం వాయిదా పడటం వలన కోల్పోయిన విద్యా సమయాన్ని భర్తీ చేయడానికి 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం నిర్దేశించిన బోధనా దినాలను ఖచ్చితంగా పాటించేలా చూసేందుకు, పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు జుల నెలో రెండవ శనివారం అయిన (11.07.2026)ను సాధారణ పనిదినంగా పరిగణించాలని నిర్ణయించినట్టు డైరెక్టర్ ప్రకటిం చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని శాఖాధి పతులు, హైదరాబాద్, వరంగల్ పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాధికారులందరూ తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు. రాష్ట్రంలో 24,672 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. సుమారు 11వేల వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి.

8-6Pg8.qxd:8-6Pg8.qxd 1/1/02 6:51 AM Page 1



# 39 మంది భార్యలు.. 94 మంది సంతానం

• ప్రపంచం దృష్టిని ఆకర్షించిన జియోచానా



**ఐజ్వాల్, జూన్ 7:** చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్న నినాదానికి భిన్నంగా ఒకే గూటి కింద సుమారు 200 మంది సభ్యులు కలిసి జీవిస్తున్న కుటుంబం ఇపుడు వార్తల్లోకి ఎక్కింది. ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో 39 మంది భార్యలు, 94 మంది సంతానంతో ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబానికి యజమానిగా గుర్తింపు పొందిన జియోనా చానా 2021లో కన్నుమూసినప్పటికీ, ఆయన వారసత్వం నేటికీ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆ కుటుంబ సభ్యులందరూ ఇప్పటికీ అదే నివాసంలో అత్యంత సమన్వయంతో, ఐకమత్యంతో మెలుగుతున్నారు. మిజోరంలోని బక్తావంగ్ గ్రామంలో ఉన్న ఛువాన్ థార్ రన్ అనే నాలుగు అంతస్తుల భారీ భవనంలో ఈ మొత్తం కుటుంబం నివసిస్తోంది. సుమారు 100 గదులతో కూడిన ఈ భవంతిలో ఆ కుటుంబం నివసిస్తోంది. 1945లో జన్మించిన జియోనా చానా, బహుభార్యత్వాన్ని ఆచరించే ఒక ప్రత్యేక క్రైస్తవ మత శాఖకు నేతృత్వం వహించారు. తన 17వ ఏట తొలి వివాహం చేసుకున్న ఆయన, జీవితంలో మొత్తం 39 మందిని వివాహమాడారు. ఈ కుటుంబ యొక్క దైనందిన కార్యకలాపాలు ఒక సైనిక పటాలం తరహాలో అత్యంత క్రమశిక్షణతో సాగుతాయి. సభ్యులందరూ బాధ్యతలను సమానంగా పంచుకుంటారు. వీరి వంటశాల సైతం భారీ పరిమాణంలో ఉంటుంది. ఇక్కడ నిత్యం 45 నుంచి 90 కిలోల బియ్యంతో పాటు, భారీ మొత్తంలో కూరగాయలు, పప్పు దినుసులను వండుతారు. జియోనా భార్యలు వంతులవారీగా వంట బాధ్యతలు నిర్వర్తించగా, మిగిలిన వారు వ్యవసాయం, ఇతర వృత్తి పనుల్లో నిమగ్నమవుతారు. జియోనా చానా తన గ్రామంలో వ్యవసాయం, పశుపోషణ, వడ్రంగి వంటి వృత్తులను ప్రోత్సహిస్తూ స్వయం సమృద్ధికి బాటలు వేశారు. ఈ కుటుంబం అనుసరిస్తున్న విశిష్ట జీవనశైలి అంతర్జాతీయ మీడియా దృష్టిని సైతం ఆకట్టుకుంది. ఈ అరుదైన జీవన విధానం వల్ల ప్రఖ్యాత రిప్లీస్ బిలీవ్ ఇట్ ఆర్ నాట్ పుస్తకంలోనూ వీరికి చోటు దక్కింది. జియోనా చానా 2021 జూన్ 13న తన 76వ ఏట కన్నుమూశారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, కుటుంబ సభ్యులు నేటికీ అదే ఐక్యతను, క్రమశిక్షణను చాటుతూ జీవిస్తుండటం గమనార్హం.



# కోట్లకు పడగలెత్తిన ఇంజినీర్

## లెక్కలేనన్ని ఆదాయానికి మించిన ఆస్తులు

**భువనేశ్వర్, జూన్ 7:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఒడిశాలో ఒక ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇళ్లపై జరిగిన విజిలెన్స్ దాడులు సంచలనం సృష్టిస్తున్నాయి. కంధమాల్ జిల్లా బాలిగూడలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లో పనిచేస్తున్న వైకుంఠ నాథ్ బెహెరా ఇళ్లు, కార్యాలయాలపై ఒడిశా విజిలెన్స్ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులతో పాటు భారీగా నగదు లభించాయి. బెహెరా 1999లో కేవలం రూ. 6,000 నెలసరి వేతనంతో జూనియర్ ఇంజనీర్‌గా ప్రభుత్వ సర్వీసులో చేరారు. విధి నిర్వహణలో పదోన్నతులు పొందుతూ ఇటీవల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన నెలకు సుమారు రూ. 80 వేల జీతం పొందుతున్నారు. అయితే, ఈ 27 ఏళ్ల సర్వీసులో ఆయన సంపాదించిన అధికారిక ఆదాయానికి, ప్రస్తుతం బయటపడ్డ ఆస్తులకు ఎక్కడా పొంతన లేకపోవడంతో అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భువనేశ్వర్‌లోని ప్రత్యేక విజిలెన్స్ కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా భువనేశ్వర్, బాలాసోర్, జాజ్‌పూర్, బాలిగూడ సహా మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. అధికారులు బెహెరా, ఆయన భార్య పేరిట ఉన్న బ్యాంక్ లాకర్ల నుంచి దాదాపు రూ. 2.04 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదును లెక్కించడానికి ప్రత్యేకంగా కౌంటింగ్ మిషన్లను ఉపయోగించాల్సి వచ్చింది. దాంతో పాటు దాదాపు 341 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 45 లక్షలకు పైగా బ్యాంక్ డిపాజిట్లను గుర్తించారు. భవనాలు, స్థలాల విషయానికి వస్తే భువనేశ్వర్‌లోని ప్రముఖ ప్రాంతాలలో సుమారు 17వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న 5 బహుళ అంతస్తుల విలాసవంతమైన భవనాలు బయటపడ్డాయి. అలాగే భువనేశ్వర్, జాజ్‌పూర్, బరిపద ప్రాంతాలలో దాదాపు 13 నుంచి 14 ఖరీదైన ప్లాట్లను అధికారులు గుర్తించారు.

# న్యాయపోరాటంలో సుకన్యకు భారీ ఊరట

**రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని సన్‌టివి నెట్‌వర్క్‌కు హైకోర్టు ఆదేశం**

**చెన్నై, జూన్ 7:** మూడు దశాబ్దాల సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత ప్రముఖ నటి సుకన్యకు ఊరట లభించింది. తన పరువుకు నష్టం కలిగించేలా గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌తో చేసిన ఇంటర్వ్యూను ప్రసారం చేసిందన్న కేసులో సన్ టీవీ నెట్‌వర్క్‌కు మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. సుకన్యకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. 1996 ఏప్రిల్ 17న సన్ టీవీలో ప్రసారమైన నేరుక్కు నేర్ అనే కార్యక్రమంలో ఈ వివాదం మొదలైంది. తమిళ పత్రిక నక్కీరన్ ఎడిటర్ ఆర్.ఆర్. గోపాల్ వీరప్పన్‌ను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా వీరప్పన్ నటి సుకన్యకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమారుడితో అక్రమ సంబంధం ఉందని నిరాధార ఆరోపణలు చేశాడు. 1996 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సుకన్యకు సంబంధించిన కొన్ని వీడియోలను ఉపయోగించుకున్నారని కూడా వ్యాఖ్యానించాడు. వీరప్పన్ చేసిన ఈ వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, ఇవి సమాజంలో తన గౌరవానికి, కీర్తి ప్రతిష్ఠలకు తీవ్ర నష్టం కలిగించాయని సుకన్య కోర్టును ఆశ్రయించారు. ఈ ఆరోపణలు తనను మానసికంగా కుంగదీశాయని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సుదీర్ఘ విచారణ అనంతరం 2015లో ట్రయల్ కోర్టు సుకన్యకు అనుకూలంగా తీర్పు ఇచ్చి, రూ.10,00,500 నష్టపరిహారం చెల్లించాలని సన్ టీవీని ఆదేశించింది. దీనిపై సన్ టీవీ నెట్‌వర్క్ మద్రాస్ హైకోర్టులో అప్పీల్ చేసింది. తాజాగా ఈ అప్పీల్‌ను విచారించిన జస్టిస్ కె. కుమరేశ్ బాబు నేతృత్వంలోని ధర్మాసనం, సన్ టీవీ వాదనలను తోసిపుచ్చింది. ఇంటర్వ్యూను ప్రసారం చేసే ముందు దానిలోని అభ్యంతరకర, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలను ధ్రువీకరించుకోవడంలో, వాటిని తొలగించడంలో బ్రాడ్‌కాస్టర్ విఫలమైందని కోర్టు స్పష్టం చేసింది. కార్యక్రమంపై పూర్తి ఎడిటోరియల్ నియంత్రణ ఉన్నప్పటికీ, వివాదాస్పద కంటెంట్‌ను ఎడిట్ చేయకుండా ప్రసారం చేయడం తప్పేనని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో దిగువ కోర్టు తీర్పును సమర్థిస్తూ, సుకన్యకు నష్టపరిహారం చెల్లించాలని తుది తీర్పు వెలువరించింది. సుకన్య 1980, 90వ దశకాల్లో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి, దక్షిణాది సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

# ఇండియా కూటమి భేటీపై నీలినీడలు

• డిఎంకె, ఆప్ పార్టీలు దూరం • నేడు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియాకూటమి నేతల భేటీ!



**న్యూఢిల్లీ, జూన్ 7:** ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇండియా కూటమిలోని పార్టీలకు షాక్‌లు తగులుతున్న సంగతి తెలిసిందే. ప్రత్యేకించి పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీపార్టీ టిఎంసీ ఘోరపరాజయం ఆపార్టీకి పెద్దషాక్ అనే చెప్పాలి ఈ క్రమంలో సోమవారం ఢిల్లీలో జరగనున్న ఇండియా కూటమి పార్టీల సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. తమ కూటమి ఇప్పటికీ శక్తివంతంగానే ఉందని, సమిష్టిగానే ఉందన్న సంకేతాలను పంపించేందుకు గాను ఇండియా కూటమినేతలు ఈ భేటీని ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 23 పార్టీలు సోమవారం ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశానికి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి, ఎంపి కెసి వేణుగోపాల్ స్పష్టం చేసారు. భారత్‌లాగే తమ ఇండియా జన్‌బంధన్ కూడా సమిష్టిగా సమైక్యంగా కొనసాగుతుందని కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. ఈ కీలక సమావేశానికి డిఎంకె హాజరుకాకూడదని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ తమకు ద్రోహంచేసిందని ఆపార్టీ ఇండియా నుంచే వైదొలగాలని నిర్ణయించుకుంది. అలాగే కేరళలో బిజెపితో వామపక్షాలు కుమ్మక్కయ్యాయన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలపై సిపిఎంకూడా అసంతృప్తితో ఉంది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి ఇటీవలే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేకు లేఖను కూడా రాసారు. సీనియం కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు కూటమిలో అనైక్యతకు దారితీస్తుందని కూడా హెచ్చరించారు. విపక్ష పార్టీలమధ్య ఐక్యతను మరింత పెంచేందుకే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు కూటమి అగ్రజులు చెపుతున్నారు. అయితే ఆమ్ ఆద్మీపార్టీ అందరికంటేముందుగానే ఈ కూటమినుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఇదిలా ఉంటే సోమవారం నాటి ఇండియా సమావేశానికి టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీకూడా హాజరు కావచ్చని ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్‌క్లబ్‌లో ఈ భేటీ జరగనున్నది. టిఎంసి ఎంపి డెరెక్ ఒబ్రెయిన్‌మాట్లాడుతూ ఇండియా కూటమి సమైక్యంగా ఉందన్న సంకేతాలుప్రజల్లోకి బలంగా వెళ్లాలని అందుకోసమే తమ ఐకమత్యం చాటి చెప్పేందుకు ఈసమావేశం జరుగుతుందన్నారు. కొన్ని పార్టీలు భేటీకి రాలేమని చెప్పినా వారంతా కూడా మోడీ కార్యాచరణలు, చర్యలను వ్యతిరేకిస్తూనే ఉన్నారని, వారి సొంత కారణాలపై హాజరుకాలేకపోతున్నట్లు చెప్పారని కాంగ్రెస్ జైరామ్‌రమేష్ వెల్లడించారు. సమావేశానికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియా, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదిపార్టీనుంచి అఖిలేష్ యాదవ్, ఆర్జెడి నుంచి తేజస్వియాదవ్, శివసేన యుబిటి ఉద్ధవ్‌థాక్రే సిపిఐ, సిపిఎం పార్టీలు కూడా హాజరు అవుతాయని కాంగ్రెస్ నేతలు వెల్లడించడాన్ని చూస్తే ఢిల్లీ ఇండియా భేటీ అత్యంత కీలకం కానున్నదని తెలుస్తోంది.



# తుదిడీల్ విఫలం అయితే ఇరాన్‌కు చావుదెబ్బ తప్పదు!

• అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్, జూన్ 7:** పశ్చిమాసియాలో కాల్పుల విరమణపై జరుగుతున్న చర్చల్లో సహేతుకమైన డీల్‌కు రానిపక్షంలో ఇరాన్ ఆమూలాగ్రం ధ్వంసం చేయడం ఖాయమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ స్పష్టంచేసారు. అయితే డీల్ కుదురుతుందని తనకు ఎంతో నమ్మకం ఉందని, ఒకవేళ సంప్రదింపులు విఫలం అయితే ఇక ఇరాన్‌కు నరకమేనని హెచ్చరించారు. అలాగే డీల్‌కు రానిపక్షంలో తాను ఇరాన్ ఆస్తుల స్తంభననుంచి తొలగించబోనని అన్నారు. డీల్ కుదిరిన తర్వాతనే ఇరాన్ ఆస్తులపై స్తంభన ఉత్తర్వులు తొలగించే అంశం పరిశీలిస్తానన్నారు.

అలాగే కొన్ని ఆంక్షలు కూడా ఎత్తివేయడం జరుగుతుందని డీల్‌కు రానిపక్షంలో ఇవేమీ ఉండవని హెచ్చ రించారు. అయితే ఇరాన్ సుమారు 24 బిలియన్ డాలర్ల ఆస్తులపై అమెరికా ఆంక్షలు విధించిందని, వాటన్నింటినీ ఎత్తివేసిన తర్వా తనే డీల్‌కు వస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే గల్ఫ్‌దేశాల్లో జరిగిన నష్టాన్ని భర్తీచేసేందుకు ఇరాన్ ఆస్తులనుంచే చెల్లించాలని అమెరికా ట్రెజరీశాఖ భావిస్తోంది. ఇందుకు ఇరాన్ సుతరాము అంగీకరించడం లేదు. అలా అయితే ఇరాన్‌లో ఇజ్రాయెల్ అమెరికా దాడులవల్ల జరిగిననష్టానికి పరిహారం ఖచ్చితంగా ఇస్తామని చెపితేనే డీల్‌కు వస్తామని తెగేసి చెపుతోంది. అదేవిధంగా శుద్ధిచేసిన యురేనియంను ఇరాన్ ఎక్కడ దాచిందోకూడా తమకు ఆప్రాంతం తెలుసునని ఏదో ఒకరోజు స్వాధీనంచేసుకుంటామని స్పష్టంచేసారు. మేం స్వాధీనంచేసకుని ఆ యురేనియంను ధ్వంసం చేస్తామని చెప్పారు. అంతేకాకుండా ఎన్బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ హెజ్‌బొల్లాపై మరిన్ని మెరుపుదాడులు ఉంటాయని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా సమస్యను ఇరాన్‌తో జరిగే డీల్‌లో ఉండకూడదనే తాను చెపుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులుచేసిన సంఘటనలున్న సంగతి తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాతకూడా ఇజ్రాయెల్‌కాల్పులకు తెగబడిందని లెబనాన్‌లోని హెజ్‌బొల్లా ఆరోపించింది. హెజ్‌బొల్లాపై మరిన్ని దాడులు చేయాల్సిఉందేనని ట్రంప్ నొక్కిచెప్పారు. ఇరాన్ డీల్‌లో లెబనాన్‌ను చేర్చాలన్న టెహ్రాన్ షరతును అంగీకరిస్తారా అంటే ట్రంప్ లేదు కానేకాదని చెప్పారు. ఇరాన్‌డీల్ వేరు, లెబనాన్ ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా సమస్యవేరని అన్నారు. ఇజ్రాయెలీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతోజరిగిన ఫోన్ కాల్‌చర్చల్లో నెతన్యాహును తీవ్రస్థాయిలో మందలించినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ట్రంప్ ఇపుడు హెజ్‌బొల్లా పై మరిన్ని మెరుపుదాడులు చేస్తామని చెప్పడం కాల్పుల విరమణ నిలిచినట్లేననిపిస్తోంది. మార్చి రెండవ తేదీ నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 3560 మంది లెబనాన్ ప్రజలు, జర్నలిస్టులు, చిన్నపిల్లలు చనిపోయారు. అలాగే 29 మంది ఇజ్రాయిలీ సైనికులు, ఒక కాంట్రాక్టరు కూడా చనిపోయినట్లు ఇరుదేశాలు పరస్పరం ఆరోపించుకున్నాయి. ప్రస్తుతం కాల్పుల విరమణను రెండుదేశాలు కూడా పాటిస్తున్నట్లుగా లేదు. శాంతిసయోధ్యకు మేం సిరియాను విశ్వసిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. సిరియాలో అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా మంచి నాయకుడని, అమెరికాకు మంచి మిత్రుడని ట్రంప్ పేర్కొన్నారు. సిరియా ప్రజలు ఒక మంచినేతను ఎన్నుకున్నారని ప్రశంసించారు.

# ట్రంప్ టీమ్ నుంచి తప్పకోనున్న ఎఐ సీనియర్ సలహాదారు

**వాషింగ్టన్, జూన్ 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సీనియర్ సలహాదారుగా పనిచేసిన భారత సంతతికి చెందిన శ్రీరామ్ కృష్ణన్ తన పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ నెలాఖరులో టెక్నాలజీ సలహాదారు పదవి నుంచి దిగిపోనున్నారు. ఆయన ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌లో అమెరికా ఎఐ విధానాలను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ట్రంప్‌తో కలిసి పనిచేయడం తనకు లభించిన గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఎఐ పోటీని తట్టుకొని దేశం మరింత ముందుకు వెళ్లడానికి అధ్యక్షుడు కీలక చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. ఆయన నాయకత్వం లేకుండా అమెరికా ఎఐ రేసులో ముందంజలో ఉండేది కాదన్నారు.

తాను అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అమెరికా అభివృద్ధి కోసం పని చేశానని శ్రీరామ్ కృష్ణన్ అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారుగా తాను అమెరికన్ ఎఐ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి, ప్రచురించడంలో సహాయపడ్డానని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కోసం నేషనల్ ఎఐ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై పనిచేసినట్లు తెలిపారు. ఫ్రాన్స్, భారత్ వంటి దేశాలలో జరిగిన అంతర్జాతీయ ఫోరమ్‌లు, సదస్సుల్లో అమెరికన్ ఎఐ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించానని పేర్కొన్నారు. కొంత విరామం తర్వాత ఎఐ విషయంలో అగ్రరాజ్యం ఎదుర్కొంటున్న భారీ సవాళ్లను అధిగమించడానికి సాయం చేస్తానని తెలిపారు.

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారుగా శ్రీరామ్ కృష్ణన్‌ను నియమించారు. అంతకుముందు వెంచర్ క్యాపిటలిస్ట్‌గా వ్యవహరించిన ఆయన.. అమెరికాలో కృత్రిమ మేధస్సు విధానాలు, జాతీయ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి టెక్ సంస్థల్లో కీలక స్థానాల్లో పనిచేశారు.

# టోలెడో ఫెస్టివల్‌లో కాల్పులు

## 12 మందికి గాయాలు

**టోలెడో(ఓహియో), జూన్ 7:** అమెరికాలో తుపాకి సంస్కృతి పెచ్చుమీరుతోంది. ఒహియో రాష్ట్రంలోని టోలెడో నగరంలో శనివారం సాయంత్రం జరిగిన ఓల్డ్ వెస్ట్ ఎండ్ ఫెస్టివల్ లో దుండగులు జరిపిన కాల్పుల్లో కనీసం 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, పండుగ వాతావరణంలో ఒక్కసారిగా బుల్లెట్ల వర్షం కురవడంతో జనం ప్రాణాలు చేతబట్టుకుని పరుగులు తీశారు. చారిత్రాత్మక నగరమైన టోలెడోలో 53వ వార్షిక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. లైవ్ మ్యూజిక్, ఫ్యామిలీ ఈవెంట్లతో కుటుంబాలన్నీ పండుగను ఆస్వాదిస్తున్న తరుణంలో సాయంత్రం 5:37గంటల ప్రాంతంలో డెలావేర్, గ్లెన్‌వుడ్ అవెన్యూల సమీపంలో ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకరిపై ఒకరు పరస్పరం కాల్పులు జరుపుకోగా, అక్కడ గుమిగూడిన సామాన్య ప్రజలు ఈ క్రాస్‌ఫైరింగ్‌లో చిక్కుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. టోలెడో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రక్షించారు. గాయపడిన వారిలో 14 ఏళ్ల మైనర్ల నుంచి 61 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారని డిప్యూటీ పోలీస్ చీఫ్ జో హెఫెర్నన్ తెలిపారు. ఘటనా స్థలంలోనే ప్రథమ చికిత్స అందించి, బాధితులను వెంటనే స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటన తర్వాత ఉత్సవానికి సంబంధించిన మిగిలిన అన్ని కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు స్థానిక యంత్రాంగం ప్రకటించింది. కాల్పులకు తెగబడిన నిందితులెవరూ ఇప్పటి వరకు పోలీసులకు చిక్కలేదు. ఘటనా స్థలం నుంచి పరారైనట్లు అధికారులు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పండుగకు వచ్చిన వారు తమ మొబైల్స్‌లో తీసిన ఫోటోలు లేదా వీడియోలను దర్యాప్తు కోసం అందించాలని పోలీసులు కోరారు. ఈ కాల్పుల ఘటనను ఒహియో గవర్నర్ మైక్ డివైన్ తీవ్రంగా ఖండించారు.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు

## సాగు ట్రాన్స్‌ఫార్మర్లకు రూ.1,306 కోట్ల వ్యయం

**హైదరాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** తెలంగాణలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఆర్డీఎస్ఎస్) కింద స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పాత విద్యుత్ మీటర్ల స్థానంలో వీటిని దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా బిల్లింగ్ నష్టాలను నివారించడానికి, ఆదాయ వసూళ్లను మెరుగుపరచడానికి వినియోగదారులు, ట్రాన్స్‌ఫార్మరు, ఫీడర్ల కోసం స్మార్ట్ మీటర్లను పెద్ద ఎత్తున అమర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే సమయంలో పంపిణీ మౌలిక సదుపాయాలకు సంబంధించి వ్యవసాయ ఫీడర్లను వేరు చేయడం (సౌరశక్తి కోసం పిఎంకుసుమ్‌తో అనుసంధానించడం), హై వోల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (హెచ్‌విడిఎస్) ను ఏర్పాటు చేయడం, సబ్‌స్టేషన్లను బలోపేతం చేయడం ద్వారా నెట్‌వర్క్‌లను ఉన్నతీకరించడం వంటి కార్యక్రమాలను నిర్వహించనుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 30.33 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వాటికి సంబంధించి మొత్తం 5.22 లక్షల డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ కు రాష్ట్ర విద్యుత్ నియంరతణ కమిషన్ నుండి (ఈఆర్సీ) లైసెన్స్ రాగానే ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయనుంది. ఇందుకు గాను ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై రూ.25 వేల చొప్పున వ్యయం అంవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మొత్తం వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్ల ఏర్పాటుకు గాను రూ.1,306 కోట్ల మేర ఖర్చవుతుందని విద్యుత్ శాఖ ప్రతిపాదించింది. ఇక ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి విద్యుత్ శాఖ అధికారులు టెండర్లు పిలవనున్నారు. టెండర్ దక్కించుకున్న కంపెనీల ద్వారానే మీటర్ రీడింగ్, గ్రామాల్లో లైన్ల నిర్వహణ పనులు చేయించేలా విద్యుత్ శాఖ ప్రత్యామ్నాయ ప్లాన్ కూడా సిద్ధం చేస్తోంది. ఈఆర్సీ లైసెన్స్ మంజూరైన తర్వాతే ఏ ప్రణాళికతో ముందుకు వెళ్లాలనేది ఖరారు కానుంది.

# 'ఫీజులు నియంత్రించండి'

**హైదరాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే హక్కుగా కాకుండా, కార్పొరేట్ సంస్థలకు లాభాల వనరుగా రాష్ట్ర ప్రభుత్వ మార్చిందని బిజెపి జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక భారానికి గురిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేసి పిల్లల చదువుల కోసం ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. డొనేషన్లు, అడ్మిషన్ ఫీజులు, యూనిఫారాలు, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్లను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఫీజుల పెంపును గరిష్టంగా 8శాతానికే పరిమితం చేయాలని కోరారు.

# బెంగాల్‌లో ప్రధాన విపక్షంగా మారేందుకు కాంగ్రెస్ ఆరాటం!



**న్యూఢిల్లీ, జూన్ 7:** బెంగాల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లు మాత్రమే గెల్చుకున్న జాతీయ పార్టీ కాంగ్రెస్ రాష్ట్రంలో ఉన్న రాజకీయ సంక్షోభాన్ని తమ పార్టీ ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని ఆరాట పడుతున్నది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా మారాలని ఆశపడుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ మాజీ ఎంపీ, లోక్‌సభ మాజీ డిప్యూటీ లీడర్ అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) క్రమేపీ కనుమరుగవుతున్నదని, ఎందుకంటే ఆ పార్టీ కాంగ్రెస్ వ్యతిరేక భావనల మీదే బలపడిందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తృణమూల్ కాంగ్రెస్ రెండుగా చీలిపోయి పూర్తిగా బలహీనపడటాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడటానికి ఇది బంగారు అవకాశమని వ్యాఖ్యానించారు. టిఎంసి కమ్యూనిస్ట్ వ్యతిరేక భావజాలంపై పుట్టిన పార్టీ అని, దశాబ్దాలుగా పాలిస్తున్న కమ్యూనిస్టులను అధికారానికి దూరం చేయడంలో ఆ పార్టీ పూర్తిగా కృతకృత్యమైందని, ఆ పార్టీకి సైద్ధాంతిక పునాది లోపించిందని అన్నారు. గత కొన్నేండ్లుగా ఆ పార్టీ గూండాయిజం, రాజకీయ హింస, ప్రజాకర్షక ధోరణిని అవలంబిస్తున్నదని, వీటిని నమ్ముకున్న పార్టీ ఏదో ఒక రోజు కుప్పకూలక తప్పదని, ఈ విషయాన్ని తాను చాలానాళ్ల క్రితమే ఊహించానని ఆయన తెలిపారు. టీఎంసీ ఒక స్వల్పకాలిక అద్భుతమని, ఎందుకంటే దానికి రాజకీయ సిద్ధాంతం లేదని, దానిని పార్టీలా కన్నా ఒక ప్రైవేట్ క్లబ్‌లా నిర్వహించారని ఆరోపించారు. అందుకే ఎంత వెలుగు వెలిగిందో చివరకు అంతే వేగంగా మసకబారిపోయిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ పటిష్టం అయ్యేందుకు మంచి అవకాశం కల్పిస్తున్నాయని అధిర్ రంజన్ చౌదరి తెలిపారు. తమ పార్టీకి పటిష్ఠ వ్యవస్థ లేకపోయినప్పటికీ రాష్టమంతటా ఉనికి ఉందన్నారు. కొన్ని దశాబ్దాలుగా తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా మద్దతుదారులు అంతటా ఉన్నారని తెలిపారు. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో తాము పార్టీ సిద్ధాంతాలను ఓటర్లలోకి విస్తృతంగా తీసుకుపోయి వారి విశ్వాసాన్ని పొందాలని, మెల్లగా ప్రతిపక్షం స్థానాన్ని ఆక్రమించాలని అన్నారు.

# టిఎంసి ఎమ్మెల్యేపై కోడిగుడ్లతో నిరసన



**కోల్‌కత్తా, జూన్ 7:** టీఎంసి నేత, ఎమ్మెల్యే మదన్ మిత్రా కు చేదు అనుభవం ఎదురైంది. కమార్‌హాటీ నియోజకవర్గంలోని అరియాదయా ప్రాంతంలో కొంత గందరగోళ పరిస్థితులున్నాయనే సమాచారంతో ఆయన అక్కడకు వెళ్లారు. అప్పటికే అక్కడకు చేరుకున్న స్థానికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కొందరు ఆగ్రహంతో కోడిగుడ్లు విసరడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. దాంతో ఎమ్మెల్యే కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు వెళ్లిపోయింది. దాడి ఘటనపై మదన్ మిత్రా స్పందిస్తూ ఈ ఘటన పూర్తిగా ముందస్తు వ్యూహంతో జరిగినదేనని, బీజేపీ మద్దతుతోనే కొందరు దుండగులు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అయితే దాడి సమయంలో తాను వాహనంలో లేనని, తన డ్రైవర్‌పై దాడి జరిగిందని చెప్పారు. కాగా దశాబ్దాలుగా కట్ మనీ పేరుతో స్థానిక నేతలు తమవద్ద బలవంతంగా డబ్బులు వసూళ్లు చేశారని, వాటిని తిరిగి ఇవ్వాలని ఆటోరిక్షా, ఈరిక్షా డ్రైవర్లు చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది.

# నన్నెవరూ రాజీనామా చేయాలని కోరలేదు



**కోల్‌కత్తా, జూన్ 7:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కోసం ఎంపీ పదవికి రాజీనామా చేయాలని పార్టీ తనను కోరినట్లు వస్తున్న వార్తలపై మాజీ క్రికెటర్, టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ వివరణ ఇచ్చారు. ఆ వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన కొట్టిపారేశారు. తననెవరూ రాజీనామా చేయమని కోరలేదని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అవుతోందని పఠాన్ అన్నారు. బెర్హంపూర్ లోక్‌సభ స్థానానికి తాను రాజీనామా చేస్తున్నానని, తద్వారా మమతా బెనర్జీ అక్కడ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోందని, అందులో నిజం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై మమతా బెనర్జీ తనతో ఎప్పుడూ చర్చించలేదని, పార్టీలోని ఏ ఒక్క నాయకుడు కూడా తనను రాజీనామా చేయమని అడగలేదని, ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని యూసుఫ్ పఠాన్ కొట్టిపారేశారు. ఈ మేరకు ఆయన ఈ విషయాన్ని ఓ వీడియోలో పేర్కొన్నారు.

# హామీల అమలులో బిజెపి సర్కార్ దూకుడు



**కోల్‌కత్తా, జూన్ 7:** బీజేపీ ప్రభుత్వంపై పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య భార్య మీరా భట్టాచార్య ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ప్రభుత్వం హామీలను వేగంగా అమలు చేస్తోందని ఆమె అన్నారు. బెంగాలీ మీడియా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం కేవలం కొన్ని రోజుల్లోనే హామీలను అమలు చేయడం ప్రశంసనీయం అని, హామీల అమలు వేగాన్ని చూస్తే సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్ర సంక్షేమం కోసం పనిచేస్తున్న వారు గౌరవానికి అర్హులు అని ఆమె మాట్లాడారు. సీఎం సువేందు అధికారి గురించి మాట్లాడుతూ ఆయనను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదని, కానీ బెంగాల్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారనే ఆశాభావం ఉందని చెప్పారు. పాలన విషయంలో టీఎంసీ, లెఫ్ట్ ప్రభుత్వానికి పోలిక లేదని చెప్పారు. లెఫ్ట్ 34 ఏళ్ల పాలన, టీఎంసీ 15 ఏళ్ల పాలనకు మధ్య పోలికను తోసిపుచ్చారు. నందన్, విద్యాసాగర్ సేతు, సాహిత్య అకాడమీ, శిశు కిషోర్ అకాడమీ వంటి అనేక కీలక సంస్థలు, మౌలిక సదుపాయాలను స్థాపించిన ఘటన లెఫ్ట్ ప్రభుత్వానిది అని, వ్యవసాయంలో బెంగాల్‌ను దేశంలో అగ్రగామిగా చేసిందన్నారు. సింగూర్ వివాదాన్ని ప్రస్తావిస్తూ టాటా మోటార్స్ ఆటోమొబైల్ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించినందుకు చాలా మంది స్థానికులు ఇప్పుడు బాధపడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఒక వేళ ఈ ఫ్యాక్టరీ స్థాపించబడి ఉంటే బెంగాల్ ఆర్థిక ముఖచిత్రమే మారిపోయేదని చెప్పారు. తన భర్త బుద్ధదేవ్ భట్టాచార్య విజన్ ఈ ప్రాజెక్టుకు మాత్రమే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి కల్పించడం ఆయన లక్ష్యమని చెప్పారు.

# తిరుచ్చి ఈస్ట్ నుంచి లారెన్స్ పోటీ?



## 11న క్లారిటీ ఇస్తానన్న రాఘవ

**చెన్నై, జూన్ 7:** నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ రాజకీయ అరంగేట్రంపై తమిళనాట జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం టీవీకే తరఫున ఆయన తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ ఉపఎన్నికలో పోటీ చేయబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. స్పందించిన లారెన్స్ కూడా తన భవిష్యత్తుకు సంబంధించి ఒక అత్యంత కీలకమైన సమాచారం 11న ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ స్పందన ద్వారా ఉత్కంఠను మరింత పెంచారు. ఈ ఊహాగానాలకు తెరదించడానికే ఈ ప్రకటన చేస్తున్నానని ఆయన తన నోట్‌లో పేర్కొన్నారు. తాను ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ సమర్పణలో వస్తున్న బెంజ్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నానని, ఈనెల 10తో ముగుస్తుందని, తన ప్రకటనకు ముగింపు ఇస్తూ లారెన్స్ మరింత ఆసక్తిని రేకెత్తించారు. 11న మా అమ్మ ఆశీస్సులతో ప్రకటిస్తా అని వెల్లడించారు. అయితే లారెన్స్ నిజంగానే రాజకీయాల్లోకి వస్తారా వస్తే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారు. పొలిటికల్ ఎంట్రీ గురించే ప్రకటన చేస్తారా లేదటే మరేదైనా విషయం ప్రకటిస్తారా అనే ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే ఈనెల 11 వరకు ఆగాల్సిందే.

8skl13:8skl13.qxd 07-06-2026 21:32 Page 1



## రూ.50 లక్షలతో ఉల్లివాని చెరువు అభివృద్ధి

### భూమి పూజ చేసిన ఎమ్మెల్యే జయకృష్ణ



వీరఘట్టం, జూన్ 7 ప్రభాతవార్త

మండల కేంద్రం వీరఘట్టంలోని ఉల్లివాని లక్ష్మీనారాయణ కోనేరును 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం భూమి పూజ చేశారు. వాటర్ షెడ్ నిధుల ద్వారా (డబ్ల్యు డి సి, పి ఎం కేఎస్ వై 2.0) సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అలాగే ఈ నిధులతో గట్టు బలోపేతం, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, సోలార్ లైట్స్, చిల్డ్రన్ ప్లేయింగ్ మెటీరియల్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఈ చెరువును ఎంతో సుందరంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే కృత నిశ్చయంతో ఉన్నారు. ఈ చెరువు పనులు పూర్తయితే ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు, వాకింగ్ చేసుకునేందుకు ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుంది. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఏపీఓ జి.సత్యంనాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ పాడిలాపు కృష్ణమూర్తి నాయుడు, సీనియర్ నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, గొర్లె గౌరునాయుడు, చింత ఉమామహేశ్వరరావు, జంపు శేఖర్ ఎన్.శశి, జనసేన, జానీ, జాద శ్రీధర్, జి.కోటేశ్వరరావుతోపాటు ఎనఆరఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పాఠ్యపుస్తకాలు పంపిణీ పూర్తి



### జిల్లా విద్యాశాఖాధికారి బ్రాహ్మజీ

వీరఘట్టం, జూన్ 7 ప్రభాతవార్త

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించే లక్ష్యంతో పార్వతీపురం మన్యం జిల్లాలో పుస్తకాల పంపిణీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రాహ్మజీ తెలిపారు. శనివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ జూన్ 4, 2026 నాటికి జిల్లాకు కేటాయించిన 4,60,052 పాఠ్యపుస్తకాలలో 4,59,699 పుస్తకాల పంపిణీ పూర్తి అయిందని తెలిపారు. మొత్తం పుస్తకాల పంపిణీలో మన్యం జిల్లా 99.92 శాతం ప్రగతి సాధించగా, ఎంతటలు అందుకున్న పుస్తకాలలో 100 శాతం పుస్తకాలను ధృవీకరించారు. జిల్లాలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం రాష్ట్రంలోనే అత్యుత్తమ స్థాయిలో కొనసాగుతున్న జిల్లాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిఈఓ బ్రాహ్మజీ తెలిపారు.

## పీఎం రాష్ట్రీయ బాల్ పురస్కార్‌కు దరఖాస్తులు ఆహ్వానం

### జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి



వీరఘట్టం, జూన్ 7 ప్రభాతవార్త:

భారత ప్రభుత్వం-2027 సంవత్సరానికి గాను 'ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను అందించేందుకు అర్హత గల పిల్లల నుండి దరఖాస్తులు/నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2027 కొరకు ఆన్‌లైన్ దరఖాస్తులు/నామినేషన్లను పోర్టల్ (ఫతంర) ద్వారా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో బాల ప్రతిభ కనబరిచిన చిన్నారులను ప్రభుత్వం గుర్తించి అవార్డుల ప్రదానం చేయనుంది. ఈ అవార్డులు ఆవిష్కరణలు, సామాజిక సేవ, విద్య, క్రీడలు, కళలు సంస్కృతి, ధైర్యసాహసాలు మరియు ఇతర రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలలకు అందజేయబడతాయన్నారు. 31 జూలై 2026 నాటికి 5 సంవత్సరాలు పూర్తి చేసి, 18 సంవత్సరాలు మించని భారతీయ పిల్లలు మాత్రమే ఈ పురస్కారాలకు అర్హులన్నారు. దరఖాస్తులు/నామినేషన్లు కేవలం ఆన్‌లైన్ ద్వారానే సమర్పించాలన్నారు. బాల బాలికలు స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వ్యక్తులు, సంస్థలు, పాఠశాలలు, ఇతరులు కూడా నామినేట్ చేయవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు/నామినేషన్లు జూలై 31వ తేదీ లోగా సమర్పించాల్సిన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, యువజన సంఘాలు, శిశు సంక్షేమ సంఘాలు మరియు ప్రజలు అర్హత గల బాలలను ప్రోత్సహించి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేయించవలసిందిగా కలెక్టర్ కోరారు.

## సార్‌పై సమావేశం



కంచిలి, జూన్ 7 ప్రభాతవార్త

కంచిలి మండలంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మాదిన రామారావు ఆధ్వర్యంలో కూటమి కార్యకర్తలు నాయకులతో సార్ ప్రోగ్రాం జూన్ 15 నుండి ప్రారంభం అవుతుంది. కాబట్టి ఓటర్ మ్యాపింగ్ పైన ఆదివారం సమావేశం నిర్వహించడం జరిగింది. అందరు కూడా ఓటర్ మ్యాపింగ్ కరెక్ట్‌గా చూసుకుంటే సార్ ప్రోగ్రాంలో తప్పులు దొర్లకుండా వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లల భవిష్యత్తుకు పునాది ఉపాధ్యాయులు : డిఈఓ

కంచిలి, జూన్ 7 ప్రభాతవార్త :



పాఠశాలలో ఒకటి రెండవ తరగతిలో చేరిన చిన్నారులకు సరైన పద్ధతిలో బోధనలు చేస్తే వారి భవిష్యత్తు మార్పుకు ప్రధాన కారణం ఉపాధ్యాయులేనని డీఈవో రవిబాబు, ఉప డీఈవో విలియమ్స్ అన్నారు. ఆదివారం కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో నాలుగు మండలాల ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, కంచిలి మండలాల్లో గల ఒకటి, రెండో తరగతులు బోధించే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆరు రోజులు పాటు జరిగే సమావేశంలో ఉపాధ్యాయులు నేర్చుకున్న విషయాలు, మెలుకువలు ఆయా పాఠశాలలకు వెళ్లిన తర్వాత విద్యార్థులకు సరైన పద్ధతిలో బోధిస్తే వారు భవిష్యత్తు ఉన్నత స్థానంలో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సప్పటి శివరాం ప్రసాద్, ఉప ఎంఈఓ చిట్టిబాబు, నాలుగు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## పలువురికి పరామర్శ



కంచిలి, జూన్ 7 ప్రభాతవార్త

కంచిలి మండల పరిధిలో గల బూరగాం గ్రామానికి చెందిన కాయ సిద్ధు అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే జాడుపూడి పంచాయతీ పిలక సావిత్రి అదే ఆసుపత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధికి చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకొని ఆసుపత్రికి వెళ్లి బాధితులకు స్వయంగా కలిసి, కష్టసుఖాలు తెలుసుకొని వారికి భరోసా కల్పించిన కంచిలి మండల ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి,రాష్ట్ర వైఎస్సార్‌సీపీ చేనేత విభాగ ప్రధానకార్యదర్శి కొనపల సురేష్, నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షులు పలికల జయరాం, బోగాబెని మాజీ సర్పంచ్ గణప సింహాచలం, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ గౌడో, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఐతం కళాశాలలో అంతర కళాశాల క్రీడా పోటీలు!



టెక్కలి, జూన్ 7, ప్రభాతవార్త:

టెక్కలి సమీపంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఐతం అంతర కళాశాల క్రీడా పోటీలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలు ఈ నెల 8వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపకుల విభాగంలో క్రికెట్, వాలీబాల్ పోటీలు, విద్యార్థుల విభాగంలో క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, చదరంగం, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడా విభాగాల్లో పోటీలు జరగనున్నట్లు తెలిపారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం, విజయనగరం, బరంపురం, పర్లాకిమిడి తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

## సూరిబాబు వ్యాఖ్యలు ప్రజా తీర్పును అవమానించడమే



ఇచ్ఛాపురం, జూన్ 7, ప్రభాతవార్త:

2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగించడంతోనే 2024 ఎన్నికల్లో ప్రజలు 94% స్ట్రైక్ రేట్‌తో 164 అసెంబ్లీ స్థానాలు కూటమికి కట్టబెట్టారని కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు పేర్కొన్నారు. ఈ విజయాన్ని 'కుతంత్రం'గా అభివర్ణించడం ప్రజాస్వామ్యాన్ని, ప్రజా తీర్పును అవమానించడమేనని వారు విమర్శించారు. పంచాయతీ నిధులను దారి మళ్లించి గ్రామ స్వరాజ్యాన్ని నిర్వీర్యం చేసిన జగన్ ప్రభుత్వానికి గాంధీ పేరు ప్రస్తావించే అర్హత లేదన్నారు. దేశంలో ఏ జాతీయ సంస్థ కూడా జగన్‌ను అత్యుత్తమ ముఖ్యమంత్రిగా గుర్తించలేదని, కేవలం సాక్షి మీడియా ప్రచారం మాత్రమే జరిగిందని విమర్శించారు. రెండు సీట్లతో ప్రస్థానాన్ని మొదలుపెట్టి మూడు ఎన్నికల తరువాత కూడా దేశంలో జైత్రయాత్ర కొనసాగిస్తున్న బిజెపికి, ఒక టర్మ్ పరిపాలన చేసినందుకే ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజల ఛీత్కరణకు గురైన వైసీపీకి పోలిక లేదని కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు పేర్కొన్నారు.

## టీడీపీ మండల స్థాయి పార్టీ సమావేశం

ఇచ్ఛాపురం, జూన్ 7, ప్రభాతవార్త :



ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం వద్ద మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం ఆధ్వర్యంలో టీడీపీ అధినేత జాతీయ పార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బి.అశోక్ ఆదేశాలు మేరకు మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇచ్ఛాపురం మండలం 21పంచాయితీలలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని చేస్తున్న పనులు గూర్చి, ప్రభుత్వం రైతులు పనులు, ప్రజలు ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఇస్తున్న వివిధ రకాల పించన్లు గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో లోపింటి పద్మనాభం, దక్కత కామేశ్వరరావురెడ్డి, ఎం.సూర్యనారాయణ, సహదేవ్, బోర రాజేంద్ర ప్రసాద్, లోహిదాసు, ఈశ్వరరావు, డి.లోకేష్, డి.గిరి, కురస్వామి, బాలరాజు, చంద్రశేఖర్, కూర్మారావు, సారధి, శంకరనారాయణ, మోహన్, అప్పన్న, బాలరాజు, ఎర్రయ్య, డిల్లీ, చందు గణపతి, సారధి, నాగరాజు, త్రినాథ బెహరా, బూత్ కన్వీనర్, గ్రామ పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో నున్న ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవచేతన యాప్‌పై అంగన్వాడీలకు శిక్షణ



జలుమూరు, జూన్ 7 ప్రభాతవార్త :

మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు రెండు రోజులు శిక్షణా తరగతులు జడ్.పి.హెచ్.ఎస్ అచ్యుతాపురంలో 'నవచేతన యాప'పై శిక్షణ ఇచ్చినట్లు సూపర్వైజర్లు సీతారత్నం, మనోహరి పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల అధికారులకు యాప్ పనితీరును వినియోగంపై ప్రాథమికంగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల్లో, బరువు ఎత్తు,ఇతర ఆరోగ్య వివరాలను ప్రతినెల నమోదు చేస్తూ ఉంటారు. ఇకనుంచి నవచేతన యాప్ ద్వారా తల్లిదండ్రులు, సంరక్షకుల అనుమతితో కృత్రిమ మేధాను ఉపయోగించి, చిన్నారుల ఎదుగుదల తీరును గమనించనున్నారని జలుమూరు వైద్యాధికారిణి గురువిల్లి సుజాత పేర్కొన్నారు. చాలా వరకు ఆరోగ్య సమస్యలు పాఠశాల వయస్సు వచ్చిన తర్వాతే బయటపడతాయని అన్నారు. అలా కాకుండా ముందుగానే గుర్తిస్తే తగిన వైద్య సేవలు అందించి, సరి చేయవచ్చు అనే ఉద్దేశంతో ఒక ప్రణాళిక పద్ధతిలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కేంద్రాల వారీగా ఈనెల 9 వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, అనంతరం నవచేతన యాప్ ద్వారా స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వైద్యాధికారిణి సుజాత తెలిపారు. ప్రధానంగా మానసిక వైకల్యం వినికిడి లోపాలు వయస్సుకు తగ్గట్లుగా ఎదుగుదల లేకపోవడం వంటి ముఖ్యమైన లోపాలను గమనిస్తే వెంటనే యాప్‌లో నమోదు చేసి సత్వర వైద్యం అందించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఓ వంశి ప్రియ, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రణస్థలంలో అర్ధరాత్రి దందా..

### -ప్రభుత్వ గెడ్డను కబ్జా చేసిన అక్రమార్కులు!



రణస్థలం, జూన్ 7, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన జె.ఆర్.పురం పంచాయితీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో రాత్రికి రాత్రే భూకబ్జా కలకలం రేపింది. కాలనీ గుండా వెళ్లే తారురోడ్డు పక్కన ప్రభుత్వ గెడ్డ వాగు స్థలాన్ని కొందరు అక్రమార్కులు చీకటి పడగానే ఆక్రమించుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా, అర్ధరాత్రి వేళల్లో జెసిబితో గెడ్డను పూడ్చివేసి, చదును చేయడం తెల్లారేసరికి స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**వరద ముప్పు పొంచి ఉందంటూ కాలనీవాసుల ఆందోళన:**

సహజసిద్ధమైన నీటి ప్రవాహం ఉన్న ప్రభుత్వ గెడ్డను రాత్రికి రాత్రే పూడ్చివేయడంపై వెంకటేశ్వర కాలనీ వాసులు తిప్పాన సతీష్, తిప్పాన రమణ, చింతలపూడి సత్యం, తిప్పాన జగన్నాథం, జోగ ఆది, వడ్డాది పాణికుమార్, జంగం రమణ, పైడిపల్లి రాజు, రీసు లక్ష్మణ, రీసు రాము, రీసు ఆది, తిప్పాన మోహనరావు, గురజాపు రాము, గంగి నాగరాజు, చింతలపూడి మణికంఠ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ గెడ్డ ద్వారానే నీరు కిందకు వెళ్లాల్సి ఉంటుందని, దీనిని ఆక్రమించడం వల్ల రాబోయే రోజుల్లో కాలనీ మొత్తం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పెద్దల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్:**

ప్రభుత్వ గెడ్డ వాగు స్థలాన్ని రాత్రికి రాత్రే కబ్జా చేయడం దారుణమని వర్షాలు పడితే మా ఇళ్లలోకి నీరు వచ్చే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఆక్రమణలను తొలగించి, గెడ్డను పూర్వస్థితికి తీసుకురావాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆక్రమణపై కాలనీ ప్రజలు తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

## అంగన్వాడీ కేంద్రాలు త్వరగా పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన



ఆమదాలవలస, జూన్ 7 ప్రభాతవార్త:

నియోజవర్గంలో నిర్మిస్తున్న నూతన అంగన్వాడి భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పొందూరు మండలంలో పెనుబర్తి గ్రామంలో నిర్మిస్తున్న నూతన అంగన్వాడీ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతు న్నాయని వాటిని త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. అలాగే నూతన అంగన్వాడీ భవనాలు నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. అంగన్వాడి భవనాలను ఈ ఏడాది పాఠశాలలు పున: ప్రారంభం అయిన నాటికి పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం విద్య కోసం నిధులు ఖర్చు చేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు చింతాడ వాసుదేవరావు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

సీతంపేట, జూన్ 7 ప్రభాతవార్త



విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల బిడ్డిక శంకరరావు మృతి చెందాడు. ఈయన కుటుంబానికి దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిస్కం కార్యదర్శి గణపతి.వి.యస్.ఆర్.కె ఆదేశాల మేరకు స్టేట్ యూనిట్ నుండి రూ.15 వేలు డిస్కం యూనిట్ నుండి రూ.30వేలు చెక్కును మృతిని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. పాలకొండ డివిజనల్ కార్యదర్శి ఇప్పిలి తౌడు డివిజనల్ అధ్యక్షులు టి.అచ్చినాయుడు డివిజనల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొంద్రు శ్రీను, డివిజనల్ ఉపాధ్యక్షులు జంపు సత్తయ్య, డివిజనల్ సహాయక కార్యదర్శులు బి.తిరుపతిరావు, మన్మధరావు, సీతంపేట సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం : బోయిన



కోటబొమ్మాళి, జూన్ 7 ప్రభాతవార్త

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రబిందువైన కొత్తమ్మతల్లి అవరణంలో ఆరోగ్యచైతన్యానికి కూడా శ్రీకారం చుడుతూ ఆదివారం యోగాంధ్ర ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. దేవాదాయశాఖ కమిషనర్ అదేశాలు మేరకు దేవస్థానం మండపంలో ఉదయం 6 గంటలనుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన సిబ్బంది, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ యోగా శిక్షకులు దినబోని స్వామి నాయుడు ఆధ్వర్యంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన్య విధానాలపై సమగ్ర శిక్షన అందించారు. జిల్లా రైస్ మిల్లర్ల సం ఘం అధ్యక్షుడు బోయిన రమేష్, కొత్తమ్మతల్లి ఆలయ పాలకమండలి చైర్మన్ కోరాడ గోవిందరావు, ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ, కమిటి సభ్యులు దేవాది లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## అండర్ -15 విద్యార్థులకు చెస్ టోర్నమెంట్



పలాస, జూన్ 7, ప్రభాతవార్త :

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ సాయి కాలనీలో గల శ్రీ వశిష్ఠ పాఠశాలలో ఆదివారం అండర్ 10, అండర్ 15 సంవత్సరాల విద్యార్థులకు చెస్ టోర్నమెంట్ నిర్వహించా మని ఆ పాఠశాల డైరెక్టర్ హెచ్.టి నాయుడు తెలిపారు. ఈ పోటీలలో విద్యార్థులు అత్యుత్తమైన ప్రతిభను కనబరిచారని ఆయన అన్నారు. ఇందులో భాగంగా అండర్ 10 చెస్ పోటీలలో మొదటి రెండు, మూడవ స్థానాల్లో ఐనాల సగున్ (మేధా ఉన్నత పాఠశాల), కె లిపిక (భాష్యం), పి.సాహిత్య (ఢిల్లీ పబ్లిక్ స్కూల్) విద్యార్థులు నిలవగా, అండర్ 15 చెస్ పోటీల్లో మొదట రెండవ మూడవ స్థానాలలో కింతల లీల మనోహర్ (నారాయణ), ఆర్.మోహన్ కృష్ణ (నారాయణ), జ్యోతిక (స్మార్ట్ స్కూల్) విద్యార్థులు నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు మేధా ఉన్నత పాఠశాల (కాశీబుగ్గ) డైరెక్టర్ కరస్పాండెంట్ ఐనాల సోమేశ్వరరావు చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరిగింది. చెస్ పోటీలకు కోచ్‌గా లోకేష్ వ్యవహరించారు. చలపతిరావు విజయ్ పాత్రో, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శిక్షణ

ఇచ్ఛాపురం, జూన్ 7 ప్రభాతవార్త



అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 7 నుంచి 20 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలను ప్రతి మున్సిపాలిటీలో నిర్వహించవలసినదిగా ఆదేశించారు. అందులో భాగంగా కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం అర్బన్ స్వర్ణ వార్డు అధికారి తిప్పన లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో ప్రాణాయామం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. అలాగే ఈ నెల 20వరకు ప్రతి రోజు ఉదయం 6:00 గంటల నుండి 8:00 వరకు పురపాలక సంఘం ఆవరణలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కావున ప్రతి ఒక్కరు పాల్గొనవల్సిందిగా కోరారు.

## సంతబొమ్మాళి గ్రంథాలయంలో ముగిసిన సమ్మర్ క్యాంపు

సంతబొమ్మాళి, జూన్ 7, ప్రభాతవార్త

సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయం సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజున బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులు పిఎసియస్ అధ్యక్షులు కూచెట్టి కాంతారావు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు తంగి సింగులు పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు, రీడర్స్ చైతన్య, కృష్ణ, వెంకటరావు సహాయకులు బాబురావు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

కంచిలి, జూన్ 7 ప్రభాతవార్త :

మండలం ఎంఎస్ పల్లి సబ్ స్టేషన్ పరిధిలోగల గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని జి.యగ్నేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు ఎంఎస్ పల్లి సబ్ స్టేషన్ పి టి ఆర్ తాత్కాలిక మరమ్మతులు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలు ఎంఎస్ పల్లి, కొల్లూరు కేసరపడ ఉంటుందని ప్రజలందరూ గమనించాలని కోరారు.

## సీతంపేట మండలంలో యోగాంధ్ర



సీతంపేట, జూన్ 7 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే యోగాంధ్ర కార్యక్రమం ఆదివారం సీతంపేట మండలంలో ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలో 31సచివాలయాల్లో జరగగా టిటుకుపాయి గ్రామంలో పిల్లలకు ప్రత్యేక యోగా పోటీలను నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.బి.మిశ్రో ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. గ్రామానికి చెందిన 10 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని, వివిధ రకాల యోగాసనాలను ప్రదర్శించారు. సీతంపేట సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.


కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం : విజయనగరం
రికవరీ సెక్షన్, పాత బాలాజీ జంక్షన్, రింగ్ రోడ్డు, విజయనగరం-535002.

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:
1) శ్రీమతి కూర్మపు జయ లక్ష్మి, భర్త: కూర్మపు సుధాకర్, డి.నెం.15-04-48, బొమ్మాడ వీధి, అరసవిల్లి, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532401 (ఋణగ్రహీత).
2) శ్రీ కూర్మపు సుధాకర్, తండ్రి: సూర్యనారాయణ, డి.నెం.15-04-48, బొమ్మాడ వీధి, అరసవిల్లి, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532401 (సహ-ఋణగ్రహీత).
డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా శ్రీకాకుళం-1 బ్రాంచ్ నుండి శ్రీమతి కూర్మపు జయ లక్ష్మి & శ్రీ కూర్మపు సుధాకర్ పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & అకౌంట్ నెం. | లోన్ మొత్తం & లోన్ తేదీ | వడ్డీతో కలిపి బకాయి | వడ్డీ రేటు |
|---|---|---|---|
| హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 160000179544 | రూ. 3,15,000/- తేదీ: 09.09.2021 | రూ. 3,57,720.86 | ప్రస్తుతం - 8.05% + 2.00% పీనల్ వడ్డీ |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 15.05.2026 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ. 3,57,720.86 (అక్షరాల మూడు లక్షల యాభై ఏడు వేల ఏడు వందల ఇరవై రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపించడం జరిగింది.

**తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి**

సెర్సాయ్ ఐడి: 400061847909: బలగ రూరల్, సర్వే నెం. 169-4 భాగం, PMAY(U)-వైఎస్ఆర్ జగనన్న నగర్, పాత్రునివలస గ్రామ సమీపంలో ఫ్లాట్లు, బ్లాక్ నెం.B5, మొత్తం బ్లాక్ ఏరియా 353.63 చ॥గ॥ స్థలంలో అవిభాజ్యపు 19 చ॥గ॥ వాటాతో మూడవ అంతస్తులోని 365 చ॥అ॥ (అనుపాత వాటా ఉమ్మడి ఏరియాలు కలుపుకొని) విస్తీర్ణం గల ఫ్లాట్ నెం.T1. బ్లాక్ (B5) హద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: B5 & A7 బ్లాక్‌ల మధ్య ఖాళీ ప్రదేశం, తూర్పు: B5 & B6 బ్లాక్‌ల మధ్య ఖాళీ ప్రదేశం, పడమర: B5 & B4 బ్లాక్‌ల మధ్య ఖాళీ ప్రదేశం. మూడువ అంతస్తులోని ఫ్లాట్ నెం.T1 కు హద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ఫ్లాట్ నెం. T2, తూర్పు: B5 & B6 బ్లాక్‌ల మధ్య ఖాళీ ప్రదేశం, పడమర: వరండా మరియు ఫ్లాట్ నెం.T8. టైటిల్ హోల్డర్: శ్రీమతి కూర్మపు జయ లక్ష్మి.

తేది: 26.05.2026, ప్రదేశం: విజయనగరం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం : విజయనగరం
రికవరీ సెక్షన్, పాత బాలాజీ జంక్షన్, రింగ్ రోడ్డు, విజయనగరం-535002.

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:
(1) శ్రీమతి గురువుగారు తులసి, భర్త: వాసుదేవరావు, డి.నెం. 12-4-99, న్యూ కాలనీ, కాశీబుగ్గ గ్రామం, పలాస కాశీబుగ్గ, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532222 (ఋణగ్రహీత).
(2) శ్రీ గురువుగారి సంతోష్ కుమార్, తండ్రి: వాసుదేవరావు, డి.నెం. 12-4-99, న్యూ కాలనీ, కాశీబుగ్గ గ్రామం, పలాస కాశీబుగ్గ, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్-532222 (సహ-ఋణగ్రహీత).
డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా పలాస కాశీబుగ్గ బ్రాంచ్ నుండి శ్రీమతి గురువుగారు తులసి & శ్రీ గురువుగారి సంతోష్ కుమార్ పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & అకౌంట్ నెం. | లోన్ మొత్తం & లోన్ తేదీ | వడ్డీతో కలిపి బకాయి | వడ్డీ రేటు |
|---|---|---|---|
| హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 160000340390 | రూ. 3,15,000/- తేదీ: 19.11.2021 | రూ. 3,34,411.86 | ప్రస్తుతం - 8.05% + 2.36% పీనల్ వడ్డీ |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 20.05.2026 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ. 3,34,411.86 (అక్షరాల మూడు లక్షల ముప్పై నాలుగు వేల నాలుగు వందల పదకొండు రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపించడం జరిగింది.

**తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి**

సెర్సాయ్ ఐడి: 400080392231: షెడ్యూల్-ఎ: శ్రీకాకుళం జిల్లా, కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రేషన్, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, బొడ్డపాడు ఏరియా, సర్వే నెం. 67/5 నందు మొత్తం ఎ.20.00 సెంట్లు భూమి. షెడ్యూల్-బి: బొడ్డపాడు, సర్వే నెం. 67/5 భాగం, PMAY(U)-వైఎస్ఆర్ జగనన్న నగర్, బ్లాక్ నెం.B5, మొత్తం బ్లాక్ ఏరియా 543.09 చ॥గ॥ స్థలంలో అవిభాజ్యపు 19 చ॥గ॥ వాటాతో మొదటి అంతస్తులోని 365 చ॥అ॥ (అనుపాత వాటా ఉమ్మడి ఏరియాలు కలుపుకొని) విస్తీర్ణం గల ఫ్లాట్ నెం.F4. బ్లాక్ (B5) హద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: B5 & B11 బ్లాక్‌ల మధ్య ఖాళీ ప్రదేశం, తూర్పు: ఓపెన్ స్పేస్, పడమర: రోడ్డు. మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.F4 కు హద్దులు: ఉత్తరం: లిఫ్ట్ స్పేస్ & ఫ్లాట్ నెం. F3, దక్షిణం: ఫ్లాట్ నెం. F5, తూర్పు: ఓపెన్ స్పేస్, పడమర: వరండా మరియు ఫ్లాట్ నెం.F9. టైటిల్ హోల్డర్: శ్రీమతి గురువుగారు తులసి

తేది: 25.05.2026, ప్రదేశం: విజయనగరం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

8 -6Pg9th chel Mon.qxd:8 -6Pg9th chel Mon.qxd 1/1/02 6:53 AM Page 1



## అన్నీ చెప్పేస్తున్నారా ?



భార్యాభర్తల మధ్య ఎంత ప్రేమైనా ఉండొచ్చు. కానీ కొన్ని హద్దులు మాత్రం తప్పనిసరిగా ఉండాలి. అవే భవిష్యత్తులో మీరు

పెళ్లి నిశ్చయం అవగానే అతనితో ప్రతి చిన్న విషయాన్నీ చర్చించడం మొదలు పెడుతున్నారా? ఈ తీరు సరి కాదు. అప్పటికి అవి సంతోషంగా అనిపించినా తర్వాత అవే సమస్యలుగా మారతాయి. మన ఇష్టాయిష్టాలను పంచుకోవడంలో తప్పులేదు. కానీ మన గతం గురించి పూసగుచ్చినట్లు ప్రతిదీ చెబితే భవిష్యత్తులో వైవాహిక జీవితంలో సమస్యలు తలెత్తవచ్చు. మీ బలహీనతలను అవతలి వారితో విపులంగా పంచుకోవడమూ మంచిది కాదు. భవిషత్తులో అవే వారికి ఆయుధాలుగా మారతాయి. మనమధ్యలో డబ్బు ప్రస్తావన రాకూడదు లాంటి మాటలు పక్కనపెట్టి.. ఆర్థికాంశాల గురించి తప్పనిసరిగా మాట్లాడుకోవాలి. జీతం.. ఖర్చులు వంటివి ముందుగానే ప్రణాళిక వేసుకుంటే మంచిది. ఇద్దరూ ఉద్యోగస్థులైతే ఇంటిపని పంచుకోవడం వంటివి చర్చించు కోవడం తప్పనిసరి. అవతలి వ్యక్తి వీటికి సానుకూలంగానే ఉన్నారా తెలుసుకోండి. లేదంటే పెళ్లి తర్వాత చిన్న విషయాలు అనుకున్నవే పెద్దగా మారి ఇబ్బందులు తెచ్చిపెడతాయి. ఏదో అనుకుంటాంగానీ ఇరువురి మధ్య పొరపొచ్చాలుండరాదని, ఇలాంటి విషయాలను అవతలివారు ఎలా గ్రహిస్తారో అంచనా వేసుకోవాలి. ★

## శివుడి అనుమతి



సీతాపరహరణం తర్వాత రామలక్ష్మణులు దండకారణ్యంలో సంచరిస్తుంటే.. వాళ్లకో మనోహర మైన ప్రాంతం కనిపించింది. సీతమ్మ వారి జాడ తెలిసేవరకూ అక్కడే నివసించాలనుకున్నాడు శ్రీరాముడు. అతడి సంకల్పాన్ని బలపరిచాడు లక్ష్మణుడు. సోదరా! నాతో ఏకీభవించినందుకు సంతోషం. అయితే ఇదెవరిదో తెలుసుకోవాలి. వారి అనుమతి లేకుండా ఉండటం భావ్యం కాదు కదా! కనుక చుట్టుపక్కల ఎవరైన ఉన్నారేమో చూడు, వారితో మాట్లాడుదాం అన్నాడు రాముడు. వెంటనే లక్ష్మణుడు పరిసరాలను పరిశీలిస్తూ కొంత దూరం వెళ్లగా.. ఉసిరి మారేడు చెట్ల మధ్యన శివాలయం కనిపించింది. కాని అక్కడెవరు లేదు. తిరిగొచ్చి సంగతి తెలియజేశాడు. అయితే ఈ ప్రాంతానికి పరమ శివుడే అధిపతి అయ్యాండు. అనుమతి తీసుకో లక్షణా అన్నాడు రాముడు. లక్ష్మణుడు శివాలయం వద్దకు వెళ్లి, శివుడి ఆజ్ఞకై అర్థించాడు. వెంటనే శివలింగం నుంచి ఉజ్వలంగా ఉన్న మూర్తి వెలువడి, అద్భుతంగా నృత్యం చేసి అదృశ్యమైంది. అలా ఎందుకు జరిగిందో దాని భావం ఏమిటో లక్ష్మణుడికి అర్థం కాలేదు. సోదరుడి వద్ద వచ్చి విషయం చెప్పాడు. రాముడు చిన్నగా నవ్వి. సోదరా శివుడి ఆజ్ఞ లభించింది. కుటీరం నిర్మించు అన్నారు.

ఆజ్ఞ ఎప్పుడు లభించింది ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మణుడు. లక్ష్మణా మితిమీరిన స్వార్థం, జివ్హా చాపల్యం, కామ వికారాలే కష్టాలకు మూలం. వీటిని గనుక నియంత్రించు కోగలిగితే..ఇక్కడే కాదు ఎక్కడైనా సుఖంగా జీవించవచ్చు. ఈ మూడింటినీ మనం నిగ్రహించుకోగలమని పరమ శివుడు గ్రహించాడు. కనుకనే నృత్యభంగిమలో దర్శనమిచ్చి తన అంగీకారాన్ని తెలియజేశాడు అంటూ వివరించాడు శ్రీరాముడు. ★

సౌందర్య పోషణ

## నిగ నిగల కురులు నీ కేశ సౌందర్యం



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన ఫొటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ఈ వీడియాల్లో ఎక్కువగా నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది కత్రినా ఒత్తైన, నిగనిగలాడే కురులు వాటి అందాలు పొగడతరమా! సాధారణంగా ప్రసవం తర్వాత చాలా మంది మహిళలు జుట్టు రాలడం, పలచబడటం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఈ మధ్యనే ఆమె 'విహాన్'కు తల్లయ్యారు. ఐనా కత్రినా జుట్టు మాత్రం అందుకు భిన్నంగా మరింత ఆరోగ్యంగా, ఒత్తుగా, మెరుస్తూ కనిపించడంతో అభిమానులు ఆశ్చర్య పోయారు. తన జుట్టు సౌందర్యం వెనుక ఖరీదైన సెలూన్ ట్రీట్మెంట్లు గానీ, లగ్జరీ ఉత్పత్తులు గానీ లేవని కత్రినా ఎప్పుడూ చెబుతుంటారు. ఐనా వీక్షకులు కొట్టిపడేసేవారు. . తన అత్త వీణాకౌశల్ స్వయంగా ఇంట్లో తయారుచేసే హెయిర్ ఆయిలే తన ఒత్తైన జుట్టుకు కారణమని ఆమె వివరించారు ఈ నూనెలో ఉల్లిపాయ, ఉసిరి కాయ, అవకాడోలతో పాటు మరికొన్ని పోషక విలువలున్న పదార్థాలను వాడతారని కత్రినా తెలిపారు. ఈ మిశ్రమాన్ని కొన్ని గంటల పాటు తక్కువ మంటపై మరిగించి, ఆ తర్వాత నూనెను తయారు చేస్తారని తెలిపారు. ఎన్ని ఖరీదైన ఉత్పత్తులు వాడినా, చివరకు స్థిరంగా పాటించే సాధారణ పద్ధతులే ఉత్తమ ఫలితాలనిస్తాయని ఆమె స్పష్టం చేశారు. కత్రినా వాడే ఈ నూనెలోని ప్రతి పదార్థానికి జుట్టు సంరక్షణలో ప్రత్యేక స్థానం ఉంది. ఉసిరికాయ (ఆమ్లా): ఉసిరిలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కుదుళ్లను బలోపేతం చేసి, తల మాడును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. సాంప్రదాయ జుట్టు సంరక్షణలో ఉసిరికి పెద్ద పీట వేశారు. ఉల్లిపాయ: ఉల్లిపాయ రసం జుట్టు తెల్ల బడటాన్ని తగ్గించడంతో పాటు, చుండ్రు సమస్యను కూడా నివారిస్తుందని చాలామంది నమ్ముతారు. అవకాడో: సహజసిద్ధమైన నూనెలు, ఆరోగ్య కరమైన కొవ్వులు అవకాడోలో అధికంగా ఉంటాయి. ఇవి జుట్టుకు లోతైన తేమను అందించి, పోషణనిస్తాయి. ముఖ్యంగా పొడిబారిన, నిర్జీవమైన జుట్టుకు మేలు చేస్తుంది. అవకాడో వాడటం వల్ల జుట్టు మృదువుగా, సులభంగా చిక్కులు పడకుండా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ★

## సైకిల్ పండుగలో ఆమె సైతం



జైపూర్‌కు చెందిన అరవై ఏళ్ల 'వండర్ వనిత' సైక్లిస్టు గురించి ఇప్పుడు తెలుసు కుందాం.

ఆమె గత పదిహేను ఏళ్లుగా ఎక్కడ సైక్లింగ్ ఛాలెంజ్‌లుగా వెళ్లి పాల్గొంటుంటారు. ఆమె పేరు రేణు సింఘి. 52ఏళ్ల వయసులో సైక్లింగ్ మీద ఇష్టంతో సైక్లింగ్ ఛాలెంజ్‌లను ఎదుర్కొన్నారు. మూడేళ్ల క్రితం ప్రపంచంలోనే అత్యంత కఠినతరమైన లండన్- ఎడిన్ బరో-లండన్ సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొంది. ఈ సమయంలో 14,300 మీటర్ల ఎత్తును అధిగమిస్తూ సైకిల్ వేగంగా నడపాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 1900 మంది సైక్లిస్టులు పాల్గొంటారు. ఆరు రోజుల్లో సైకిల్ తొక్కి 15,40 కిలో మీటర్లు వెళ్లాలి. 2022లో ఈ సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొని రేణుసింఘీ విజేతగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. సైక్లింగ్ సమయం 124.32 గంటలుగా రికార్డులకెక్కింది. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, సంకల్ప బలం, పట్టుదల ఉంటే అన్నిటిని అధిగమించి గమ్యాన్ని చేరుకోవచ్చన్నది ఆమె ఎపుడూ చెప్పేమాట. అత్యంత కఠినమైన పారిస్- బ్రెస్ట్- పారిస్ (1,200 కి.మీ) రైడ్‌ను 92 గంటల్లో పూర్తి చేసుకొని ఘనత సాధించారు. సుదూర బ్రెవెట్ సీరీస్‌లను పూర్తి చేసి ఐదుసార్లు రాండోనూర్ హోదాను పొందారు. ఇంతవరకు ఆమె పాల్గొన్న పోటీలన్నింటిలోనూ వెరశి 1.5 లక్షల మీటర్ల సైకింగ్ చేశారంటే నమ్మండి. రెండు రోజుల క్రితం జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవంలో కూడా ఈమె ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. సైక్లింగ్ అనేది సుస్థిర జీవనాన్ని, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తుందనే నమ్మకంతో ఆమె ఇప్పటికీ సైక్లింగ్‌ను వదిలిపెట్టలేదు. ★

## పండ్లు కడిగి తింటే పోలా!



**వేసవిలో పచ్చకాయ నుంచి మామిడి వరకూ ఎన్నో పండ్లను తింటుంటాం. త్వరగా పక్వానికి రావాలని కొన్ని రకాల మందులు వాటిపై చల్లుతుంటారు. ఒకసారి నీటితో శుభ్రం చేస్తే చాలు తినయొచ్చు అనుకుంటాం. కానీ వాటిపై ఉండే రసాయనాలు అంత తొందరగా పోవు. కాబట్టి వీటిని సరైన పద్ధతిలో శుభ్రం చేసి తినాలి.**

ఒక గిన్నెలో నీళ్లు తీసుకొని అందులో స్పూన్ బేకింగ్ సోడా వేసి పండ్లను 15 నిమిషాలు నానబెట్టాలి. తరవాత వాటిని మంచి నీటితో శుభ్రం చేసుకుంటే క్రిములన్నీ తొలగిపోతాయి. మూడు వంతుల నీటికి ఒక వంతు వైట్ వినెగర్ కలపాలి. పండ్లను ఆ మిశ్రమంలో పది నిమిషాలు ఉంచి ఆపై చేత్తో రుద్ది కడిగితే రసాయనాలు తొలగిపోతాయి. స్పూన్ ఉప్పు, చిటికెడు పసుపు కలిపిన నీటిలో పండ్లు వేసి అరగంట పాటు నానబెట్టాలి. ఆపై నీటితో చక్కగా శుభ్రం చేస్తే చాలు. వాటిపై ఉండే బ్యాక్టీరియా తొలగిపోతుంది. ఇవన్నీ చేయలేమనుకుంటే కనీసం మార్కెట్ నుంచి తెచ్చిన పండ్లను వెంటనే నీటిలో ఒక పది నిమిషాల పాటు ఉంచాలి. తరవాత మళ్లీ వేరే నీటితో శుభ్రం చేసుకుని తిన్నా మంచిదే. ★

## బిర్యాని ఆకు అంటే తక్కువేమీ కాదు!



బిర్యానీ.. పేరు చెబితే చాలు మన ముఖం వెలిగిపోతుంది. నోట్లో నీళ్లూరతాయి. నవాబుల హైదరాబాదీ బిర్యానీ దగ్గర్నుంచి.. కుండ బిర్యానీ వరకూ ఏదైనా సరే.. ఎప్పుడెప్పుడు తిందామా అన్నంత ఊరిస్తుంది. ఆ ఘుమఘుమలకు అసలైన కారణం బిర్యానీ ఆకు. ఇదిపేరుకు బిర్యానీ ఆకే అయినా..కిచిడీ, ఫ్రైడ్ రైస్, మసాలా కూరల్లోనూ వేసి.. వాటి రుచి మరింత పెరిగేలా చేస్తాం. ఇది సువాసనలు గుప్పించడమే కాదండోయే ఇందులో బోలెడన్ని ఔషధ గుణాలూ ఉన్నాయి. మొట్టమొదట ఆ సువాసన.. నోట్లో ద్రవాల ఊరించి, తినాలనిపించేలా చేస్తుంది. ఇది జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని పెంచుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. శ్వాసకోశ సమస్యలను, ఫంగల్ ఇన్ఫెక్షన్లను, క్యాన్సర్లను నివారిస్తుంది. సూక్ష్మ క్రిములను నశింపచేస్తుంది. జుట్టు ఎరిగేందుకు తోడ్పడుతుంది. గుండె, మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మానసిక ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్స్ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. నొప్పి, వాపు, మంటలు తగ్గుతాయి. బిర్యానీ ఆకులో ఎన్ని సుగుణాలో కదూ !

తెర


## 'బాలన్ ది బాయ్' ట్రైలర్ రిలీజ్



గ్రాండియర్ ఫిలిం మేకింగ్‌కు మారుపేరైన కెవిఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా 'బాలన్ ది బాయ్'. ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జూన్ 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇటీవలే 'బాలన్ ది బాయ్' మూవీ ఫ్రాన్స్‌లో జరిగే ప్రఖ్యాత కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమై, గ్లోబల్ వేదికపై మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమైనప్పటి నుంచి ఈ సినిమా గ్లోబల్‌గా ఆడియెన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా 'బాలన్ ది బాయ్' మూవీ హిందీ ట్రైలర్‌ను హీరో అజయ్ దేవగణ్, తమిళ ట్రైలర్‌ను హీరో సూర్య, తెలుగు ట్రైలర్‌ను హీరో నాగచైతన్య, కన్నడ ట్రైలర్‌ను హీరో రాజ్ బి శెట్టి సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు.

ట్రైలర్ తమకు బాగా నచ్చిందని చెబుతూ మూవీ టీమ్‌కు ఈ స్టార్ హీరోలు బెస్ట్ విషెస్ అందించారు. హ్యూమన్ ఎమోషన్స్, మనదైన నేటివిటీతో సాగిన ఈ ట్రైలర్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. ఆసక్తి కలిగించే సస్పెన్స్, ఎమోషన్ వంటి అంశాలతో ట్రైలర్ ప్రేక్షకుల్ని ఆలోచింపజేస్తోంది. ప్రమోషనల్ కంటెంట్‌తో 'బాలన్ ది బాయ్' సినిమా ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు చిదంబరం తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తుండటం విశేషం.

## 'సింగ్ గీతం' పదేళ్ల తర్వాత కూడా గుర్తుండే సినిమా: నిర్మాత నాగ్ అశ్విన్



లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమాపై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహాల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'సింగ్ గీత' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత నాగ్ అశ్విన్ విలేకర్ల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**'సింగ్ గీతం' ప్రయాణం ఎప్పుడు మొదలైంది?** ఈ ప్రయాణం సింగీతంతోనే మొదలైంది. ఆయన ఈ కథను ఎప్పటినుంచో చేయాలని అనుకుంటున్నారు. కమల్‌హాసన్ గారిని కలిసినప్పుడు ఒక ఆసక్తికరమైన విషయం చెప్పారు. పుష్పక విమానంకు ముందే ఈ కథను ఆయన కమల్ హాసన్‌కు చెప్పారు. అయితే సంగీతంకి ఉన్న కొన్ని ప్రాజెక్టుల కారణంగా అది కుదరలేదు. ఫైనల్‌గా ఇప్పుడు మెటీరియలైజ్ అయింది.

**మీరు నిర్మాతగా అనుకుంటే చాలా పెద్ద స్టార్స్‌తో ఈ సినిమా చేయొచ్చు. కానీ కొత్తవాళ్లతో తీయడానికి కారణం?** ఇది పూర్తిగా సింగీతం ఎంపిక. ఆయనకు కొత్త జనరేషన్‌తో పని చేయాలని ఉంటుంది. నటీనటులే కాదు, టెక్నీషియన్స్ కూడా ఎక్కువగా కొత్తవారే ఉండాలని భావిస్తారు. ఇది ఒక ప్రత్యేకమైన ప్రపం చంలో జరిగే కథ. పెద్ద స్టార్ నటీనటులు ఉంటే వారి ఇమేజ్ ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కొత్త ముఖాలు అయితే ప్రేక్షకులు ఆ ప్రపంచాన్ని మరింత సహజంగా ఫీల్ అవుతారు.

**'జాతిరత్నాలు' తర్వాత చాలా గ్యాప్ తీసుకుని ఈ సినిమాను నిర్మించారు కదా. మిమ్మల్ని ఎక్సైట్ చేసిన అంశాలు ఏమిటి?** సినిమా నిర్మించడం నా ఫస్ట్ జాబ్ కాదు. ఒక కథ నచ్చి, ఆ కథను ఇంకె వరూ చేయలేరనిపించినప్పుడే నేను నిర్మిస్తాను. జాతిరత్నాలు కూడా అలాంటిదే. ఆ సమయంలో అలాంటి సినిమా ఎవరూ చేసేవారు కాదనిపించింది. సింగ్ గీతం కూడా అంతే. ఇది చాలా ప్రత్యేకమైన సబ్జెక్ట్. సింగీతం విజన్‌పై, ఆయనపై ఉన్న ప్రేమతో ఈ సినిమాను చేశాను.

**ఇది గోల్డ్‌కు సంబంధించిన బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందా?** ఇది ఒక ఫిక్షనల్ స్టోరీ. కుబేరపురంలో గోల్డ్ మైన్స్ ఉంటాయి. ఆ ఊరికి, ఆ గోల్డ్ మైన్స్‌కు ఉన్న కనెక్షన్ ఏమిటనేది సింగీతం సిగ్నేచర్ స్టైల్‌లో, ఆయన ట్రేడ్‌మార్క్ హ్యూమర్‌తో చెప్పడం జరిగింది.

**సింగీతం వర్కింగ్ స్టైల్ మీకు ఎలా అనిపించింది?** రైటింగ్, రిహార్సల్ ప్రాసెస్ చాలా లాంగ్‌గా ఉంటుంది. దాదాపు తొమ్మిది నెలలు మేము రైటింగ్‌లోనే ఉన్నాం. నటీనటులు ఫైనల్ అయిన తర్వాత రిహార్సల్స్ కూడా చేశాం. సింగీతం చాలా స్పాంటేనియస్‌గా ఉంటారు. ఒకసారి ఏదైనా చెప్పి, తర్వాత ఆయనకే అది నచ్చకపోతే వెంటనే మార్చేస్తారు. "మీరే చెప్పారు కదా?" అంటే, "నేను తప్పు చేయకూడదా?" అంటారు. అలాంటి విషయాలు ఆయన దగ్గర నుంచి నేర్చుకున్నాను.

**ఒక కొత్త తరం దర్శకుడిగా మీ ఇన్‌పుట్స్ ఇందులో ఏమైనా ఉన్నాయా?** నాకు అప్పుడప్పుడు నేను కొత్త తరం దర్శకుడినా కాదా అనే డౌట్ వస్తుంది (నవ్వుతూ). కానీ సింగీతం మాత్రం 94 ఏళ్ల వయసులో కూడా కొత్త తరం దర్శకుడే. ఈ సినిమా కూడా ఒక టీనేజర్ తీసినట్టుగా ఉంటుంది. వారం రోజులు చూసి మర్చిపోయే సినిమా కాదు ఇది. పదేళ్ల తర్వాత కూడా గుర్తుండే సినిమా తీయాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్ చేశాం.

**మీరు, సింగీతం , దేవిశ్రీ ప్రసాద్ అందరికీ పాన్ ఇండియా ఇమేజ్ ఉంది. ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తీసుకెళ్లాలనే ఆలోచన ఉందా?** ఆలోచన అయితే ఉంది. తమిళంలో రిలీజ్ అవుతోంది. మిగతా భాషల విషయానికివస్తే ఇది చాలా కష్టమైన ప్రక్రియ. ఎందుకంటే ఇందులో డైలాగ్స్ అన్నీ పాటల రూపంలో ఉంటాయి. కాబట్టి ప్రతిభాషలోనూ వాటిని మళ్లీ సంగీతబద్ధంగా రూపొందించాలి. అయితే ఖచ్చితంగా ఇతర భాషల్లో కూడా తీసుకెళ్లాలనే ఆలోచన ఉంది.

**అయాన్, అహాల్య, శాలిని గురించి?** అయాన్, అహాల్య చాలా టాలెంటెడ్ పెర్ఫార్మర్స్. వారికి మంచి స్క్రీన్ ప్రెజెన్స్ ఉంది. అయాన్, శాలిని తెలుగువారు. అహాల్య తెలుగు నేర్చుకుంది. వీళ్లకు భవిష్యత్తులో చాలా మంచి అవకాశాలు వస్తాయి.

**కల్కి 2 గురించి?** కల్కి 2 ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే నెల నుంచి కంటిన్యూగా షూటింగ్ చేసి శరవేగంగా పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నాం.

## 'తెల్ల కాగితం' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్న చిత్రానికి 'తెల్ల కాగితం' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ మూవీకి రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' వంటి విజయాల తరువాత హర్ష్ రోషన్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అప్డేట్, టైటిల్, ఫస్ట్ లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ మూవీ రాబోతోందని టైటిల్, ఫస్ట్ లుక్‌ని చూస్తేనే తెలుస్తోంది.

పోస్టర్‌లో హీరో హీరోయిన్లు కనిపిస్తున్న, చుట్టూ ఉన్న విజువల్స్ చూస్తే ఇదొక అందమైన ప్రేమ కథా చిత్రమని అర్థం అవుతోంది. ఆహ్లాదకరమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి సినిమా మీద అంచనాలు పెంచేశారు. నందు సవిరిగన ఈ చిత్రానికి కథ, కథనాన్ని, మాటల్ని అందించారు. లోతైన భావోద్వేగాలతో ఈ కథను రెడీ చేశారు. రమేష్ బండ్రెడ్డి ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్‌ను సరికొత్తగా మలిచి ప్రేక్షకులకు ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను ఇవ్వాలని దర్శకుడు ప్రయత్నిస్తున్నారు.

సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకి సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రఫర్ కె.వి. గుహన్ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. అద్భుతమైన తారాగణంతో, గొప్ప సాంకేతిక బృందం ఆధ్వర్యంలో అందమైన ప్రేమ కథగా 'తెల్ల కాగితం' ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'ది నైట్ ఆఫ్ ది స్టార్స్' మ్యూజికల్ ఈవెంట్



సీన్ సెటర్స్, అసెంబ్లీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక సంగీత వేడుక 'ది నైట్ ఆఫ్ ది స్టార్స్' జూన్ 12, 2026న హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అసెంబ్లీలో జరగనుంది. ప్రముఖ సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్, ప్రముఖ నేపథ్య గాయని గీతా మాధురి, అలాగే సాకేత్, వినూత్న, కశ్యప్, అదితి, భార్గవి తమ అద్భుతమైన సంగీత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. ప్రముఖ యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహా ఈ వేడుకని ఆర్గనైజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో నిఖిల్ విజయేంద్ర సింహా మాట్లాడుతూ..'మమ్మల్ని సపోర్ట్‌చేయడానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు. మనందరం చిన్నప్పటి నుంచి పాటలను మధురమైన జ్ఞాపకాలుగా, నోస్టాల్జిక్ ఫీలింగ్స్‌గా ఆస్వాదిస్తూ పెరిగాం. ఆ నోస్టాల్జిక్ పాటలను మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఆలోచనతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దాదాపు 23 సంవత్సరాల తర్వాత కళ్యాణి మాలిక్ గారి ఆధ్వర్యంలో ఈ మ్యూజికల్ లైవ్ షో జరగడం చాలా సంతోషంగా ఉంది. జూన్ 12న అసెంబ్లీ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. మాకు ఈ వేదికను అందించిన శ్రీకాంత్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే కళ్యాణి మాలిక్‌కి, గీతా మాధురికి, సాకేత్‌కి, వినూత్నకి, అదితికి ధన్యవాదాలు. మీరు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై, మాతో కలిసి ఈ సంగీత వేడుకను ఆస్వాదించాలని కోరుకుంటున్నాం. టికెట్ల కోసం డిస్ట్రిక్ట్ యాప్, మేము అందించిన ఫోన్ నంబర్లను కూడా సంప్రదించలని కోరుతున్నాం' అన్నారు.

కళ్యాణి మాలిక్ మాట్లాడుతూ... 'నా మొదటి సినిమా ఐతే విడుదలైనప్పుడు ఎంత ఆనందంగా, ఉత్సాహంగా ఫీలయ్యానో, ఈ షో నిర్వహిస్తున్నప్పుడు కూడా అదే భావన కలుగుతోంది. జూన్ 12న జరిగే ఈ మ్యూజికల్ ఈవెంట్‌కు తప్పకుండా అందరూ రావాలని కోరుకుంటున్నాను. ఈ షో ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది' అన్నారు. గాయని గీతా మాధురి మాట్లాడుతూ...'కళ్యాణి మాలిక్ మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ షో గురించి నాకు చాలా కాల్స్ వస్తున్నాయి. కళ్యాణి పాటలకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. నాకు లైవ్ మ్యూజిక్ షోలు అంటే చాలా ఇష్టం. అలాంటి ప్రత్యేకమైన కార్యక్రమంలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ వేదిక చాలా అద్భుతంగా ఉంది. టికెట్లు డిస్ట్రిక్ట్ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే నిర్వాహకులు ఇచ్చిన ఫోన్ నంబర్ల ద్వారా లేదా సోషల్ మీడియా ద్వారాకూడా సంప్రదించవచ్చు. కళ్యాణి మాలిక్ పాటలను ఈ వేదికపై పాడబోతుండటం నాకు ఎంతో ఆనందంగా ఉంది' అన్నారు.

8vzm15:8vzm15.qxd 07-06-2026 22:07 Page 1



## యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి



గరివిడి, జూన్ 7, ప్రభాతవార్త :

యోగాతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని గరివిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం వి బి సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రతీ ఒక్కరూ యోగా అభ్యాసాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 21 న జరగనున్న 12 వ అంతర్జాతీయ యోగా వేడుకల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో మాస్టర్ యోగా బోధకులు అల్లం కనకేశ్వర రావు, ఆనంద్, కిరణ్ ల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణా తరగతులు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఒక్కక్కరు 40 మందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక




మెరకముడిదాం,జూన్ 7, ప్రభాతవార్త :

వారంతా 25 సంవత్సరాల క్రిందట 10వ తరగతి ఒకే పాఠశాలలో చదువుకున్నారు.వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు.తామంతా తాము చదువుకున్న పాఠశాలలో ఒకసారి కలుద్దామని అనుకున్నారు.అనుకున్నదే తడవుగా 30 రోజులు పాటు విశ్రమించి ఫోన్ నెంబర్లు, అడ్రస్ లు సేకరించారు. ఆదివారం నాడు వారి అపూర్వ కలయికకు అపూర్వ ఘట్టానికి గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదిక అయ్యింది.వీరంతా 2000 -2001 లో పదవ తరగతి పూర్తి చేసుకుని 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా రజతోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఆనాటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకొని ఉబ్బితబ్బిబ్బయ్యారు.సతీ సమేతంగా వచ్చి ఆనందంగా గడిపారు.అలనాటి గురువుల ప్రసంగం అనంతరం పూర్వ విద్యార్థులంతా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.అనంతరం గురువులను ఘనంగా సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా 10వ తరగతిలో 588 మార్కులు సాధించిన దాది వెంకటేష్ అనే విద్యార్థికి తమ బ్యాచ్ తరపున నగదును అందించారు.అనంతరం తాము విద్యాభ్యాసం జరిపిన తరగతి గదిలోకి వెళ్లి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కేరింతలు కొట్టారు. గర్భాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సూర్యనారాయణ,అలనాటి ఉపాధ్యాయులు వి. అచ్యుత రామారావు,పెద్దింటి సూర్యనారాయణ,రాజారావు సత్తారు రమణ.మరడాన సుజాత,సత్తారు అప్పలనాయుడు,విజినిగిరి శంకరరావు, కార్యక్రమ నిర్వాహకులు ,పూర్వ విద్యార్థులు మరడాన సత్యారావు, దేవాడ వెంకటరమణ, సిరేల ఈశ్వరరావు,గ్రంధి శ్రీకర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అప్పగించిన పోలీసులు

రామభద్రపురం, జూన్ 7,ప్రభాత వార్త :




స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ పోలీసులు చాకచక్యంగా రికవరీ చేసి, ఆదివారం బాధితులకు అందజేశారు. రామభద్రపురం సబ్ ఇన్స్పెక్టర్ జ్ఞానప్రసాద్ రావు తెలిపిన వివరాల ప్రకారం.గతంలో తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఇద్దరు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన పోలీసులు, పోర్టల్ మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఆ ఫోన్ల జాడను కనుగొన్నారు. రికవరీ చేసిన రెండు స్మార్ట్‌ఫోన్లను ఈరోజు రామభద్రపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ చేతుల మీదుగా బాధితులకు సురక్షితంగా అందజేయడం జరిగింది. తమ విలువైన ఫోన్లను అతి తక్కువ కాలంలోనే వెతికి పట్టుకున్నందుకు బాధితులు ఎస్ఐ జ్ఞానప్రసాద్ రావు మరియు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం చేసిన అభివృద్ధి సంక్షేమానికి ఆకర్షితులై టీడీపీ తీర్థం పుచ్చుకున్న కేసలి పంచాయతీ ప్రజలు



పాచిపెంట, జూన్ 7, ప్రభాతవార్త:

మండలంలో గల కేసలి పంచాయితీ పరిధిలో పలు గిరిజన గిరిజ నేతర గ్రామాలలో నుండి 300 కుటుంబాలు శ్రీ శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమక్షంలో సాలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వైసీపీని వేడి టిడిపిలో ఆదివారం చేరారు. టిడిపిలో చేరిన వారందరికీ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సాదరంగా ఆహ్వానించి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షులు యుగంధర్ అద్వర్యం లో జరిగింది. కూ టమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి సంక్షేమం కి ఆకర్షితులై టీడీపీ పార్టీ వృర్థం పుచ్చుకున్నారనీ మంత్రి అన్నారు. కేసలి, మడవలస చేరి గుడ్డి కుంతం తదితర గిరిజన గ్రామాలకు చెందిన 300 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన పక్షపాతని అన్నారు లేని విధంగా ప్రతి మారుమూల గ్రామానికి బీటీ రహదారి సౌకర్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వం దేనని అన్నారు. గిరిజన అభివృద్ధికి ఐటీడీఏను బలోపేతం చేసి ట్రై కార్ రుణాలు అందజేయడం కూటమి ప్రభుత్వంకే సాధ్యపడిందని అన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు ప్రతి మహిళ అభివృద్ధికి మహిళా మండలి ద్వారా వడ్డీ లేని రణాలను అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికె దక్కిందని అన్నారు. చదువుకున్న యువకులకు యువతులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రాజెక్టులను తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గూడెపు యుగంధర్, సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షులు చల్ల కనక, దేశం పార్టీ నాయకులు కోరుపల్లి సురేష్ ,పాచిపెంట ఎంపిటిసి పి ఉమామహేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు కేసలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాబా టిడిపి నాయకులు, పంటల భాస్కరరావు, ఆకుల శ్రీను, ఆకుల సాయి,ఆకుల వసంత, మీసాల మోహన, తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ టీచర్ల శిక్షణ తరగతులు పరిశీలన : మంత్రి

సాలూరు , జూన్ 7, ప్రభాతవార్త :



సాలూరు పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ మధ్య మెగాడీఎస్సీలో ఉద్యోగాలు పొందిన నూతన ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు జరుగుతున్నా యి.అందులో భాగంగా ఆదివారం రాష్ట్రమంత్రి గుమ్మిడి సంధ్యారాణి కాలేజీకి వెళ్లగా విధ్యాశాఖ అధికారులు సాధరంగా ఆహ్వానం పలికారు.ఈ మేరకు కొత్త టీచర్స్ ను మంత్రి అభినందించి వారితోపాటు కొద్ది సేపు ముచ్చటించారు.అనంతరం ఆమె మాట్లాడుతు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుపై ఉందన్నారు. అలాగే మెగాడీఎస్సీ ద్వారా విద్యా వ్యవస్థ బలోపేతం అవుతోందని స్పష్టం చేశారు.అంతేకాకుండా శిక్షణ తరగతులపై టీచర్స్ అభిప్రాయాలు తెలుసుకుని కూటమి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ ఫలితాలు సాధించాలని మంతి సంధ్యారాణి ఆకాంక్షించారు.డిప్యూటీ డిఈఓ రాజ్ కుమార్,ఎంఈఓ కె.వి. సత్యనారాయణ,హెచ్ఎం ఎన్.జ్యోతి,టీచర్స్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఐదుగురు పేకాటరాయళ్లు అరెస్ట్ .. రూ.30,500 స్వాధీనం

రామభద్రపురం, జూన్ 7, ప్రభాత వార్త :



ఈరోజు (7-06-2026) సాయంత్రం ఐదు గంటల సమయంలో కొట్టకే గ్రామం శివాలయం వెనుక ఉన్న పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకోవడం జరిగింది అని వారి వద్ద నుండి 30 వేల ఐదు వందల పది రూపాయలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం వర్చుకున్నట్లు ఎస్సై వి. జాన ప్రసాద్ వారిపై కేసు నమోదు చేయడమైనది.

## సీతారాములకు బంగారు శతమానాలు బహూకరణ

నెల్లిమర్ల, జూన్ 7, ప్రభాతవార్త:



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీరామస్వామి వారి దేవస్థానంలోని సీత, శ్రీరామచంద్ర స్వామికి అదే గ్రామానికి చెందిన చేవూరు రశ్మిత సుమారు పాతికవేల రూపాయలు విలువైన బంగారు శతమానాన్ని ఆదివారం బహుకరిం చారు. సాఫ్ట్వేర్ ఉద్యోగంలో చేరిన రశ్మిత తన తొలి నెల వేతనాన్ని శ్రీరామచంద్రులకు సమర్పించాలని తీసుకొను నిర్ణయం మేరకు బంగారు శతమానాన్ని ఆదివారం దేవస్థానం ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులకు అందజేశారు. రశ్మిత తండ్రి భాస్కర రావు ఇదే దేవస్థానంలో ఎలక్ట్రిషన్ గా ఉద్యోగం చేస్తున్నారు. కార్యక్రమంలో భాస్కరరావుతోపాటు కుటుంబీకులు, అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, కిరణ్ కుమార్ గొడవర్తి నరసింహచార్యులు పాల్గొన్నారు.

## రామతీర్థం దేవస్థానంలో యోగా కార్యక్రమం



నెల్లిమర్ల, జూన్ 7, ప్రభాతవార్త

ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధంలో భాగంగా చేపట్టే యోగాంధ్ర కార్యక్రమములో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని దేవదాయ ధర్మదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశముల మేరకు ఈ నెల 7 నుండి 21 తేదీల వరకు యోగా సాధన మేరకు ఆదివారం దేవస్థానంలో సిబ్బంది యోగా కార్యక్రమం నిర్వహించారు. విజయనగరం జిల్లాలో దేవాలయ సిబ్బంది, వాలంటీర్లు, భక్తులచే సూర్య నమస్కారముల యోగ ఆసనములు వేయాలని ఉన్నతాధికారులు సూచించారు. కార్యక్రమం దేవస్థానం ఈవో వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది.

## పూర్వ క్రికెటర్లకు సన్మానం




శృంగవరపుకోట,జూన్7,ప్రభాతవార్త :

ఎస్.కోట పట్టణంలోని శిరికి రిసార్ట్స్ లో 1990లో క్రికెట్ ఆడిన సీనియర్ క్రికెటర్లు డీకే నాయుడు,అల్లు సురేష్,జెర్రిపోతుల ఉమామహేశ్వరరావు తదితరులను స్థానిక స్టార్,ప్లయ్ టీమ్ క్రికెటర్లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈసందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ప్రస్తుత యువత విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, యువకులు క్రికెట్ లేదా ఇతర క్రీడల్లో చక్కటి శిక్షణ పొందుతూనే జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో రాణించాలని పిలుపునిచ్చారు.క్రీడల్లో నైపుణ్యం పతకాలు సాధించిన వారికి ప్రస్తుతం ఉద్యోగావకాశాలు కూడా లభిస్తున్నాయన్నారు.కార్యక్రమంలో యువ క్రికెటర్లు బాలు,సూరిబాబు,చింతా బుజ్జి,ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజయాలకు పునాది వాగ్దేవి జూనియర్ కాలేజ్



కొత్తవలస జూన్ 7 (ప్రభాతవార్త )

విద్యార్థుల విజయాలకు పునాది వాగ్దేవి జూనియర్ కళాశాల అని పూర్వ విద్యార్థులు కొనియాడారు. ఆదివారం 2001--2003 విద్యా సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు తమ విద్యా జీవితంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందభాష్పాలు పంచుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడి, సమాజంలో మంచి గుర్తింపు పొందిన పూర్వ విద్యార్థులు తమ విజయాలకు పునాది వాగ్దేవి కళాశాలేనని పేర్కొన్నారు. తమ జీవితానికి మార్గదర్శకంగా నిలిచిన ఉపాధ్యాయులను, కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు ని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టెట్ నుంచి మినహాయింపునిచ్చేలా చట్ట సవరణ చేయాలి

### ఏపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు డా.జె సి రాజు



బొబ్బిలి జూన్ 7 ప్రభాతవార్త:

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు నిచ్చేలా చట్ట సవరణ చేయాలని ఏ పి టి ఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ జె సి రాజు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు 25,30 సంవత్సరాల నుండి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని కూడా టెట్ పరిధిలోకి చేర్చటాన్ని వ్యతిరేకిస్తూ మంచి చెడులను చర్చించే నిమిత్తం ఆదివారం స్థానిక ఏ పి టి ఎఫ్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జె సి రాజు మాట్లాడుతూ టెట్ అర్హత అమలులో లేని 2010 కి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరిధిలోకి తీసుకొచ్చి టెట్ ఉత్తీర్ణులు ఐతేనే పదోన్నతుల కు అర్హులను చెప్పటం,ఆ పరీక్షే విద్యా నాణ్యతకు ప్రామాణికం చేయటం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇది అన్యాయమని,25,30 సంవత్సరాల నుండి చేస్తున్న బోధనకు విలువ లేకుండా చేసి ఉపాధ్యాయులకు గౌరవం లేకుండా చేయడమే నని అన్నారు.ఇన్ సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పని సరి చేస్తున్న ప్రభుత్వాలు అన్ని శాఖల పరిపాల విభాగాలకు న్యాయ,వైద్య, పోలీస్ ,విద్యుత్ ,రెవెన్యూ తదితర సిబ్బందికి పదోన్నతుల కల్పనకు, వారి పని నాణ్యతను పెంచటానికి మళ్ళీ అర్హత పరీక్షను పెట్టగలరా అని ప్రశ్నించారు.ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపునిస్తూ కొత్తగా నియామకం పొందే వారికి టెట్ తప్పని సరి చేసేలా చట్ట సవరణ చేయాలని కోరారు. చట్ట సవరణ చేసే లోగా ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేకంగా ఏడాదిలో 2 సార్లు టెట్ నిర్వహించాలన్నారు.ఉపాధ్యాయులు ఏ సబ్జెక్ట్ బోధిస్తున్నారో అదే సబ్జెక్ట్ లో ఉన్న విషయాల పరిధి మేరకే టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమావేశంలో చిన్నా రావు,యుగంధర్,శర్మ,రాజు, తదితరాలు పాల్గొన్నారు.

## గ్రీన్ బెల్ట్ సొసైటీ" వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

బొబ్బిలి, జూన్ 7, ప్రభాతవార్త:



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ బేబీనాయన బొబ్బిలి పట్టణంలో ఉన్న కోటిచెరువు గట్టు వద్ద గ్రీన్ బెల్ట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ శాసనసభ్యులు ఆర్.వీ. ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన)హాజరై మొక్కలు మొక్కలు నాటి అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు రమణమూర్తి మాస్టారు బొబ్బిలిలో చుట్టుపక్కల గ్రామాలలో అనేక మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నారని అన్నారు. ఈ కోటి చెరువుగట్టులో మొక్కలు నాటడం ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ప్రతినిత్యము వందల సంఖ్యలో ఉదయం నడక చేస్తారని దాని ద్వారా ఆరోగ్యం సంభవిస్తుందన్నారు.

## ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రిజిస్టర్ నెంబర్ 1104 (గుర్తింపబడినది)

విజయనగరం: జూన్ 7 ప్రభాతవార్త:

విజయనగరం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం దాసన్నపేట 1104 యూనియన్ ఆఫీసులో రీజనల్ అధ్యక్షులు వంగపండు లక్ష్మణ్ అధ్యక్షతన సమావేశం జరిగినది. వచ్చే 2 సంవత్సరం వరకు విజయనగరం రీజనల్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. రీజనల్ అధ్యక్షులుగా గేదెల దేముడు, రీజనల్ కార్యదర్శిగా సురగాల లక్ష్మణ్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా గుమ్మడి దేముడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పతివాడ రామునాయుడు , ఆఫీస్ సెక్రటరీగా దేవరకొండ శ్రీనివాస్ కుమార్, రీజనల్ అసిస్టెంట్ సెక్రటరీగా రాంబార్కి.సతీష్ కుమార్, రీజనల్ ఉపాధ్యక్షులుగా యన్.రాంప్రసాద్ , రీజనల్ కోశాధికారిగా శ్రీ బెహరా కూర్మారావ్, మహిళా ప్రతినిధిగా ఎస్వి బాలాకుమారి, మొదలగు నాయకులను ఎన్నుకోవడం జరిగింది. డివిజన్ ప్రెసిడెంట్ భోగి సూరి డివిజన్ కోశాధికారి వేమిరెడ్డి, గణపతి వైస్ ప్రెసిడెంట్ నారం శెట్టి కృష్ణ ఆర్గనైజింగ్ సెక్రటరీగా మీచీ నాయు డు బొబ్బిలి డివిజన్ కార్యవర్గ సిబ్బంది యూనియన్ 1104 యూనియన్ నెంబర్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం, జూన్ 7:

జిల్లా ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శక పరిష్కారం అందించేందుకు నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి శాఖల అధికారులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ దరఖాస్తుల్లో పేరు, చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధార పత్రాలను జతపరచాలని సూచించారు. గతంలో ఫిర్యాదు చేసిన వారు పాత అర్జీ రశీదును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు. అర్జీల స్థితిగతులను ప్రజలు సులభంగా తెలుసుకునేలా ప్రభుత్వం ఎస్ఎంఎస్ సేవలను అందుబాటులో ఉంచిందని, సమస్య పరిష్కారం అనంతరం సంబంధిత ఉత్తర్వులు, ఎండార్స్‌మెంట్లు వాట్సాప్ మరియు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపబడతాయని వెల్లడించారు.కలెక్టరేట్‌కు హాజరు కాలేని వారు 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా లేదా ఎవవనశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా అర్జీలు సమర్పించవచ్చన్నారు.

## రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడుతారు

దత్తిరాజేరు, జూన్ 7, ప్రభాతవార్త,



రక్తం దానంచేయడం వల్ల ఇంకొకరి ప్రాణాలు కాపాడిన వారవుతారని అమ్మ సేవా సంస్థ అధ్యక్షులు సురేష్ అన్నారు ఎన్ వి ఎన్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో దాసు పేట గ్రామంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారుసహాయస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు సాయికుమార్ ఆధ్వర్యంలో 16 మంది యువకులు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారన్నారు ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వేసవిలో రక్తం కొరత ఎక్కువగా వస్తుందని రక్త నిధి నిల్వ కోసం ఇది ఉపయోగపడుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎక్సలెన్స్ అవార్డులతో విశిష్ట సేవలకు ఘన సత్కారం



గజపతినగరం, జూన్ 7 ప్రభాతవార్త:

పోస్టల్ సేవల్లో గజపతినగరం ప్రతిభ చాటి చెప్పటం గర్వంగా ఉందని, ప్రతిభను గుర్తించి గౌరవిస్తేనే సమాజం పురోగమిస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (రాజు-ఫ్రా), ఎన్ఆర్ఐ సాధికారత మరియు సంబంధాల శాఖల మంత్రి పేర్కొన్నారు. ఆదివారం గజపతినగరంలోని మోహన్ ఫంక్షన్ హాల్‌లో తపాల శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన "సబ్ డివిజనల్ లెవెల్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2025-26" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, సంస్థలకు ఎక్సలెన్స్ అవార్డులు అందజేసి అభినందించారు. "గ్రామీణాభివృద్ధి, సామాజిక సేవ, విద్య, ఉపాధి, ప్రజా సంక్షేమ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారిని ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరం, వారి విజయాలు యువతకు స్ఫూర్తిగా నిలవాలి" అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో నెంబర్ గంట్యాడ శ్రీదేవి, గజపతినగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పీవీవీ గోపాల రాజు, ఐపిపిబి రీజినల్ మేనేజర్ సురేష్, ఐపిపిబి మేనేజర్లు సతీష్, డి ఉపేంద్ర, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు, లబ్ధిదారులు, యువత, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## గంట్యాడ మండల బీజేపీ పదాధికారుల సమావేశం

విజయనగరం (క్యాంట్యాడ) జూన్ 7 ప్రభాతవార్త:



మండల అధ్యక్షులు రవి వర్మ గారి అధ్యక్షతన నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ పాల్గొని పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో పార్టీ విస్తరణ, అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై మండల పదాధికారులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి ప్రతి గ్రామంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొబ్బిలి శ్రీను, పూర్వ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పిల్లా నవీన్ కుమార్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజన్న రమణ, మండల ప్రధాన కార్యదర్శులు భోద రాము, చప్ప జనార్ధన్ తదితర నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగాంధ్ర పోటీలతో కురుపాం మండలంలో యోగా సందడి



కురుపాం / పార్వతీపురం, జూన్ 7: ప్రభాతవార్త:

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర కాంపిటేషన్' కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం కురుపాం మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో యోగా పోటీలు నిర్వహించారు. బియ్యాలవలస గ్రామంలో మండల అభివృద్ధి అధికారి ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అధికారులు వివరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలు ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పట్టణంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

విజయనగరం, జూన్ 7 ప్రభాతవార్త:



విజయనగరం పట్టణంలో ముందుగా గుర్తించిన 200 ప్రాంతాల్లో ప్రత్యేకంగా వాహన తనిఖీలు విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ వాహన తనిఖీలను మరియు విజిబుల్ పోలీసింగును స్వయంగా పర్యవేక్షించిన విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ గంటల వరకు వాహనాలను తనిఖీలు చేసిన సుమారు 600 మంది పోలీసులు విజయనగరం పట్టణంలో ముందుగా గుర్తించిన 200 ప్రాంతాల్లో జూన్ 6/7న రాత్రి 10.30 నుండి 1.30 గంటల వరకు ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. తనిఖీలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ స్వయంగా పర్యవేక్షించి ఆర్.టి.సి. కాంప్లెక్స్, జొన్నగుడ్డి, లంకాపట్నం, డబుల్ కాలనీ, దాసన్నపేట జంక్షన్, రింగ్ రోడ్డు ప్రాంతాల్లో స్వయంగా తిరిగి అధికాలు, సిబ్బందికి సూచనలు చేసారు.

08-06pg10.qxd:08-06pg10.qxd 1/1/02 6:36 AM Page 1



# తిలక్‌వర్మ, సిరాజ్‌లకు భారీ ధర

## లోకల్ స్టార్లకు ఊహించని ధర * టిజి లీగ్ ఆటగాళ్ల వేలంలో కాసుల పంట





**హైదరాబాద్, జూన్ 7(వార్త క్రీడా ప్రతినిధి)**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఎ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న టీజీ 20 లీగ్ వేలంలో కాసుల వర్షం కురిసింది. టీమిండియా స్టార్ ఆటగాళ్లు తిలక్‌వర్మ, మహ్మద్ సిరాజ్‌లకు భారీ ధర దక్కింది. రామోజీ ఫిలిం సిటీ వేదికగా ఆదివారం జరిగిన ఆటగాళ్ల వేలంలో భారత టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ 33 లక్షల ధర పలికాడు. కనీస ధర 5 లక్షలతో వేలంలోకి వచ్చిన తిలక్ వర్మ కోసం ఫ్రాంచేజీలు పోటీపడ్డాయి. మెదక్ ఫాల్కన్స్, పాలమూరు స్ట్రైకర్స్ పోటాపోటీగా బిడ్లు వేయగా, మధ్యలో నల్గొండ జట్టు కూడా రేసులోకి వచ్చింది. చివరకు హోరాహోరీ పోరులో 33 లక్షల భారీ ధరకు తిలక్ వర్మను మెదక్ ఫాల్కన్స్ సొంతం చేసుకుంది. ఇక మరో టిమిండియా ప్లేయర్ మహ్మద్ సిరాజ్‌ను దక్కించుకోవడానికి కూడా ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. చివరకు వరంగల్ వారియర్స్ జట్టు 14 లక్షలు వెచ్చించి సిరాజ్‌ను కొనుగోలు చేసింది.

లోకల్ స్టార్ ప్లేయర్లకు సైతం ఊహించని విధంగా ధర పలికారు. సీవీ మిలింద్‌ను 17 లక్షలకు అన్విత ఖమ్మం ఏసెస్, రవికిరణ్‌ను 13 లక్షలకు పాలమూరు స్ట్రైకర్, రవితేజను 12 లక్షలకు మెదక్ ఫాల్కన్స్, తనయ్ త్యాగరాజన్‌ను 11 లక్షలకు రంగారెడ్డి జట్టు, తన్మయ్ అగర్వాల్‌ను 8 లక్షలకు కరీంనగర్ డైమండ్స్, రాహుల్ బుద్ధిని 8 లక్షలకు అనురాగ్ నల్గొండ నైట్స్, రోహిత్ రాయుడును 6.5 లక్షలకు పాలమూరు స్ట్రైకర్స్ దక్కించుకున్నాయి.

ఈ లీగ్ లో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు పాల్గొంటున్నాయి. 21 రోజుల పాటు 32 మ్యాచ్‌లు ఉప్పల్ స్టేడియంలో జరుగుతాయి. హెచ్‌సీఎలో నమోదైన ఆటగాళ్ల వేలంలో పాల్గొన్నారు. ప్రతి టీమ్‌కు 60 లక్షల పర్స్ మనీ కేటాయించగా, గరిష్టంగా 20 మంది ప్లేయర్స్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఇచ్చారు. ఒక్కో టీమ్ కనీసం రూ.54 లక్షలు ఖర్చు చేయడం తప్పనిసరి. గ్రామీణ ప్రతిభకు ప్రోత్సాహంగా ప్రతి టీమ్‌లో కనీసం 4 జిల్లాల ఆటగాళ్లు ఉండేలా, తుదిలో కనీసం రెండు జిల్లాల ప్లేయర్స్‌ను తప్పనిసరి చేశారు.

**టీజీ20 లీగ్‌లోని 8 జట్లు**

హైదరాబాద్ ఈ ఛాంపియన్స్, ప్రణవ రంగారెడ్డి రైజర్స్, వరంగల్ వారియర్స్, మెదక్ ఫాల్కన్స్,అనురాగ్ నల్గొండ నైట్స్, కరీంనగర్ డైమండ్స్, పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్



# రెండో రోజు బౌలర్ల షో

## డెబ్యూలోనే మానవ్ అదర్స్ * ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్ 113-5 * భారత్ తొలి ఇన్నింగ్స్ 564-8 డిక్లేర్డ్

**న్యూచండీఘర్:** ముల్లన్‌పూర్ స్టేడియంలో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా క్రికెట్ కూన ఆఫ్ఘనిస్తాన్‌ను చెడుగుడు ఆడుతోంది. తొలి రోజు బ్యాట్స్‌మెన్ వీరవిహారం చేస్తే... రెండో రోజు బౌలర్లు చెలరేగారు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ రెండో రోజు ఆటముగిగేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆఫ్ఘనిస్థాన్ ఫాలోఆన్ తప్పించుకోవాలంటే ఇంకా 351 పరుగులకు పైగా చేయాలి. చేతిలో 5 వికెట్లు మాత్రమే ఉన్నాయి. పిచ్‌పై భారత బౌలర్ల గ్రిప్ చూస్తుంటే.. మూడో రోజు ఆఫ్ఘనిస్థాన్ జట్టుకి ఇంకా గండం పొంచి ఉన్నట్టే కనిపిస్తోంది.

టీ విరామానికి కొద్ది ముందు తొలి ఇన్నింగ్స్ ఆరంభించినఆఫ్ఘనిస్తాన్.. భారత బౌలర్ల ధాటికి మొదటి నుంచే తడబడింది.ఆఫ్ఘనిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను భారత పేసర్లు క్రీజ్‌లో కుదురుకోనివ్వలేదు. ముఖ్యంగా టెస్ట్ అరంగేట్రం చేసిన మానవ్ సుతార్ అద్భుతంగా స్పిన్ ఉచ్చులో పడేశాడు. ఓపెనర్ అబ్దుల్ మాలిక్(16)ను ఔట్ చేసి ఆఫ్ఘన్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. మరో ఎండ్‌లో పేసర్ ప్రసిధ్ కృష్ణ పదునైన బంతితో సాదికుల్లా(17)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 40 పరుగులకే ఆఫ్ఘన్ ఇద్దరు ఓపెనర్లను కోల్పోయింది.

చివరి సెషన్‌లోనూ భారత బౌలర్లు చెలరేగారు.ఒకవైపు సుతార్ రూపంలో స్పిన్, మరో వైపు ప్రసిద్ధ్ కృష్ణ రూపంలో పేస్ అటాక్‌తో మూకుమ్మడి దాడి చేశారు. వీరి ధాటికి వెంట వెంటనే ఆఫ్ఘనిస్థాన్ వికెట్లు కోల్పోయింది. రహమనుల్లా గుర్బాజ్(12),అఫ్సర్ జాజాయ్(3)లను మానవ్ సుతార్ ఔట్ చేయగా... కెప్టెన్ హష్మతుల్లా షాహిది(20)ను ప్రసిద్ధ్ కృష్ణ ఎల్బీగా పెవిలియన్‌కు పంపాడు. మరో ఎండ్‌లో రహమత్‌షా కూల్‌గా ఆడుతూ క్రీజ్‌లో నిలదొక్కుకోవడంతో ఆఫ్ఘనిస్థాన్ వంద మార్కు దాటింది. రహమత్ షా 81 బంతుల్లో 6 ఫోర్లు, ఓ సిక్స్‌తో 43 పరుగులో క్రీజ్‌లో నిలిచాడు. డెబ్యూ ప్లేయర్ మానవ్ ఏకంగా కీలకమైన 3 వికెట్లు పడగొట్టగా,పేసర్ ప్రసిద్ధ్‌కృష్ణ 2వికెట్లు తీశాడు.

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 3 వికెట్లకు 368 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన టీమిండియా... మరో 5 వికెట్లు కోల్పోయి 196 రన్స్ జోడించింది. శుభ్‌మన్ గిల్(177 బంతుల్లో 126; 15 ఫోర్లు, ఓ సిక్స్) మరో 23 పరుగులు జోడించి సలీం బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. రిషబ్ పంత్(121 బంతుల్లో 81; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు)లు కూడా తొందర గానే పెవిలియన్ చేరాడు. ధ్రువ్ జురెల్(20 బంతు ల్లో 19) నిరాశపరిచాడు. దీంతో లంచ్ సమయానికి 6 వికెట్లకు 475 రన్స్ చేసింది.

**వాషింగ్టన్ మెరుపు ఫిఫ్టీ**

సూపర్ ఆల్‌రౌండర్ వాష్టింగ్టన్ సుందర్(68 బంతుల్లో 52; 5 ఫోర్లు,ఓ సిక్స్)మెరుపు హాఫ్ సెంచరీతో అలరించాడు. అతనికి డెబ్యూ ప్లేయర్ మానవ్ సుతార్(28), మహ్మద్ సిరాజ్(22) రన్స్ కూడా తోడవడంతో భారత్ స్కోరు 550 మార్కు దాటింది. సుందర్ టెస్ట్‌ల్లో అయిదో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తర్వాత కెప్టెన్ గిల్... టీమిడియా తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 564 పరుగులవద్ద డిక్లేర్ చేశాడు. ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లలో సలీం సఫీ ఒక్కడే 6 వికెట్లు పడగొట్టి టీమిండియాకు కాస్త బ్రేకులు వేశాడు. మిగతా ఆఫ్ఘన్ బౌలర్లలో జియావుర్ రెహమాన్, హష్మతుల్లా షాహిదిలకు తలో వికెట్ దక్కింది.

# ర్యాపిడ్ చెస్ టైటిల్ నెగ్గిన వైశాలి

**టోక్యో:** భారత విమెన్ గ్రాండ్ మాస్టర్ వైశాలీ సరికొత్త రికార్డు నెలకొల్పింది. జపాన్‌లో జరిగిన డబ్ల్యూఆర్ విమెన్స్ ర్యాపిడ్ చెస్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ ట్రోఫీ నెగ్గఇన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. టోర్నమెంట్‌లో ఆద్యంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన వైశాలీ.. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ రౌండ్‌లో కజకిస్థాన్‌కు చెందిన బలమైన క్రీడాకారిణి అలువా నూర్మన్‌ను ఓడించింది. తొలి గేమ్ డ్రా అయినా, రెండో గేమ్‌లో అద్భుత ఎత్తులతో ప్రత్యర్థిని వైశాలీ ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇక బ్లిజ్ ఈవెంట్‌లోనూ విజయ పరంపరను కొనసాగిండంపై విశాలీ దృష్టి పెట్టింది. ఈ ఈవెంట్‌లోనూ విజయం సాధించి డబుల్ టైటిల్ సొంతం చేసుకోవాలని చూస్తోంది. కాగా నార్వే చెస్ టైటిల్ గెలుచుకున్న తొలి ఇండియన్‌గా నిలిచి ప్రజ్ఞానంద సరికొత్త రికార్డ్ సృష్టించగా, ఇప్పుడు అదే బాటలో సోదరి వైశాలి సరికొత్త చరిత్ర లిఖించారు.





# లార్డ్స్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ గ్రాండ్ విక్టరీ

**లార్డ్స్:** నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్ట్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 115 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. మూడు టెస్ట్ సిరీస్‌లో 1-0 ఆధిక్యత పొందింది.254 పరుగుల లక్ష్యచేధనలో న్యూజిలాండ్ మరో సారి కుప్పకూలింది.కేవలం 138పరుగులకే రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. నాలుగో రోజు 55 పరుగులకు 5 వికెట్లతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ లంచ్ లోపే ఆలౌటైంది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో కాన్వే(41), గ్లెన్ ఫిలిప్స్(44 నాటౌట్), కేన్ విలియమ్సన్(18) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ఏకంగా నలుగురు బ్యాట్స్‌మెన్ గోల్డెన్ డక్ అయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో అట్కిసన్ 5వికెట్లు, రాబిన్సన్ 2వికెట్లు, జోష్‌టాంగ్ 2వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులు, రెండోఇన్నింగ్స్‌లో 226 పరుగులు చేయగా... న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 113రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు... మొత్తం ఏడు వికెట్లు పడగొట్టిన ఓలీ రాబిన్సన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. ఈ సిరీస్‌లోని రెండో టెస్ట్ కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా జూన్ 17న మొదలవుతోంది.



మహిళల టీ20 ప్రపంచకప్‌ను ఆవిష్కరించిన జట్ల కెప్టెన్లు. ఈ టోర్నీలో భారత్‌తో పాటు 12 జట్లు పోటీపడుతున్నాయి

# వారంలో 43 వేల కోట్ల పెట్టుబడులు వెనక్కి

**ముంబయి, జూన్ 7:** విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లనుంచి జూన్ మొదటి వారంలో సుమారు రూ.43 వేల కోట్ల రూపాయలు వెనక్కితీసుకున్నారు.ప్రపంచఇన్వెస్టర్లు అందరూ తమపెట్టుబడి వనరులను టెక్నాలజీ, కృత్రిమమేధ కంపెనీల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నట్లు తేలింది. రూపాయి క్షీణత కూడా డాలర్ ఇన్వెస్టర్లకు కలిసొస్తోంది. ఈ మొత్తంతో ఈ ఏడాది ఇప్పటివరకూ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.2.67 లక్షలకోట్లు మార్కెట్లనుంచి వెనక్కి తీసుకున్నారు. అదే గత ఏడాది మొత్తంగా చూస్తే 1.66 లక్షల కోట్ల కంటే ఈ ఏడాది ఆరునెలల్లోనే రెట్టింపు మొత్తం విత్‌డ్రాలుచేసారు. త్రైమాసిక ఫలితాల్లో క్షీణత, రూపాయి పతనం, గ్లోబల్‌మార్కెట్లలో మరింత ఆకర్షణీయ పెట్టుబడులకు అవకాశాలు టెక్నాలజీ, ఎఐ, స్పేస్‌రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు వస్తుండటంతోఆ దిశగా ఇన్వెస్టర్లు రూటు మార్చారు. గ్లోబల్‌ఇన్వెస్టర్లు భారీ ఎఐ సంబంధిత మార్కెట్ అవకాశాలపై ఎక్కువ ఫోకస్‌పెంచుతున్నారు. స్పేస్‌ఎక్స్



ఐపిఒకోసం ఇప్పటినుంచే సిద్ధం అవుతున్నారు. ఒక్క ఫిబ్రవరిలో మినహా మిగిలిన అన్ని మాసాల్లోను ఇన్వెస్టర్లు అమ్మకాలకే ఎక్కువ మొగ్గుచూపించారు. ఫిబ్రవరిలోమాత్రం ఇన్వెస్టర్లు రూ.22,615 కోట్లుపెట్టుబడులుపెట్టారు. అదే మార్చి నెలలో 1.17 లక్షలకోట్లు విత్‌డ్రా చేసారు. ఏప్రిల్‌లో 60,847కోట్లు, మేనెలలో 32,963 కోట్లు చొప్పున విత్‌డ్రా చేసుకున్నారు. అదే జూన్‌నెల మొదటి వారంలోనే రూ.42,927 కోట్లు విత్‌డ్రా అయ్యాయంటే భారత్ ఈక్విటీలపై గ్లోబల్ ఇన్వెస్టర్ల ఫోకస్ మారిందనే చెప్పాలి. భారతీయ కరెన్సీ 2026లో సుమారు ఆరుశాతం క్షీణించింది. గత ఏడాదితోపోలిస్తే 10శాతం క్షీణించింది.అయితే ఇది ఎంతోకాలం ఉండదని, ప్రభుత్వం ఎల్టీసీజీని పూర్తిగా మినహాయించడం, ప్రభుత్వ సెక్యూరిటీల్లో పన్నులు మినహాయింపు వంటి వాటితోపాటు ఆర్బీఐ ఇటీవల సడలించిన పరిమితులతో ఇన్‌ఫ్లోలు మరింతగా పెరుగుతాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త వికె విజయ్‌కుమార్ చెప్పారు. ఆర్బీఐ ఇటీవలే ఎన్ఆర్ఐలు, ఓసిఐలకు ఈక్విటీల్లో పెట్టుబడుల పరిమితులను పెంచింది. అయితే జూన్ మొదటి వారంలో ఎఫ్‌పిఐలు ఫుల్లీ యాక్సెసిబుల్‌రూట్‌లో 2600 కోట్లుపెట్టుబడులుపెట్టారు.ఈరూటులో మొత్తం పెట్టుబడులు ఇప్పటివరకూ 17,230 కోట్లవరకూ ఉన్నట్లు జియోజిత్ వెల్లడించింది.

# మ్యూచువల్ ఫండ్‌లోకి రెండు కొత్త ఆఫర్లు




**ముంబయి,జూన్7:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఈ వారం మరో రెండు కొత్త పథకాలు అందుబాటులోకి వచ్చాయి. తమ పోర్ట్ ఫోలియోలోని ఖాళీలను పూరించి, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు తగినట్లుగా మ్యూచువల్ ఫండ్‌హౌస్‌లు కొత్త ఫండ్స్ లాంచ్ చేశాయి.ఈ రెండు కొత్త ఫండ్స్‌లో ఒకటి యాక్టివ్ ఫండ్ ఉండగా రెండోది పాసివ్ ఫండ్ ఉంది. ఒకటి అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్‌గా వస్తే మరొకటి ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్‌గా ఉంది. డబ్ల్యూఓసీ అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం నేడు అందుబాటులోకి వస్తోంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 22వ తేదీ వరకు అందుబాటులోఉంటుంది.అలాగే ఇందులో కనీస పెట్టుబడి రూ.500 గా నిర్ణయించారు. ఐసీఐసీఐ ప్రూ ఏఎంసీ నుంచి మరో కొత్తఫండ్‌ను కూడా ప్రారంభిస్తున్నారు. ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీనుంచి ఈ కొత్త స్కీమ్ లాంచ్ అవుతోంది. అదే ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 ఈటీఫ్ ఫండ్. ఈ కొత్త ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల9వ తేదీన ప్రారంభమవుతోంది. సబ్‌స్క్రిప్షన్ అనేది ఈనెల 16వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 1000గా నిర్ణయించారు. ఆ తర్వాత వెయ్యి చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు.

# ఖనిజాల అన్వేషణకు ఎఐ డేటా హాబ్‌లు



**న్యూఢిల్లీ, జూన్ 7:** దేశంలో కీలకమైన, భూగర్భంలో లోతుగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు కేంద్రం కృత్రిమ మేధ ఎఐ ఆధారిత కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.100 కోట్ల వ్యయంతో బెంగళూరులో "డేటా ప్రాసెసింగ్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ఇంటిగ్రేషన్ సెంటర్‌ను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నెలకొల్పుతోంది. ఈ కేంద్రం దశాబ్దాలుగా సేకరించిన భూగర్భ, భౌగోళిక, రసాయన, ఉపగ్రహ డేటాను విశ్లేషించడానికి ఒక ప్రధాన హబ్‌గా పనిచేస్తుంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీల సహాయంతో ఖనిజాలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక మ్యాపులను రూపొందిస్తుంది. దీనివల్ల సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు నష్టభయం కూడా తగ్గుతుంది. రాబోయే ఐదేళ్లలో దాదాపు 8.5 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఖనిజ లభ్యతపై ఈ కేంద్రం విశ్లేషణ చేయనుంది.ఎలక్ట్రిక్ వాహనాలు,పునరుత్పాదక ఇంధనం, సెమీకండక్టర్లు, రక్షణ రంగాలకు అవసరమైన ఖనిజాల కోసం ఇతరదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న జాతీయ లక్ష్యంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో ఇదొక ముందడుగు. ఈ పరిణామం ఖనిజ భద్రత కోసం సాంకేతికతను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని, ఇది దేశ ఖనిజాన్వేషణలో ఇదొక వేగవంతమైన మలుపు అని అధికారులు చెపుతున్నారు.



# ధరలు పెంచినా సిలిండర్‌పై

# ఇప్పటికీ రూ.700 భారం

**ముంబయి, జూన్ 7:** వంటగ్యాస్ సిలిండర్లపై రెండోసారి రూ.29లు పెంచినప్పటికీ చమురు మార్కెటింగ్ కంపెనీలకు ప్రతిసిలిండర్‌పైనే రూ.700 అదనపు భారం తప్పడంలేదని పెట్రోలియం మంత్రిత్వశాఖ ప్రకటించింది. మూడునెలల్లోనే రెండోసారి సిలిండర్ ధరలను పెంచిన సంగతి తెలిసిందే. సౌదీ కాంట్రాక్టుధర ప్రకారం సిలిండర్ సరఫరా ధర రూ.1600కి పెరిగింది. అలాగే గత ఫిబ్రవరి 28నుంచి ఎల్పీజీ దరచూస్తే సిలిండరుకు రూ.46 పెరిగిందని మంత్రిత్వశాఖ మోప్ఎన్‌జి ప్రకటించింది. ఈప్రకారంచూసేనత కమర్షియల్ సిలిండర్లు ఢిల్లీలో 3113.50గా ఉంది. కిలోకు 164గా ఉంది. గృహావసరాలకు అయితే కిలోకు రూ.66గా భారం పడుతోంది. ఉజ్వల సిలిండర్లకు ఈ పెంపుతో రూ.642గా మారితే జనరల్ కస్టమర్లకు రూ.942గా ఉంది. గత సంవత్సరం చివరినాటికి డొమెస్టిక్ ఎల్పీజీ భారం రూ.60వేల కోట్లకు చేరిందని, అంతకు ముందు ఏడాది కేవలం రూ.1338కోట్లుమాత్రమే ఉందని పెట్రోలియం మంత్రిత్వశాఖ చెప్పింది. ఇందుకు కేంద్ర కేబినెట్ చమురు కంపెనీలకు రూ.30వేల కోట్ల పరిహారం కూడా ప్రకటించాయి. ప్రస్తుతం ఉజ్వల సిలిండర్లు అంతర్జాతీయ ధరలతో పోలిస్తే 60 శాతం డిస్కౌంట్‌కే పంపిణీ చేస్తున్నారు. ఇక సాధారణ సిలిండర్లు అంతర్జాతీయ ధరల్లో 45 శాతం డిస్కౌంట్‌ధరలకే దేశంలో రూ.942కి అందిస్తున్నట్లు మోప్ఎన్జీ వెల్లడించింది. ఎలీపజీ సరఫరా మొత్తం 54శాతం హార్ముజ్ జలసంధి గుండానే వస్తుండటంతో పశ్చిమాసియా సంక్షోభం ఎల్పీజీ, పెట్రోడీజిల్‌రంగాలపై అధికంగా పడిందని పెట్రోలియంగ్యాస్ మంత్రిత్వశాఖ మోప్ఎన్జీ వెల్లడించింది.

# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు

## కిలో వెండి రూ. 2.70 లక్షలు

**ముంబయి, జూన్ 7:** దేశీయ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా మూడో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు తోడవడమే కాకుండా, దేశీయంగా డిమాండ్ మందగించడంతో పసిడి ధరలు దిగివస్తున్నాయి. ఆదివారం నాటి ట్రేడింగ్‌లో, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.300 తగ్గి, రూ.1,52,730 వద్దకు చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1.40 లక్షల వద్ద కొనసాగింది.

నగరంలో కిలో వెండి ధర రూ.2.7 లక్షలుగా నమోదైంది. విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగాయి. ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,54,910గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1. 42 లక్షలుగా ఉంది. ముంబైలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,730 వద్ద, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.40లక్షల వద్ద



కొనసాగింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,40,150 వద్ద కొనసాగింది.ముందురోజు భారత మార్కెట్లో మేలిమి బంగారం సగటు ధర రికార్డు స్థాయిలో రూ.3,000 మేర తగ్గగా, వెండి ధరలోనూ రూ.10,000 మేర కోత పడింది.

# గడువులోపే ఐటి రిటర్నులు దాఖలు ఎంతోమేలు

## పన్ను చెల్లింపుదారులకు ఐటి శాఖ సూచనలు

**ముంబయి, జూన్ 7:** పన్నురిటర్నులను గడువు తేదీవరకూ వేచిచూడకుండా సత్వరమే దాఖలుచేస్తే పలు ప్రయోజనాలు కూడా ఉంటాయని, గడువు దాటాక చేస్తే జరిమానాలు, వడ్డీలు కూడా తప్పవని పన్నులరంగ నిపుణులు చెపుతున్నారు. 2025-26ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. పన్ను చెల్లింపుదారులు గడువు తేదీ వరకు వేచి చూడకుండా, వీలైనంత త్వరగా రిటర్నులు సమర్పించాలని ఆదాయపన్ను శాఖ, ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తుగా ఫైలింగ్ చేయడం వల్ల జరిమానాల నుంచి తప్పించుకోవడమే కాకుండా, కీలకమైన ఆర్థిక ప్రయోజనాలను పొందవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. నిర్ణీత గడువు తర్వాత రిటర్న్లు దాఖలు చేస్తే సెక్షన్ 234ఎఫ్ కింద ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది.వార్షిక ఆదాయం 5 లక్షల కంటే ఎక్కువ ఉన్నవారికి రూ. 5,000, రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి రూ. 1,000 జరిమానా విధిస్తారు. వీటితో పాటు చెల్లించాల్సిన పన్నుపై సెక్షన్ 234ఎప్రకారం ప్రతి నెల ఒక శాతం చొప్పున అదనపు వడ్డీ భారం పడుతుంది. స్టాక్స్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఆస్తుల విక్రయాలు లేదా వ్యాపారాల్లో నష్టాలు సంభవిస్తే, వాటిని భవిష్యత్తులో వచ్చే లాభాలతో సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. గడువులోగా ఐటీఆర్ దాఖలు చేసిన వారికి మాత్రమే ఈ ప్రయోజనం ఉంటుంది. ఆలస్యంగా ఫైల్‌చేస్తే ఈ కీలక ప్రయోజనాన్ని కోల్పోవాల్సి వస్తుంది.గృహ, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులు లేదా విదేశీ ప్రయాణాల కోసం వీసా దరఖాస్తు చేసుకునే సమయంలో ఐటీఆర్ పత్రాలు




ప్రధాన ఆదాయ ధృవీకరణగా ఉపయోగపడతాయి. సకాలంలో రిటర్నులు సమర్పించడం పన్ను చెల్లింపుదారుల ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తుంది. ఇది రుణ, వీసా ఆమోద ప్రక్రియలను మరింత సులభతరం చేస్తుంది. ఆఖరి నిమిషంలో ఈఫైలింగ్ పోర్టల్‌పై రద్దీ పెరిగి సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, రిటర్నులను ఫైల్ చేయడం ఉత్తమమని ట్యాక్స్ నిపుణులు సూచిస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.